www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మీపై చర్యలు ఎందుకు తీసుకోరాదు?


'కాళేశ్వరం' బాధ్యులైన 38 మంది అధికార్లకు షోకాజ్

విజిలెన్స్ నివేదిక ఆధారంగా సర్కారు చర్యలు

వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం

ఆ తర్వాత క్రిమినల్ కేసులు, శాఖాపరమైన చర్యలు!

12



బుధవారం | 18-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) :23 సంచిక (Issue) : 80 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, బహుళ పక్షం తిథి: సప్తమి మ.1.35 తదుపరి అష్టమి, నక్షత్రం: పూర్వాభాద్ర రా.12.23 తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: ఉ.7.15-8.49, దుర్ముహూర్తం: ఉ.11.50-12.42, అమృతఘడియలు: సా.4.36-6.09, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 5.45, సూర్యాస్తమయం: 6.47 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సిట్ ఎదుట వాంగ్మూలం ఇచ్చిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్. చిత్రంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ తదితరులు



సరి'హద్దు'లు దాటిన ఫోన్ ట్యాపింగ్

జాబితాలో తెలంగాణతోపాటు ఏపీ నేతల ఫోన్లు కూడా!

ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల కదలికలు, సంభాషణలపై నిఘా

ఎప్పటికప్పుడు ఆ వివరాలు నాటి ఏపీ సీఎం జగన్‌కు..

తవ్వుతున్న కొద్దీ బయటపడుతున్న ప్రభాకర్‌రావు లీలలు

నేడు ఆయనను మరోసారి విచారించనున్న సిట్

ఎవరి ఆదేశాలతో ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్నది నిర్ధారించుకునే ప్రయత్నంలో అధికారులు

టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, గాలి అనిల్‌కుమార్, గద్వాల నేత సరిత వాంగ్మూలాల నమోదు

ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్‌తోపాటు సంబంధిత అధికారులను శిక్షించాల్సిందే: మహేశ్‌గౌడ్

నేడు సిట్ ముందుకు బీజేపీ నాయకులు!

హైదరాబాద్/వికారాబాద్/పటాన్‌చెరు/షాద్‌నగర్ అర్బన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సరిహద్దులు దాటింది. తెలంగాణలోని సొంత పార్టీ సహా అన్ని రాజకీయ పార్టీల నాయకుల ఫోన్లతోపాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొందరు రాజకీయ నేతల ఫోన్లనూ ట్యాప్ చేసినట్టు సమాచారం. తన ఫోన్‌ను తెలంగాణ ఎస్ఐబీ అధికారులు ట్యాప్ చేశారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల గతంలోనే ఆరోపించారు. షర్మిల ఫోన్‌తోపాటు ఆమె ఎవరెవరితో మాట్లాడుతుంటే వారందరి ఫోన్లను కూడా ఎస్ఐబీ అబ్జర్వేషన్‌లో పెట్టిందని సిట్ విచారణలో వెల్లడైనట్టు సమాచారం. షర్మిలకు సంబంధించి ఒక కోడ్‌నేమ్ వాడారని.. ఆమె కదలికలు, సంభాషణలను రికార్డు చేసి, నాటి ఏపీ సీఎం వైఎస్ జగన్‌కు పంపించారని తెలిసింది. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా పనిచేసే ద్వితీయ శ్రేణి నేతలు మొదలు రాష్ట్ర నాయకత్వం వరకు ఫోన్లను ట్యాప్ చేశారని.. నెలల తరబడి

మిగతా 12వ పేజీలో...

యుద్ధంలోకి అమెరికా?

ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో మాకు పక్కాగా తెలుసు: ట్రంప్

ప్రస్తుతానికి హతమార్చం.. ఇరాన్ లొంగిపోవాలి

ఆ దేశం వద్ద అణ్వాయుధం అనేది ఉండకూడదు

సమస్యకు నిజమైన ముగింపు కోరుకుంటున్నాం

టెహ్రాన్‌ను అక్కడి పౌరులు తక్షణం వీడి వెళ్లిపోవాలి

ట్రంప్ హెచ్చరికలు.. జీ7నుంచి అర్ధంతరంగా అమెరికాకు

తాను తిరిగి వెళుతున్నది కాల్పుల విరమణ ఒప్పందం కోసం కాదని.. విషయం అంతకంటే పెద్దదని స్పష్టీకరణ

ఈశాన్య సిరియా నుంచి అమెరికా బలగాల తరలింపు!

డీగో గార్షియాలో ఇప్పటికే అమెరికా బీ2 స్టెల్త్ బాంబర్లు





టెహ్రాన్, టెల్‌అవీవ్, జూన్ 17: పతాకస్థాయికి చేరిన ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలో.. అమెరికా కూడా జోక్యం చేసుకోనుందా? ఇజ్రాయెల్‌కు తోడుగా యుద్ధరంగంలోకి దిగనుందా? గడిచిన 24 గంటలుగా శరవేగంగా జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే ఈ ప్రశ్నలకు అవుననే సమాధానమే వస్తోంది. ఎన్నిసార్లు హెచ్చరించినా తమతో అణు ఒప్పందం కుదుర్చుకోలేదన్న కోపంతో ఇరాన్‌పై రగిలిపోతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. "ఇరాన్ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదు. ఈ విషయాన్ని నేను పదే పదే చెబుతున్నాను. టెహ్రాన్ ప్రజలంతా తక్షణమే ఆ నగరాన్ని వీడి వెళ్లిపోండి" అని హెచ్చరిస్తూ సోమవారం తన సొంత సామాజిక మాధ్యమమైన 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్టు పెట్టారు. అనంతరం.. కెనడాలో జరుగుతున్న జీ7 సమావేశాన్ని వీడి అర్ధంతరంగా అమెరికాకు పయనమయ్యారు. జాతీయ భద్రతా సలహాదారులతో సమావేశం నిర్వహించడానికి 'సిచ్యువేషన్ రూమ్'ను సిద్ధం చేయాలని శ్వేతసౌధం వర్గాలను ఆదేశించారు. "సుప్రీం లీడర్‌గా చెప్పుకొంటున్న సదరు నేత ఎక్కడ దాక్కున్నాడో మాకు పక్కాగా తెలుసు. ఆయన్ను లక్ష్యంగా చేసుకుని దాడి చేయడం మాకు చాలా సులువు. కానీ, అక్కడ ఆయన క్షేమంగానే ఉన్నారు. ఆయన్ను మేం చంపం.. కనీసం ప్రస్తుతానికి!" అని మంగళవారం మరో

మిగతా 2వ పేజీలో...

టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు

మొస్సాద్ హెడ్‌క్వార్టర్స్‌ను తాకిన ఇరాన్ క్షిపణి

హైఫా రిఫైనరీ వద్ద ఆగని మంటలు

ఇజ్రాయెల్ చేతికి బంకర్ బస్టర్ బాంబ్

ఇరాన్‌పై దాడికి అమెరికా సహకారం?

2

పశ్చిమాసియాలో గగనతలం మూసివేత!

చిక్కుకుపోయిన వేల మంది ప్రయాణికులు

ఇరాన్‌లో పది వేల మంది భారతీయ విద్యార్థులు

వారిని తీసుకొచ్చే యత్నాల్లో విదేశాంగ శాఖ

గోదావరి-బనకచర్లను అడ్డుకుందాం!

ప్రాజెక్టు నిర్మించకుండా ఏపీపై సంఘటిత పోరాటం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

నేడు అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం

అందరికీ ఆహ్వానం పంపిన సర్కారు

ప్రాజెక్టు వల్ల తెలంగాణకు కలిగే నష్టాలపై ప్రజంటేషన్ ఇవ్వనున్న మంత్రి ఉత్తమ్

ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రత్యేక అతిథులుగా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు ఆహ్వానం

అనుమతులన్నీ పొందాకే నిర్మిస్తాం

రాజకీయ దురుద్దేశంతోనే బనకచర్లపై తెలంగాణ నాయకుల ఫిర్యాదులు

కాళేశ్వరం విచారణను దారి మళ్లించేందుకే!

జగన్ నోరు విప్పడం లేదెందుకు?

ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును నిర్మించకుండా సంఘటితంగా పోరాటం చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టుకు ఎటువంటి ఆర్థిక సహాయం, అనుమతులు ఇవ్వకుండా కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి వీలుగా బుధవారం సాయంత్రం 4 గంటలకు రాష్ట్రానికి చెందిన రాజ్యసభ, లోక్‌సభ ఎంపీలతో సచివాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. ఈ మేరకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీల ఎంపీలకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వయంగా ఫోన్ చేసి ఆహ్వానించారు. ఈ భేటీకి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ప్రత్యేక అతిథులుగా హాజరు కావాలని రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు

మిగతా 13వ పేజీలో...



గోశాలల నిర్వహణపై విధానపత్రాన్ని సీఎం రేవంత్‌కు అందజేస్తున్న మంత్రి శ్రీహరి, ఐఏఎస్ అధికారులు

గో సంరక్షణకు..

ఎంత ఖర్చైనా వెనుకాడం

గోవుల సంరక్షణపై సమగ్ర విధానం రూపొందిస్తాం

ముగ్గురు ఉన్నతాధికారులతో కమిటీ నియామకం

ముందుగా వేములవాడ, యాదగిరి గుట్ట, ఎనికేపల్లి, పశుసంవర్ధక శాఖ వర్సిటీ సమీపంలో పెద్ద గోశాలలు

వేములవాడలో 100 ఎకరాలకు తగ్గకుండా నిర్మాణం

గోసంరక్షణపై అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గోవుల సంరక్షణకు ఎంత ఖర్చైనా ప్రభుత్వం వెనుకాడబోదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గోవుల సంరక్షణకు సమగ్ర విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ముగ్గురు అధికారులతో ఒక కమిటీని నియమించారు. గోవుల సంరక్షణ కోసం వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయాలని ఈ కమిటీని కోరారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్,

మిగతా 13వ పేజీలో...



14

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి ముందస్తు బెయిల్ నిరాకరణ

క్వారీ యజమానిని బెదిరింపుల కేసులో ఎమ్మెల్యేకు హైకోర్టులో ఎదురుదెబ్బ



14

'తుక్కుగూడ డబుల్ ఇళ్ల' లబ్ధిదారుల జాబితా కొట్టివేత

అధికారులు మార్గదర్శకాల్ని పాటించలేదు

అర్హులైన పిటిషనర్లు, ఇతర స్థానికులకు 3 నెలల్లో ఇళ్లు ఇవ్వాలి: హైకోర్టు

■ మావోయిస్టుల ఘాతుకం

ముగ్గురి హత్య.. 12 మంది కిడ్నాప్

మృతులంతా లొంగిపోయిన నక్సల్స్ కుటుంబ సభ్యులు

10

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో ఘటన

కులగణన ఉద్దేశం కేంద్రానికి లేదు


కాలహరణం, మీడియాలో ప్రచారం.. ప్రభుత్వ లక్ష్యం

మహిళా రిజర్వేషన్ మాదిరే కులగణనపైనా చిత్తశుద్ధి లేదు

ఉంటే.. తెలంగాణ విధానాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేయాలి

జనగణనకు 10 వేల కోట్లు కావాలి.. 576 కోట్లే కేటాయించారు

కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ విమర్శలు.. దుష్ప్రచారమన్న బీజేపీ



న్యూఢిల్లీ, జూన్ 17: కులగణనపై కాంగ్రెస్, బీజేపీ నడుమ మళ్లీ విమర్శల యుద్ధం మొదలైంది. జనాభా లెక్కల సేకరణకు కేంద్ర హోం శాఖ సోమవారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో కులగణన ప్రస్తావనే లేదని, అసలది జరిపే ఉద్దేశమే మోదీ ప్రభుత్వానికి లేదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ ఆరోపించారు. రాజకీయ లబ్ధి పొందాలన్న లక్ష్యం నెరవేరకపోవడంతో ఆ పార్టీ దుష్ప్రచారాలకు దిగుతోందని బీజేపీ మండిపడింది. పైలట్ మంగళవారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. కులగణనకు కేంద్రం కావాలనే జాప్యం చేస్తోందన్నారు. 'ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కులగణనకు డిమాండ్ చేస్తోంది. మోదీ ప్రభుత్వం రాహుల్ ఒత్తిడికి తలొగ్గి జనగణనతోపాటే కులగణన చేపడతామని ప్రకటించింది. కానీ క్షేత్ర స్థాయిలో వాస్తవాలు వేరుగా

మిగతా 10వ పేజీలో...



కొత్త రైతులకూ 'భరోసా'!

జూన్ 5లోపు రిజిస్ట్రేషన్ అయి ఉంటే చాలు

ఏఈవోలకు ధ్రువపత్రాలు ఇస్తే పోర్టల్‌లో నమోదు

ఈ నెల 20వ తేదీ వరకు గడువు

మూడు ఎకరాల వరకు రైతుభరోసా జమ!

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కొత్తగా భూమి యాజమాన్య హక్కులు పొందిన రైతులకు కూడా రైతు భరోసా పథకం వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ నెల 5ను కటాఫ్ తేదీగా పెట్టారు. అంటే ఈనెల 5లోపు క్రయవిక్రయాలు, మ్యుటేషన్ జరిగి, యాజమాన్య హక్కులు పొందిన రైతులకు రైతు భరోసాను

మిగతా 13వ పేజీలో...

ఇంజనీరింగ్‌లో మళ్లీ 'నచ్చిన సబ్జెక్టులు'!

దశాబ్దం తర్వాత అమల్లోకి సీబీసీఎస్

సన్నాహాలు చేస్తున్న జేఎన్‌టీయూ

బీటెక్ కొత్త నిబంధనల్లో క్రెడిట్స్ మినహాయింపు

మొక్కుబడి సబ్జెక్టులకూ ఇకపై క్రెడిట్స్ వర్తింపు



హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు తాము చదువుతున్న కోర్సుల్లోని కొన్ని సబ్జెక్టులకు బదులు, ఇతర కోర్సుల్లో నచ్చిన సబ్జెక్టులను ఎంచుకోవచ్చు. అలాగే తమకు నచ్చని లేదా కఠినంగా ఉన్న సబ్జెక్టుల నుంచి మినహాయింపు కూడా పొందవచ్చు. ఈ విధానాన్ని 'చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్)' అంటారు. విద్యార్థులకు ఎంతో ఉపయుక్తమైన ఈ విధానాన్ని దాదాపు దశాబ్దం తర్వాత జేఎన్‌టీయూ మళ్లీ తెరపైకి తెచ్చింది. ఈ విద్యా సంవత్సరం(2025-26) నుంచి సీబీసీఎస్‌ను అమలు చేసేందుకు కొత్త మార్గదర్శకాల (ఆర్25)ను రూపొందిస్తోంది. వాస్తవానికి

మిగతా 3వ పేజీలో...



రోబోలకూ స్పర్శ అనుభూతి!

- వేడి, నొప్పిని గుర్తించే రోబోటిక్ చర్మం అభివృద్ధి
- కేంబ్రిడ్జ్ పరిశోధకుల ఆవిష్కరణ
- ఈ చర్మంతో సున్నితమైన, తెలివైన సెన్సర్‌గా మారనున్న రోబోటిక్ చేయి

10

కెనడాలో మోదీపై దాడికి
ఖలిస్థానీల కుట్ర


కెనడాలో మోదీకి స్వాగతం

టొరంటో, జూన్ 17: ప్రధాని మోదీ కెనడా పర్యటన సందర్భంగా ఖలిస్థానీ వేర్పాటువాదులు ఆకస్మిక దాడికి కుట్రపన్నారు. జీ7 సదస్సులో పాల్గొనేందుకు మోదీ మంగళవారం కెనడాకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో అల్బెర్టా రాష్ట్రంలోని కల్గరీ నగరంలో నిరసన తెలిపేందుకు ఖలిస్థానీ వేర్పాటువాదులు గుమిగూడారు. ఈ కార్యక్రమాన్ని మోదీకి వ్యతిరేకంగా 'ఆకస్మిక దాడి'గా వేర్పాటువాదులు అభివర్ణించుకున్నారు. ఈ సందర్భంగా హింసాత్మక నినాదాలు చేశారు. 'మోదీ రాజకీయాలను చంపేయండి(కిల్ మోదీ పాలిటిక్స్)' అంటూ కెనడా ప్రధాని మార్క్ కార్నీకి నిరసనకారులు పిలుపునిచ్చారు. అలాగే, 'భారత రాజకీయాలను చంపేయండి(కిల్ ఇండియా పాలిటిక్స్)' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నిరసనకారులు పిలుపునిచ్చారు. కొందరు నిరసనకారులు దూకుడుగా దూసుకొచ్చి త్రివర్ణ పతాకాన్ని కిందపడేసి తొక్కారని, చించివేశారని కెనడా జర్నలిస్టు డానియెల్ బార్డ్‌మన్ తెలిపారు. సిక్స్ ఫర్ జస్టిస్ సంస్థ ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఖలిస్థానీ వేర్పాటువాదుల తీరును సిక్కు సంస్థలు ఖండించాయి.

క్వాంటమ్ కమ్యూనికేషన్‌తో డేటా సురక్షితం

▸▸ సైబర్ సెక్యూరిటీలో కీలక ముందడుగు

న్యూఢిల్లీ, జూన్ 17: డీఆర్‌డీవో, ఐఐటీ ఢిల్లీ కలిసి క్వాంటమ్ కమ్యూనికేషన్‌లో ప్రయోగాత్మక పురోగతి సాధించాయి. క్వాంటమ్ ఎంటాంగిల్‌మెంట్‌ను ఉపయోగించి వారు ఒక కిలోమీటరు దూరం నుంచి ఫ్రీ-స్పేస్ క్వాంటమ్ ద్వారా సమాచారాన్ని సురక్షితంగా చేరవేశారు. క్వాంటమ్ కమ్యూనికేషన్ డొమైన్‌లో భారత్ ప్రయోగాత్మక పురోగతి ప్రదర్శించిందని, ఇది సైబర్ భద్రతలో కీలక ముందడుగు అని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. క్వాంటమ్ ఎంటాంగిల్‌మెంట్ అనేది క్వాంటమ్ కమ్యూనికేషన్‌లో చాలా కీలకం. ఇది రెండు లేదా అంతకంటే ఎక్కువ క్వాంటమ్ కణాల మధ్య సంబంధాన్ని సూచిస్తుంది. ఇవి ఎంత దూరంలో ఉన్నా ఒకదానితో ఒకటి అనుసంధానించబడి ఉంటాయి. డీఆర్‌డీవో, ఐఐటీ ఢిల్లీ బృందం ఇప్పుడు ఈ సాంకేతికతను ఉపయోగించి సురక్షితమైన కమ్యూనికేషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ ప్రయోగంలో భాగంగా శాస్త్రవేత్తలు ఫైబర్‌ను కాకుండా గాలిని ఉపయోగించారు. ఈ పురోగతి క్వాంటమ్ కీ డిస్ట్రిబ్యూషన్ (క్యూకేడీ), క్వాంటమ్ నెట్‌వర్క్‌ల అభివృద్ధి, క్వాంటమ్ సైబర్ భద్రతలో రియల్ టైమ్ అనువర్తనాలకు మార్గం సుగమం చేస్తుందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. "ఐఐటీ ఢిల్లీ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ఫ్రీ-స్పేస్ ఆప్టికల్ లింక్ ద్వారా క్వాంటమ్ ఎంటాంగిల్‌మెంట్‌ను ఉపయోగించి ఒక కిలోమీటరు కంటే ఎక్కువ దూరం సమాచారాన్ని సురక్షితంగా పంపించాం" అని ప్రకటించింది. దీంతో భారత్ కొత్త క్వాంటమ్ యుగంలోకి ప్రవేశించిందని తెలిపింది. ఈ చరిత్రాత్మక విజయాన్ని అందించిన డీఆర్‌డీవో, ఐఐటీ ఢిల్లీని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. భవిష్యత్తు యుద్ధాల్లో ఇది 'గేమ్ చేంజర్' అవుతుందని చెప్పారు.

'నో ఫ్లై జోన్'లుగా అమర్‌నాథ్ యాత్ర మార్గాలు

శ్రీనగర్, జూన్ 17: భద్రత కారణాల దృష్ట్యా అమర్‌నాథ్ యాత్ర మార్గాలను 'నో ఫ్లై జోన్'లుగా ప్రకటిస్తూ జమ్మూ-కశ్మీర్ యంత్రాంగం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. యాత్ర సాగే పహల్గాం, బల్తాల్ మార్గాలకు ఇది వర్తిస్తుంది. దీని ప్రకారం విమానాలు, హెలికాప్టర్లు తిరగడం సహా యూఏవీలు, డ్రోన్లు, చివరకు బెలూన్లు ఎగురవేయడం కూడా నిషేధం. జులై ఒకటో తేదీ నుంచి ఆగస్టు పదో తేదీ వరకు ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయి. ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర ఆరోగ్య పరిస్థితులు, భద్రతా దళాల నిఘా విషయంలో ఇందుకు మినహాయింపు ఉంది.

హోం శాఖ సమన్వయంతో అగ్నివీరులకు ఉపాధి

న్యూఢిల్లీ, జూన్ 17: ఆర్మీలో విధి నిర్వహణను పూర్తి చేసుకున్న మాజీ అగ్నివీర్‌లకు ఉపాధి కల్పించే విషయమై సమన్వయం చేసే బాధ్యతలను కేంద్ర హోం శాఖకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. వారికి ఇతర రకాల ఉద్యోగాలు, ఉపాధి కల్పించే విషయమై వివిధ శాఖలతో సమన్వయం చేసుకోనుంది. ఇందుకు సంబంధించిన బిజినెస్ రూల్స్‌లో సవరణ చేస్తూ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఉద్యోగాల సమాచారం తెలుసుకునేందుకు కొత్తగా పోర్టల్‌ను కూడా ప్రారంభించనుంది.

గుజరాత్‌లో హత్యాకాండ జరిగితే మోదీ ఎందుకు రాజీనామా చేయలేదు?

▸▸ బీజేపీ నేతలకు కర్ణాటక సీఎం సిద్దరామయ్య ప్రశ్న

బెంగళూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లో 2002లో జరిగిన హత్యాకాండలో అన్ని మతాలకు చెందిన రెండు వేలమంది అమాయకుల ప్రాణాలు కోల్పోతే అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ ఎందుకు రాజీనామా చేయలేదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రశ్నించారు. ఆర్‌సీబీ విజయోత్సవాల సమయంలో చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటకు నైతిక బాధ్యత వహిస్తూ సీఎం, ఉపముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆందోళనలు చేయడంపై ఆయన మండిపడ్డారు. బెంగళూరులో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... అప్పట్లో బీజేపీ అగ్రనేత, ప్రధాని అటల్ బిహారీ వాజపేయి సీఎం పదవికి రాజీనామా చేయాలని మోదీకి సూచించారని, అయినా మోదీ పాటించలేదని పేర్కొన్నారు.

పేలుడు పదార్థాలపై త్వరలో కొత్త చట్టం

న్యూఢిల్లీ, జూన్ 17: ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా పేలుడు పదార్థాలకు సంబంధించి కొత్త చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. 141 ఏళ్ల క్రితం నాటి ఎక్స్‌ప్లోజివ్స్ యాక్ట్-1884ను రద్దు చేసి కొత్త చట్టాన్ని రూపొందించనుంది. ఇందుకు సంబంధించిన ముసాయిదా బిల్లును ప్రజలకు అందుబాటులో ఉంచింది. దీనిపై జులై 17లోగా అభిప్రాయాలు చెప్పాలని పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య శాఖ కోరింది. 1884లో ఆమోదించిన ఆ చట్టాన్ని 1978లో సమగ్రంగా సవరించారు. దాని ఆధారంగా పెద్ద, చిన్న సంస్థలు పేలుడు పదార్థాల తయారీ, అమ్మకం, ఎగుమతి,దిగుమతుల కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.

యుద్ధంలోకి అమెరికా?


యుద్ధంలో కుమారుడిని కోల్పోయిన ఓ తల్లి రోదన



(మొదటి పేజీ తరువాయి)

పోస్టు పెట్టారు. పౌరులపైన, అమెరికా సైనికులపైన క్షిపణి దాడులను తాము సహించబోమని.. తమ సహనం నశిస్తోందని అందులో పేర్కొన్నారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని హెచ్చరిస్తూ మరో పోస్టు పెట్టారు. ఇరాన్ గగనతలం మొత్తం పూర్తిగా తమ నియంత్రణలో ఉందని హెచ్చరించారు. "ఇరాన్ వద్ద మంచి స్కై ట్రాకర్లు, ఇతర రక్షణ పరికరాలు ఉండొచ్చు. కానీ, వాటికి మా పరికరాలతో పోలికే లేదు" అని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఈశాన్య సిరియాలో ఉన్న రెండు బేస్‌ల నుంచి అమెరికా బలగాలు వైదొలగాయి. ఆ బలగాలను ఎక్కడికి తరలించిందీ తెలియట్లేదు. ఇంకోవైపు.. అమెరికా నౌకాదళం తన సూపర్ క్యారియర్ (విమాన వాహక నౌక) యూఎస్ఎస్ నిమిట్జ్‌ను దక్షిణ చైనా సముద్రం నుంచి మధ్యప్రాచ్యం దిశగా.. వాయుసేనకు చెందిన 21 రీఫ్యూయెలింగ్ ట్యాంకర్లను (కేసీ-135 ఆర్, కేసీ-46ఏ) అమెరికా నుంచి యూరప్‌కు పంపుతున్నట్టు 'ద వార్‌జోన్' వార్తా సంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. మరోవైపు.. మధ్య టెహ్రాన్‌లో 3.3 లక్షల మంది ఉండే ఒక ప్రాంతాన్ని తక్షణమే ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరిక జారీ చేసింది. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలోనే ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధంలో అమెరికా కూడా జోక్యం చేసుకుంటుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇరాన్ గెలవదు..

జీ7 సదస్సు నిమిత్తం కెనడాకు వెళ్లిన ట్రంప్.. ఈ యుద్ధంలో అమెరికా జోక్యంపై మీడియా అడిగిన ప్రశ్నకు తొలుత సమాధానం చెప్పడానికి నిరాకరించారు. అయితే.. ఇరాన్ ఈ యుద్ధాన్ని గెలవలేదని అక్కడ ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా మించిపోలేదని.. పరిస్థితులు చేయిదాటిపోకముందే ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని కట్టిపెట్టాలని హెచ్చరించారు. ఇరాన్ తమతో అణు ఒప్పందం కుదుర్చుకోవాలని సూచించారు. తర్వాత అర్ధంతరంగా జీ7 సమావేశాన్ని వీడి వెళ్లిపోయే ముందు.. "ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదు" అని ట్రూత్ సోషల్‌లో మరో పోస్ట్ పెట్టారు. అధ్యక్ష విమానంలో అమెరికాకు వెళ్లే సమయంలో కూడా మీడియాతో ఆయన ఇదే మాట చెప్పారు (ఇదే మాటను ఆయన పదేపదే చెబుతుండడం గమనార్హం). ఇరాన్‌తో అణు వివాదానికి శాశ్వత ముగింపు పలకడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. "కాల్పుల విరమణ కాదు. ఈ అంశానికి ఒక ముగింపు.. నిజమైన ముగింపు కావాలి" అని వ్యాఖ్యానించారు. ఇందుకోసం ఇరాన్‌తో చర్చలకు తమ ప్రత్యేక రాయబారి స్టీవెన్ విట్కాఫ్‌ను గానీ, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌నుగానీ పంపిస్తానని తెలిపారు. ట్రంప్ ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణకు కృషి చేస్తున్నారంటూ ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ చేసిన వ్యాఖ్యను తిరస్కరించిన ట్రంప్.. "జీ7 సదస్సు నుంచి నేను తిరిగి వెళ్తున్నది (ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య) కాల్పుల విరమణ ఒప్పందం కోసమని.. ఎప్పుడూ ప్రచారాన్ని కోరుకునే ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ పొరపాటుగా చెప్పారు. అది తప్పు. నేను వాషింగ్టన్‌కు ఎందుకు వెళ్తున్నానో ఆయనకు అస్సలు తెలియదు. నేను వెళ్తున్నది మాత్రం కాల్పుల విరమణ కోసం కాదు. విషయం దానికంటే చాలా పెద్దది. ఇరాన్ అణ్వాయుధాలను కలిగి ఉండకూడదని నేను మొదట్నుంచీ చెబుతూనే ఉన్నాను" అని పేర్కొన్నారు.

అమెరికా తోడు.. అందుకేనా?

ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిరోధించడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ ఆ దేశంపై దాడులు ప్రారంభించినప్పటికీ.. ఒక్క నతాంజ్ యురేనియం శుద్ధి కర్మాగారాన్ని మాత్రమే ఒకింత దెబ్బతీయగలిగింది. ఇరాన్ అణు కార్యక్రమానికి అత్యంత కీలకమైన ఫార్డో యురేనియం శుద్ధి కేంద్రాన్ని ధ్వంసం చేయలేకపోయింది. కొండల నడుమ భూగర్భంలో 200 అడుగుల లోతున ఏర్పాటు చేసిన ఆ కేంద్రంలో యురేనియాన్ని 60 శాతం వరకూ శుద్ధి చేయడానికి ఉపయోగించే ఆర్‌ఐ-6 సెంట్రీఫ్యూజ్‌లు 2000 దాకా ఉన్నట్టు అంచనా. ఈ కేంద్రాన్ని కాపాడేందుకు రష్యన్ ఎస్-300 గగనతల రక్షణ వ్యవస్థలను ఇరాన్ నియోగించింది. మరోవైపు.. ఖమేనీ సైతం టెహ్రాన్ నగరానికి 340 కిలోమీటర్ల దూరంలోని లవీజాన్ ప్రాంతంలో భూగర్భంలో 200 అడుగుల లోతున ఉన్న ఒక బంకర్‌లో తలదాచుకున్నట్టు సమాచారం. ఖమేనీతోపాటు ఆయన కుమారుడు, మరికొందరు కుటుంబసభ్యులు కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ బంకర్లను ధ్వంసం చేయడానికి.. ఇజ్రాయెల్ వద్ద ఉన్న బంకర్ బస్టర్ బాంబులు సరిపోవు. దానికి అత్యంత శక్తిమంతమైన 14 వేల కిలోల జీబీయూ-57 పెనెట్రేటర్లు కావాలి. అవి అమెరికా వద్ద మాత్రమే ఉన్నాయి. వాటిని ప్రయోగించడానికి అవసరమైన బీ-2 స్టెల్త్ బాంబర్లు కూడా అమెరికా వద్ద ఉన్నాయి. రేడార్లకు చిక్కని స్టెల్త్ సామర్థ్యం గల ఈ బీ2 బాంబర్లు అమెరికా వద్ద 20 ఉన్నాయి. 200 అడుగుల లోతులో ఉన్న బంకర్లను సైతం తునాతునకలు చేసే జీబీయు-57 బాంబులను ప్రయోగించే ఏకైక యుద్ధ విమానం ఇదే. అందుకే ఈ విషయంలో ఇజ్రాయెల్ అమెరికా సాయాన్ని ఆశిస్తోంది.


ఇజ్రాయెల్ దాడితో ఇరాన్ స్టేట్ మీడియా సెంటర్‌లో మంటలు

లోకం తీరు



బీ 2 బాంబర్ల మోహరింపు..

ట్రంప్ అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టాక ఇరాన్ అణు కార్యక్రమంపై దృష్టి సారించి ఈ ఏడాది మార్చిలోనే.. ఆరు బీ2 స్టెల్త్ బాంబర్లను హిందూ మహాసముద్రంలోని డీగో గార్షియా దీవిలో మోహరించారు. మే నెలలో బీ 52 బాంబర్లను కూడా అక్కడికి తరలించారు. ఈ ద్వీపం ఇరాన్‌కు 4,842 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కానీ, బీ2 బాంబర్ల రేంజ్ 11 వేల కిలోమీటర్లు. అంటే.. అమెరికా తల్చుకుంటే బీ2 బాంబర్లు సురక్షితంగా ఇరాన్‌కు వెళ్లి అణు శుద్ధి కేంద్రాలున్న బంకర్లపై బాంబులు జారవిడిచి, వెనక్కి తిరిగి వచ్చేయగలవు. అలా వెళ్లాలంటే ఇరాన్ గగనతలంపై ఇజ్రాయెల్‌కు లేదా అమెరికాకు నియంత్రణ కావాలి. ఇరాన్ రాజధాని టెహ్రాన్ గగనతలంపై తమకు పూర్తి నియంత్రణ ఉందని ఇజ్రాయెల్ సైన్యం సోమవారమే ప్రకటించింది. ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడి మొదలుపెట్టిన రోజే ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలను, క్షిపణి వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని.. వాటిని తీవ్రంగా బలహీనం చేసిన సంగతి తెలిసిందే మంగళవారంనాడు ట్రంప్ సైతం.. ఇరాన్ గగనతలంపై తమకు పూర్తి నియంత్రణ ఉందని ప్రకటించారు. అంటే.. అమెరికా బీ2 బాంబర్లకు మార్గం సుగమమైనట్టే. అదే జరిగితే.. ఈ యుద్ధంలో అమెరికా కూడా అడుగు పెట్టినట్టే.

హోర్ముజ్ జలసంధిలో రెండు నౌకల ఢీ

గల్ఫ్ దేశాల నుంచి ప్రపంచానికి చమురు చేరవేతలో కీలక రవాణా మార్గమైన హోర్ముజ్ జలసంధిలో.. మంగళవారం రెండు నౌకలు పరస్పరం ఢీకొని తగలబడిపోయాయి! ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఈ జలసంధిని మూసేసే యోచనలో ఇరాన్ ఉన్న సంగతి తెలిసిందే. ఇలాంటి ఉద్రిక్త సమయంలో ఆ జలసంధిలో రెండు నౌకలు తగలబడిపోతున్నాయన్న వార్త ప్రపంచవ్యాప్తంగా కలకలం సృష్టించింది. అయితే.. ఈ ప్రమాదం వెనుక ఎలాంటి భద్రతాపరమైన కారణాలూ లేవని, నౌకల ఎలక్ట్రానిక్ సంకేతాలకు అంతరాయం కలగడం వల్లే ఒకదాన్నొకటి ఢీకొన్నాయని బ్రిటిష్ మారిటైమ్ సెక్యూరిటీ సంస్థ అంబ్రే తెలిపింది. ఈ నౌకల్లో ఒకటి ఫ్రంట్‌లైన్ ఈగిల్ ట్యాంకర్ కాగా.. రెండోది అడలిన్ ట్యాంకర్. ఫ్రంట్‌లైన్ ఈగిల్ ట్యాంకర్ ఇరాక్ నుంచి చైనాలోని ఝౌషాన్‌కు 2 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇక, అడలిన్ నౌక.. భారతదేశంలోని గ్లోబల్ షిప్పింగ్ హోల్డింగ్ లిమిటెడ్ కంపెనీకి చెందినది. ఈ నౌకలో ఉన్న 24 మందినీ కాపాడినట్టు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తీర రక్షకదళం ప్రకటించింది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ఈ మార్గంలో వెళ్లే వాణిజ్య నౌకల నేవిగేషన్ వ్యవస్థలకు అంతరాయం కలుగుతున్నట్టు సమాచారం.

పశ్చిమాసియాలో.. గగనతలం మూసివేత!

నిలిచిపోయిన విమానాల రాకపోకలు


మంగళవారం ఇరాన్ నుంచి బస్సుల్లో వెళ్లిపోతున్న పాకిస్తానీయులు

▸▸ ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం ఎఫెక్ట్

▸▸ టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు

▸▸ టెల్‌అవీవ్‌లోని మొస్సాద్ హెడ్‌క్వార్టర్స్‌ను తాకిన ఇరాన్ క్షిపణి

టెల్‌అవీవ్/టెహ్రాన్/న్యూఢిల్లీ, జూన్ 17: ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం మరింత విస్తరిస్తుండడంతో పశ్చిమాసియాలో చాలా వరకు దేశాలు గగనతలాన్ని మూసివేశాయి. ఇరు దేశాల నుంచి బాలిస్టిక్ క్షిపణి దాడులు కొనసాగుతుండడంతో.. విమానాల రాకపోకలను నిలిపివేశాయి. దీంతో.. లెబనాన్, జోర్డాన్, ఇరాక్‌లో విమాన ప్రయాణాలు ఆగిపోయాయి. పశ్చిమాసియాలో దాదాపు 10 వేల మంది ప్రయాణికులు చిక్కుకుపోయి ఉంటారని విశ్రాంత పైలట్, విమానయాన భద్రత నిపుణుడు జాన్ కాక్స్ పేర్కొన్నారు. ఇరాన్, ఇజ్రాయెల్ కూడా యుద్ధం ఆరంభం నుంచే విమానాల రాకపోకలను నిలిపివేసిన విషయం తెలిసిందే.! అయితే.. విదేశాల్లో చిక్కుకుపోయిన 2 లక్షల మంది పౌరులను వెనక్కి రప్పించేందుకు బుధవారం నుంచి పరిమితంగా విమానాలను అనుమతిస్తామని ఇజ్రాయెల్ ప్రకటించింది. అత్యవసర పరిస్థితుల కారణంగా విదేశాల్లో ఉన్న 700 మంది ఇజ్రాయెలీ వైద్యులను సైప్రస్ నుంచి నౌకల ద్వారా స్వదేశానికి తీసుకువస్తోంది. దేశంలో చిక్కుకుపోయిన 1500 మంది విదేశీయులను నౌకల్లో తరలిస్తున్నట్లు తెలిపింది. కాగా.. ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయులను రప్పించే ప్రయత్నం ప్రారంభమైనట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. తొలిరోజు 110 మంది విద్యార్థులను అర్మేనియా మీదుగా ఇరాన్ సరిహద్దు దాటించినట్లు పేర్కొంది. కాగా.. ఇరాన్‌లో సుమారు 10 వేల మంది భారతీయ విద్యార్థులు ఉన్నారు. వీరిని అర్మేనియాతోపాటు.. అజర్‌బైజాన్, తుర్కమెనిస్థాన్ మీదుగా భారత్‌కు రప్పిస్తామని విదేశాంగ శాఖ అధికారులు వివరించారు. ఇరాన్‌లోని భారతీయులు +98 9128109115, +98 9128109109 నంబర్లకు ఫోన్ ద్వారా, +98 901044557, +98 9015993320, +91 8086871709, +98 9177699036 నంబర్లకు వాట్సాప్ ద్వారా సంప్రదించాలని ఇరాన్‌లోని భారతీయులకు సూచించారు.

టెహ్రాన్‌పై వైమానిక దాడులు

ఇరాన్ గగనతలాన్ని తమ నియంత్రణలోకి తెచ్చుకున్నామని సోమవారం ప్రకటించిన ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) మంగళవారం తెల్లవారుజాము నుంచి వైమానిక దాడులను ప్రారంభించింది. ఇరాన్ వ్యాప్తంగా 200కు పైగా క్షిపణి లాంచర్లను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. తమ దాడుల్లో ఇరాన్ సైన్యానికి చెందిన ఖతమ్-అల్-అంబియా సెంట్రల్ హెడ్‌క్వార్టర్స్ జనరల్ అలీ షాద్మనీ చనిపోయినట్లు వెల్లడించింది. టెహ్రాన్ నుంచి ఇతర ప్రాంతాలకు ఇరానీల వలసలు పెరిగాయి. దీంతో.. పెట్రోల్ బంకులకు వాహనాలు పోటెత్తాయి. "టెహ్రాన్‌లోని పౌరులు వెంటనే నగరాన్ని ఖాళీ చేయాలి" అని అమెరికా అధ్యక్షుడు ఎక్స్‌లో హెచ్చరించడంతో.. పౌరులు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్తున్నారు. కాగా.. ఇరాన్‌పై దాడికి వాడిన డ్రోన్లను తయారు చేసేందుకు ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీని ధ్వంసం చేసినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది.

ఇజ్రాయెల్‌కూ భారీ నష్టం

ఇరాన్ క్షిపణి దాడుల్లో ఇజ్రాయెల్‌లో కూడా భారీ నష్టం జరుగుతోంది. హైఫా వద్ద ఉన్న బజాన్ చమురు రిఫైనరీపై సోమవారం దాడులు జరిగిన విషయం తెలిసిందే.! ఈ దాడుల్లో ప్రధాన ప్లాంట్‌కు నష్టం వాటిల్లకున్నా.. ఆవరణలో పార్క్ చేసిన భారీ ఆయిల్ ట్యాంకర్ ట్రక్కులు దహనమయ్యాయి. టెల్‌అవీవ్ శివార్లలోని రామత్ హషరోన్ పట్టణంలోనూ ఇరాన్ దాడులతో ఆవాస ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ ప్రధాన కార్యాలయంపై క్షిపణి దాడులు చేశామని ఇరాన్ ప్రకటించింది. గ్లిలోట్‌లోని అమన్ హెడ్‌క్వార్టర్స్‌ను కూడా ఇరాన్ క్షిపణులు ధ్వంసం చేసినట్లు తెలిపాయి. ఐడీఎఫ్ ఈ వార్తలను ఖండించింది. ఇరాన్ క్షిపణులను గాల్లోనే అడ్డుకున్నామని వివరించింది. "ఇరాన్ దాడులను ఇలాగే కొనసాగిస్తే.. ఖమేనీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది" అని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ హెచ్చరించారు.

పౌరుల భద్రతపై చేతులెత్తేసిన ఇరాన్!

తమ పౌరుల భద్రతపై ఇరాన్ చేతులెత్తేసిందా? ఎవరి భద్రత వారే చూసుకోవాలని స్పష్టం చేసిందా? ఈ ప్రశ్నలకు ఇస్లామిక్ కౌన్సిల్ ఆఫ్ గ్రేటర్ టెహ్రాన్ కౌన్సిల్ వైస్ చైర్మన్ పర్వీజ్ సర్వారీ మంగళవారం చేసిన ఓ ప్రకటన అవుననే సమాధానం చెబుతోంది. "ఈ సంక్షోభ సమయంలో పౌరులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికిప్పుడు సురక్షిత ప్రాంతాలను, కొత్త షెల్టర్లను నిర్మించడం సాధ్యం కాదు. అందుబాటులో ఉన్న వనరులను వాడుకోండి. సబ్‌వేలు, మెట్రో స్టేషన్లను ఆశ్రయించండి" అని ఆయన స్పష్టం చేశారు.

ఇరాన్ బ్యాంకులపై సైబర్ దాడులు!

ఇరాన్‌లోని బ్యాంకులను లక్ష్యంగా చేసుకుని పెద్ద ఎత్తున సైబర్ దాడులు జరుగుతున్నట్లు అరబ్ వార్తాసంస్థలు కథనాలను ప్రచురించాయి. ఇరాన్ వార్తాసంస్థ పార్స్ న్యూస్ సైతం.. ద బ్యాంక్ ఆఫ్ సెపాపై పెద్ద ఎత్తున సైబర్ దాడి జరిగినట్లు పేర్కొంది. దీంతో.. ఇరాన్ వ్యాప్తంగా ఆర్థిక లావాదేవీలపై తీవ్ర ప్రభావం పడింది. మొబైల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్ సేవలు నిలిచిపోయాయి. ఇరాన్ వ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలు స్తంభించాయి.

ఖమేనీ అధికారాలు కౌన్సిల్‌కు

ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ తన పరిధిలోని అధికారాలను ఐఆర్‌జీసీ సుప్రీం కౌన్సిల్‌కు బదిలీ చేశారు. దీంతో.. ఇప్పుడు యుద్ధంపై కౌన్సిల్ పూర్తిస్థాయిలో నిర్ణయాలు తీసుకుంటుంది. ఈ మేరకు 'ఇరాన్ ఇంటర్నేషనల్' ఓ బ్రేకింగ్ కథనాన్ని ప్రచురించింది. ప్రస్తుతం సుప్రీంలీడర్ బంకర్‌లోనే ఉన్నారని వెల్లడించింది. "ఇకపై యుద్ధ నిర్వహణ కౌన్సిల్ అధీనంలో ఉంటుంది" అని వివరించింది.

ఫోర్డో అణు కేంద్రమే లక్ష్యంగా..


ఫోర్డో అణు కేంద్రం ఉపగ్రహ చిత్రం

శక్తిమంతమైన బంకర్ బస్టర్ బాంబును ఇజ్రాయెల్‌కు అమెరికా ఇవ్వనున్నట్టు ప్రచారం

బ్యాంకాక్, జూన్ 17: ఇరాన్ అణు కార్యక్రమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా టెల్‌అవీవ్ అక్కడి అణు స్థావరాలపై బాంబుల వర్షం కురిపిస్తున్న సంగతి తెలిసిందే. అయితే.. ఇరాన్‌లో కొండ కింద భూగర్భంలో నిర్మించిన ఫోర్డో అణు కేంద్రాన్ని పేల్చేయడం ఇజ్రాయెల్‌కు సాధ్యం కావట్లేదు. దీంతో.. ఆ కేంద్రాన్ని నాశనం చేసే శక్తి ఉన్న జీబీయూ-57 ఏ/బీ బంకర్ బస్టర్ బాంబులను ట్రంప్ ప్రభుత్వం ఇజ్రాయెల్‌కు అందించనున్నట్టు ప్రచారం సాగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన ఏమీ వెలువడలేదు. సాధారణ క్షిపణులు నేలపై పడగానే పేలిపోయి విధ్వంసం సృష్టిస్తాయి. అయితే బంకర్ బస్టర్ బాంబులు మాత్రం నేలను తొలుచుకుంటూ లోపలకు వెళ్లి భూగర్భంలో పటిష్ఠంగా నిర్మించిన బంకర్లలోకి చొచ్చుకెళ్లిన తర్వాత పేలుతాయి. దీంతో అండర్‌గ్రౌండ్‌లో బంకర్‌లో దాక్కున్న వారంతా క్షణాల్లో ప్రాణాలు కోల్పోతారు. కాగా.. యురేనియంను అధిక స్థాయిలో శుద్ధి చేసే సామర్థ్యం కలిగిన ఫోర్డో అణు కేంద్రాన్ని బ్యాంకర్ బస్టర్ బాంబు ఢీ కొడితే భారీస్థాయిలో రేడియేషన్ విడుదలయ్యే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

'ఫోర్డో' ఎందుకంత కీలకం

ఇరాన్ అణు కేంద్రాల్లో నంతాజ్ తర్వాత ఫోర్డోనే అత్యంత కీలకం. టెహ్రాన్‌కు 95 కిలోమీటర్ల దూరంలో కోమ్ నగరానికి సమీపంలోని ఒక పర్వతం కింద అత్యంత రహస్యంగా నిర్మితమైన ఈ కేంద్రం నతాంజ్ అణు శుద్ధి కేంద్రం కంటే చిన్నది. రాతి నేల కింద భూగర్భంలో 260 అడుగుల లోతున దీని నిర్మాణం 2006లో ప్రారంభమైందని చెబుతారు. 2023లో ఈ కేంద్రంలో 83.7 శాతం శుద్ధి చేసిన యురేనియంను ఐఏఈఏ గుర్తించింది. ఇక్కడ 2,700 సెంట్రిఫ్యూజ్‌లు ఉన్నాయని పేర్కొంది. అణుబాంబు తయారీకి అవసరమైన 90 శాతానికి ఇది చాలా చేరువలో ఉండటం ఆందోళనకరంగా మారింది. ఈ క్రమంలోనే.. ఇరాన్ అణ కార్యక్రమాన్ని నామరూపాల్లేకుండా చేయాలంటే ఫోర్డో కేంద్రాన్ని పూర్తిగా ధ్వంసం చేయడమే మార్గమని అమెరికా, ఇజ్రాయెల్ భావిస్తున్నాయి.

ఇజ్రాయెల్ ముందున్న ప్రత్యామ్నాయాలివీ..

బంకర్ బస్టర్ బాంబులు ఇవ్వడానికి అమెరికా నిరాకరిస్తే ఏం చేయాలన్న దానిపై ఇజ్రాయెల్ ముందు కొన్ని ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. ఫోర్డో చుట్టూ ఉన్న విద్యుత్తు ఉత్పత్తి, ప్రసార వ్యవస్థలను ధ్వసం చేయడం ద్వారా ఈ అణుకేంద్రంలో కార్యకలాపాలను తాత్కాలికంగా అడ్డుకోవచ్చు. భూగర్భంలో ఉన్న ఈ కేంద్రం ప్రవేశ ద్వారాలపై దాడులు చేసి సిబ్బందిని లోపలే చిక్కుకుపోయేలా చేయవచ్చు. అందులోని పరికరాలను నిరుపయోగంగా మార్చవచ్చు. ఇజ్రాయెల్ కమాండోలు సాహసం చేసి లోపలకు చొరబడి బాంబులు అమర్చడం ద్వారా కేంద్రాన్ని నాశనం చేసే అవకాశం కూడా ఉంది.

బంకర్ బస్టర్ బాంబు ప్రత్యేకతలు

పొడవు - 20 అడుగులు
బరువు - 30 వేల పౌండ్లు (దాదాపు 13,600 కిలోలు)
ప్రయోగం - అమెరికాకు చెందిన బీ-2 స్పిరిట్ విమానాల ద్వారా
ఉపయోగం: భూగర్భంలో లోతుగా నిర్మించిన బంకర్లను ధ్వంసం చేయడం

అణుబాంబు తయారీకి ఇరాన్‌కు మూడేళ్ల సమయం!

అమెరికా ఇంటెలిజెన్స్ నివేదిక.. 3 నెలలే పడుతుందన్న ఇజ్రాయెల్

న్యూఢిల్లీ, జూన్ 17: ఇరాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధానికి దిగడానికి కారణమైన 'అణుబాంబు తయారీ' వ్యవహారంపై అమెరికా ఇంటెలిజెన్స్ సంచలన నివేదిక ఇచ్చింది. ఇరాన్ అణుబాంబు తయారు చేసేందుకు మూడేళ్ల సమయం పడుతుందని.. ఇజ్రాయెల్ చెబుతున్నట్టు మూడు మాసాలు కాదని స్పష్టం చేసింది. కానీ, ఇజ్రాయెల్ మాత్రం కొన్ని మాసాల వ్యవధిలోనే ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేస్తుందని, దాని నుంచి రక్షణ కోసమే తాము యుద్ధానికి దిగామని పేర్కొంది. అయితే.. ఇంటెలిజెన్స్ మాత్రం అణ్వాయుధాల విషయంలో ఇరాన్ ఇప్పటి వరకు చురుగ్గా ఏమీలేదని తెలిపింది. అణ్వాయుధాన్ని తయారు చేసేందుకు ఎంత లేదన్నా ఇరాన్‌కు మూడేళ్ల సమయం పడుతుందని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ఇరాన్‌లోని అణు కేంద్రాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ జరుపుతున్న క్షిపణి దాడుల్లో కీలకమైన నటాంజ్ అణు కేంద్రం ధ్వంసమైనట్టు శాటిలైట్ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. ఇది ఇరాన్‌లోని అత్యంత కీలకమైన అణుకేంద్రం. అదేవిధంగా అణు పరీక్షల కేంద్రం 'ఇస్ఫహాన్'పై కూడా ఇజ్రాయెల్ క్షిపణులు దాడులు చేశాయి. మరో ప్రధాన అణు కేంద్రం ఫోర్డోపై మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి దాడి జరగలేదు. అయితే, అమెరికా మద్దతు లేకుండా ఇజ్రాయెల్ దీని జోలికి పోయే అవకాశం లేదని రక్షణ రంగ నిపుణులు పేర్కొన్నారు.

టిమ్స్‌కు అదనంగా రూ. 291కోట్లు అవసరం

ప్రభుత్వానికి నివేదించిన ఆర్అండ్‌బీ

ఆగస్టు 15న సనత్ నగర్ టిమ్స్ ప్రారంభం?



సనత్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న టిమ్స్ ఆసుపత్రి భవనం

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో నిర్మితమవుతున్న మూడు తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్సెస్(టిమ్స్) భవనాలకు సుమారు రూ.291కోట్ల అదనపు నిధులు అవసమరని రోడ్లు, భవనాల శాఖ తేల్చింది. సనత్ నగర్ టిమ్స్‌కు అదనంగా రూ.53కోట్లు, అల్వాల్ టిమ్స్‌కు రూ.115కోట్లు, ఎల్బీనగర్ టిమ్స్‌కు రూ.123కోట్లు అవసరమని తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. ఈ మూడు భవనాల నిర్మాణాలకు తొలుత రూ.2,679 కోట్లు మంజూరు చేశారు. తాజాగా పెరిగిన అంచనాలతో ఈ ఖర్చు రూ.2,970కోట్లకు పెరగనుంది. మరోవైపు నిమ్స్ విస్తరణలో భాగంగా నిర్మిస్తున్న భవనాలకు కూడా కొన్ని మార్పులు సూచించారు. వాటి పైనా ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అలాగే వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణంలోనూ కీలక మార్పులు చేయడం, ఆసుపత్రిలో పడకల సంఖ్యను పెంచడంతో అక్కడ కూడా నిధులను పెంచాల్సి ఉంది. అందుకు సంబంధించిన వివరాలతో కూడా నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. ఇదిలా ఉండగా, నిర్మాణంలో ఉన్న మూడు టిమ్స్‌లను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా మొదటగా ఈ ఏడాది ఆగస్టు 15న సనత్ నగర్ ఆసుపత్రిని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకొని పనులు చేస్తున్నారు. ఇక అల్వాల్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను ఇదే ఏడాది డిసెంబర్ 31న ప్రారంభించాలని ప్రాథమికంగా నిర్ణయించారు.

ఇతర రాష్ట్రాల్లోనూ ఓటు హక్కు ఉన్న 30 వేల మంది పేర్ల తొలగింపు

» జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక ఇప్పట్లో ఉండకపోవచ్చు: సీఈవో

హైదరాబాద్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) తాజా మార్గదర్శకాల ప్రకారం 'డబుల్ ఓట్ల'ను గుర్తిస్తున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సుదర్శన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన బీఆర్‌కేఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. రెండుచోట్ల ఓటరుగా నమోదై ఉన్నవారిని సంప్రదించి.. వారి సూచన మేరకు ఒకచోట తొలగిస్తున్నామని చెప్పారు. ఏపీ, తమిళనాడు, కర్ణాటక, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు తెలంగాణలో కూడా 58 వేల మంది ఓటు హక్కు కలిగి ఉన్నారని, అటువంటి వారి జాబితాను ఈసీఐ పంపిందన్నారు. ఆయా రాష్ట్రాల అధికారులతో సంప్రదింపులు జరిపి రెండు రాష్ట్రాల్లో ఓటరుగా నమోదై ఉన్నవారిలో 30 వేల మంది పేర్లను మన రాష్ట్రంలోని ఓటర్ల జాబితా నుంచి తొలగించామని తెలిపారు. ఇప్పటివరకు ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య 1500 ఉండగా.. దాన్ని ఈసీఐ 1000కి కుదించిందన్నారు. దీని ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ కేంద్రాలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో తమ మొబైల్ ఫోన్లను డిపాజిట్ చేసేందుకు ఏర్పాట్లు చేయనున్నామన్నారు. ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి ఏమీ కాదని చెప్పారు జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతిపై అసెంబ్లీ నుంచి తమకు సమాచారం వచ్చిందని, అసెంబ్లీ గెజిట్‌ను ఈసీఐకి పంపామన్నారు. ఇప్పటికే రెండు, మూడు రాష్ట్రాల్లో ఖాళీ అయిన స్థానాలకు ఉప ఎన్నిక షెడ్యూల్ వచ్చిందని, జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికకు ఇప్పట్లో నోటిఫికేషన్ రాకపోవచ్చన్నారు. అయితే ఉప ఎన్నిక ఎపుడు నిర్వహించాలనేది ఈసీఐ నిర్ణయిస్తుందని చెప్పారు.

ఆగస్టు 15 నుంచి స్వశక్తి మహిళలకు చీరల పంపిణీ

» చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్

సిరిసిల్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సంఘాల సభ్యులకు రెండు చీరలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆగస్టు 15 నుంచి ప్రారంభించనున్నట్లు చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శైలజ రామయ్యర్ తెలిపారు. నేత కార్మికులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు రెండు చీరలు ఇవ్వాలని నిర్ణయించిందని ఆమె చెప్పారు. మంగళవారం సమీకృత రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో చీరల ఉత్పత్తి పురోగతిపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ఆమె సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు పవర్‌లూమ్స్ చీరల ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా శైలజ రామయ్యర్ మాట్లాడుతూ... ప్రభుత్వ రంగంలో ఉన్న అన్ని శాఖల నుంచి వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లు చేనేత సొసైటీలకు వస్తున్నాయని, రాబోయే రోజుల్లో దేవాదాయ శాఖ నుంచి మరో ఆర్డర్ వస్తుందన్నారు.

గురుకులాలు, కాలేజీల్లో మౌలిక వసతులు కల్పించాలి

» ఎస్టీ సంక్షేమశాఖ కమిషనర్

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని ఆశ్రమ/ గురుకుల పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లకు అవసరమైన మరమ్మత్తు పనులు పూర్తి చేసి, మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు ఎస్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి కం కమిషనర్ ఎ.శరత్ ఆదేశించారు. ఎస్టీ సంక్షేమశాఖ పరిధిలోని గురుకుల/ఆశ్రమ పాఠశాలలు, ఏకలవ్య మోడల్ గురుకులాలు, హాస్టళ్లు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయా పాఠశాలలు/ కాలేజీల ప్రిన్సిపాళ్లు, హాస్టళ్ల వార్డెన్లతో ఆయన వర్చువల్‌గా సమీక్షించారు. తరగతి గదులు, వంటశాలలు, మూత్రశాలలు, పాఠశాలల ఆవరణ, ఆర్వోప్లాంట్లను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని, అవసరమైన మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ధర్తీ అబా జాన్‌భగీరధి అభియాన్ ద్వారా పీఎం జన్‌మన్ స్కీం అమలుపై వచ్చేనెల 15 వరకూ గిరిజన ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆయన కోరారు.

కార్మికుల క్లెయిమ్‌లను బీమా కంపెనీలకు అప్పజెప్పొద్దు

» ధర్నాలో కూనంనేని

చిక్కడపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ సంక్షేమబోర్డులో ప్రమాదవశాత్తు, సహజ మరణం చెందిన వారి క్లెయిమ్‌లను బీమా కంపెనీలకు అప్పజెప్పాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. 2009 నుంచి రాష్ట్రంలో కార్మికశాఖ ద్వారా కార్మికులకు పథకాలు అందుతున్నాయని, ఇప్పుడు బీమా రంగా నికి అప్పజెప్పడం సమంజసం కాదన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎండీ యూసుఫ్, ఎస్. బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్‌లో మళ్లీ 'నచ్చిన సబ్జెక్టులు'!

(మొదటి పేజీ తరువాయి)

మూడు దశాబ్దాల నుంచి జేఎన్‌టీయూలో అమలవుతున్న సీబీసీఎస్‌ను కేంద్ర ప్రభుత్వం 2016 నుంచి దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టింది. విద్యార్థులకు ప్రయోజనకరమైన సీబీసీఎస్ దేశవ్యాప్తంగా అమల్లోకి రాగా, జేఎన్‌టీయూ పరిధిలో మాత్రం అప్పటి ఉన్నతాధికారులు నీరుగారుస్తూ వచ్చారు. ఫలితంగా విద్యార్థులు తమకు నచ్చిన సబ్జెక్టులను ఎంచుకోలేక, నచ్చని సబ్జెక్టుల్లో పాస్ కాలేక ఏళ్ల తరబడి బ్యాక్‌లాగ్స్ బరువును మోస్తూనే ఉన్నారు. మంగళవారం జేఎన్‌టీయూలో జరిగిన బోర్డ్ స్టడీస్ చైర్మన్ల సమావేశంలో ఆర్-25 నిబంధనల్లో సీబీసీఎస్ అమలు, క్రెడిట్స్ మినహాయింపు, కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల్లో మైనర్ డిగ్రీ ప్రవేశపెట్టడం వంటి అంశాలకు ఆమోదం లభించింది.

క్రెడిట్స్ మినహాయింపుతో బీటెక్ డిగ్రీ..

బీటెక్ విద్యార్థులు చదివే ప్రతి సబ్జెక్టుకు కొన్ని క్రెడిట్స్ ఉంటాయి. డిగ్రీ పట్టా రావాలంటే నిర్దేశిత క్రెడిట్స్‌ను పొందాల్సి ఉంటుంది. 2016 నిబంధనలకు ముందు విద్యార్థులకు క్రెడిట్స్ మినహాయింపు సదుపాయం ఉండేది. సాధారణంగా బీటెక్ విద్యార్థులు నాలుగేళ్ల పాటు సుమారు 40 సబ్జెక్టులు చదువుతారు. క్రెడిట్స్ మినహాయింపు ఉండడంతో వాటిలో ఒకటి లేదా రెండు సబ్జెక్టుల్లో పాస్ కాకపోయినా, కోర్సుకు ఉండే మొత్తం క్రెడిట్స్‌లో తప్పనిసరిగా ఉండాల్సిన క్రెడిట్స్ లభించిన వారికి డిగ్రీ పట్టా ఇస్తారు. ఉదాహరణకు ఈ ఏడాది నుంచి బీటెక్ కోర్సుకు మొత్తం 164 క్రెడిట్స్ ఉండేలా ఉన్నతాధికారులు



కొత్త మార్గదర్శకాలను రూపొందిస్తున్నారు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) నిబంధనల మేరకు డిగ్రీ పొందడానికి కనీస క్రెడిట్స్ 160 ఉంటే సరిపోతుంది. దీంతో జేఎన్‌టీయూ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో చదివే బీటెక్ విద్యార్థులు తమ బ్యాక్‌లాగ్ (పాస్ కాని) సబ్జెక్టుల్లో ఒకటి లేదా రెండు సబ్జెక్టుల నుంచి మినహాయింపు పొందేందుకు మార్గం సుగమం అవుతుంది. క్రెడిట్స్ మినహాయింపు అమలుతో విద్యార్థులకు మేలు చేకూరుతుందని విద్యార్థి సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోర్ ఇంజనీరింగ్ సబ్జెక్టులతోనూ మైనర్ డిగ్రీలు చేసుకునేలా విద్యార్థులకు జేఎన్‌టీయూ అవకాశం కల్పిస్తోంది. అంతేకాదు.. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ మెటలర్జీ, కెమికల్ ఇంజనీరింగ్ తదితర కోర్ బ్రాంచ్‌ల విద్యార్థులు సుమారు 18 క్రెడిట్స్ పొందేలా వేరే కోర్సుల్లోని సబ్జెక్టులతో మైనర్ డిగ్రీ తీసుకోవాలని సూచిస్తోంది. దీంతో విద్యార్థులు తమ అభిరుచి మేరకు కోర్సులు/సబ్జెక్టులను ఎంచుకొని సంతోషంగా రెండు డిగ్రీలు పొందేందుకు వీలవుతుందని ఆచార్యులు చెబుతున్నారు.

ఆ కోర్సులు ఇకపై మొక్కుబడి కాదు..

బీటెక్ విద్యార్థులకు ఇంజనీరింగ్ సబ్జెక్టులతో పాటు పర్యావరణ శాస్త్రం, భారత రాజ్యాంగం, మానవ విలువలు వంటి సబ్జెక్టులు ఉంటాయి. ఆయా అంశాలపై అవగాహన పెంపొందించేందుకు ప్రవేశపెట్టిన తప్పనిసరి నాన్ క్రెడిట్ సబ్జెక్టులను విద్యార్థులు మొక్కుబడిగా భావిస్తున్నారు. దీంతో వచ్చే ఏడాది నుంచి తప్పనిసరి సబ్జెక్టులకూ 0.5-1 క్రెడిట్ ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు. దీంతో తప్పనిసరి సబ్జెక్టులను కూడా అభ్యసించేలా విద్యార్థులను ప్రోత్సహించినట్లు అవుతుందని అంచనా వేస్తున్నారు. భావితరం ఇంజనీర్లలో ప్రపంచస్థాయి నైపుణ్యాలతో పాటు మానవ విలువలను కూడా పెంపొందించేలా నూతన మార్గదర్శకాలు (ఆర్25) రూపొందిస్తున్నామని, ఉపకులపతి సూచనల మేరకు నెలాఖరులోగా కొత్త నిబంధనలను విడుదల చేస్తామని జేఎన్‌టీయూ అకడమిక్ వ్యవహారాల డైరెక్టర్ వి.కామాక్షి ప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తా

» ఆర్టీసీ తొలి మహిళా డ్రైవర్ సరిత

మిర్యాలగూడ టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తానని ఆర్టీసీ తొలి మహిళా డ్రైవర్ వాంకుడోతు సరిత నాయక్ అన్నారు. విధుల్లో చేరడానికి మంగళవారం మిర్యాలగూడకు వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన తాను ఆటో, క్యాబ్ డ్రైవర్‌గా పని చేశానని, ఢిల్లీలో ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్‌లో పనిచేసినట్లు తెలిపారు. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా తనకు స్వస్థలంలో ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ ఇటీవల 'ప్రజావాణి'లో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసినట్లు తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫోన్ చేసి ఉద్యోగం ఇప్పించారన్నారు. ఈ సందర్భంగా తనకు సహకరించిన మంత్రులకు, ఆర్టీసీ సంస్థకు సరిత ధన్యవాదాలు తెలిపారు.



మిర్యాలగూడ డిపోలో రిపోర్టు చేస్తున్న సరితనాయక్

సామాజిక బహిష్కరణ కేసులో 13 మందికి ఐదేళ్ల జైలు

» నిజామాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు తీర్పు

నిజామాబాద్ లీగల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సామాజిక బహిష్కరణ కేసులో నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు 13 మందికి ఐదేళ్ల కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి టీ శ్రీనివాస్ మంగళవారం తీర్పు వెలువరించారు. 2021 నవంబరు 23న మునిపల్లి సర్పంచ్ సాయిరెడ్డి, ఎంపీటీసీ తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఆ సమావేశానికి అదే గ్రామానికి చెందిన నాయకపోడు కులస్థుడైన తుమ్మ రవీందర్ తన కులస్థులతో కలిసి వెళ్లాడు. శివాలయానికి వెళ్లే దారి కబ్జాకు గురైందని, దాంతో తమకు దారి చూపించాలని వీడీసీ సభ్యులను వేడుకున్నారు. కానీ వీడీసీ సభ్యులు సమస్య వినకుండా నాయకపోడు కులస్థులకు రూ.15 వేల జరిమానా విధించారు. నాయకపోడు కులస్థులను సామాజిక బహిష్కరణ చేశారు. దీనిపై నాయకపోడు కులస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో నేరారోపణలు రుజువు కావడంతో వీడీసీ సభ్యులు టంకశాల నరేష్, గాజుల లింగన్న, కొలిప్యాక సాయిరెడ్డి, ముస్కు గంగారెడ్డి, మర్రిపల్లి పొట్టెన్న, బంపల్లి రాజేందర్, గుడ్ల మోహన్, గొల్ల చవుల బాజన్న, చింతలపల్లి గంగారెడ్డి, చింతలపల్లి పెద్ద సాయిరెడ్డి, గుండేటి లింగన్న, కొలిప్యాకల సాయరెడ్డి, గొర్రకంటి గంగ సాయిలుకు ఐదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. గ్రామానికే చెందిన గుమెర్ల మల్లయ్య, అరే గంగారామ్‌కు రూ.200 చొప్పున జరిమానా విధించారు.



నిర్మల్ జిల్లా ఖానాపూర్ అడవుల్లో ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లతో ఆహ్లాదకరంగా దర్శనమిస్తున్న నిర్మల్ - మంచిర్యాల రోడ్డు

అడవి తల్లి సిగలో 'గొడిసె మల్లెలు'

» ఖానాపూర్ అడవుల్లో పరిమళిస్తున్న ప్రకృతి సౌరభం

ఖానాపూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మొన్నటివరకు ఎండిన ఆకులతో కళావిహీనంగా దర్శనమిచ్చిన అడవి తల్లి నేడు వర్షాలు పడగానే పచ్చని ఆకులు చిగురిస్తూ కొత్త జీవంతో నిండిపోయింది. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని కవ్వాల్ అభయారణ్యం గుండా వెళ్తున్న ప్రయాణికులకు అందమైన ప్రకృతికి తోడు ఓ చక్కటి పరిమళం స్వాగతం పలుకుతోంది. చుట్టూ పచ్చని చెట్ల నడుమ తెల్లటి వర్ణంతో దర్శనమిచ్చే గొడిసె మల్లెలు(అడవి మల్లెలు) ఉదయం, సాయంత్రం వేళల్లో సుగంధాన్ని వెదజల్లుతున్నాయి. పచ్చదనానికి తోడు అందమైన పూల సౌరభం కలిసి జనాల్ని మంత్ర ముగ్ధుల్ని చేస్తోంది. దీంతో అటుగా వెళ్లేవారు ఈ సుందర వాతావరణాన్ని ఆస్వాదిస్తూ ప్రకృతి ఒడిలో కాసేపు సేద తీరుతున్నారు.



నిర్మలా సీతారామన్ ఏఐ వీడియోతో రూ.20.13 లక్షల దోపిడీ!

» ఆన్‌లైన్ ఇన్వెస్టిమెంట్ పథకం అంటూ మోసం

» హైదరాబాద్ వైద్యురాలికి సైబర్ నేరగాళ్ల టోకరా



హైదరాబాద్ సిటీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గొంతుతో రూపొందించిన ఏఐ (కృత్రిమ మేధ) వీడియోతో హైదరాబాద్‌కు చెందిన ఓ వైద్యురాలిని బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు ఆమె వద్ద రూ.20.13 లక్షలు కొట్టేశారు. హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ డీసీపీ ధార కవిత తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన మహిళా వైద్యురాలి(71) వాట్సా‌ప్‌కు కొద్ది నెలల క్రితం ఓ గుర్తు తెలియని నెంబర్ నుంచి ఫేస్‌బుక్ లింక్ వచ్చింది. వైద్యురాలు ఆ లింక్‌ను ఓపెన్ చేయగానే.. ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే తక్కువ సమయంలో అధిక లాభాలు పొందేందుకు గొప్ప పథకం అంటూ నిర్మలా సీతారామన్ చెబుతున్న విధంగా ఉన్న వీడియో ఉంది. ఈ క్రమంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆమెకు ఫోన్ చేసి పెట్టుబడి ప్రణాళికలు వివరించాడు. నిర్మలా సీతారామన్ గొంతుతో వీడియో, ఫేస్‌బుక్‌లో వచ్చిన ప్రకటన కావడంతో పెట్టుబడి పెట్టేందుకు వైద్యురాలు అంగీకరించారు. దీంతో సైబర్ నేరగాడు.. ఆమె ఆధార్, పాన్ కార్డు వివరాలు తీసుకుని ఓ నకిలీ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో రిజిస్ట్రేషన్ చేసి ఫిన్‌బ్రిడ్జ్ క్యాపిటల్ అనే సంస్థలో పెట్టుబడులు పెట్టించాడు. తొలుత వైద్యురాలితో రూ.20వేలు పెట్టుబడి పెట్టించి మంచి లాభాలు వచ్చినట్లు వివరాలను అమెరికా డాలర్లలో చూపించాడు. ఇలా వైద్యురాలిని నమ్మించి ఆమె నుంచి విడతల వారీగా రూ.20.13లక్షలు డిపాజిట్లు చేయించారు. ఆ మొత్తం రూ.68.67లక్షలు (79,850 యూఎస్‌డీ) అయినట్లు ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో చూపించినా విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకుండా చేశారు. ఇదేమని అడిగితే విత్‌డ్రా చేసుకోవాలంటే మరిన్ని పెట్టుబడులు పెట్టాలని సూచన చేశారు. దీంతో మోసాన్ని ఆలస్యంగా గ్రహించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఏసీబీకి చిక్కిన ముగ్గురు అధికారులు

» బిల్లుల క్లియరెన్స్‌కు లంచాలు తీసుకుంటుండగా పట్టివేత

» కాప్రా, కరీంనగర్‌లో ఘటనలు

కాప్రా/ కరీంనగర్ క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ పలువురు అధికారులు మంగళవారం ఏసీబీకి చిక్కారు. జీహెచ్‌ఎంసీ కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్‌లో కాంట్రాక్టర్ సీహెచ్.రాంరెడ్డి సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి తనకు రావాల్సిన రూ.2.50 లక్షల పెండింగ్ బిల్లు కోసం అసిస్టెంట్ ఇంజనీర్ స్వరూప రూ.1.50 లక్షలు డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ బతిమాలగా రూ.1.20 లక్షలకు ఓకే చెప్పారు. అనంతరం రాంరెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. కాంట్రాక్టర్ నుంచి ఆ నగదు తీసుకుంటున్న ఏఈ స్వరూపను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మరోఘటనలో, కరీంనగర్‌కు చెందిన రాజు పంచాయతీరాజ్ శాఖలో కొన్నేళ్లుగా తన కారును అద్దెకు తిప్పుతున్నాడు. నెలకు రూ.30 వేల చొప్పున ఆరు నెలల బిల్లు పెండింగ్‌లో ఉంది. ఆ బిల్లు క్లియరెన్స్ కోసం రూ.8 వేలు ఇవ్వాలని రాజును జడ్పీ కార్యాలయంలో ఏఈ శరత్ డిమాండ్ చేశారు. దీంతో రాజు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. రూ.8 వేలు సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్ ద్వారా శరత్ తీసుకుంటుండగా అధికారులు ఇద్దరినీ పట్టుకున్నారు.

హెచ్ఎండీఏ మెగా ఈ-వేలం !

» హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో అమ్మకానికి 2,570 ప్లాట్లు

» కోకాపేట, బుద్వేల్, మరో పది ప్రాంతాల్లో స్థలాలు

» రూ.4వేల కోట్ల ఆదాయం సమకూరే అవకాశం

హైదరాబాద్ సిటీ, జూన్17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో అభివృద్ధి చేసిన లేఅవుట్లలోని 2,570 ప్లాట్లను ఈ-వేలం ద్వారా విక్రయించేందుకు హెచ్‌ఎండీఏ(హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ) సన్నాహాలు చేస్తోంది. హైదరాబాద్‌లో హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్లాట్ల వేలానికి వస్తున్న అనూహ్య స్పందన నేపథ్యంలో ఈ చర్యలకు సిద్ధమైంది. ఈ మేరకు కోకాపేట, బుద్వేల్‌తోపాటు మరో పది ప్రాంతాల్లో ఉన్న ప్లాట్ల వివరాలను హెచ్‌ఎండీఏ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. రూ.4వేల కోట్లకు పైగా ఆదాయానిచ్చే ఆయా ప్లాట్లను విడతల వారీగా విక్రయించడానికి హెచ్‌ఎండీఏ అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిన వెంటనే ప్లాట్ల ఈ-వేలం ప్రక్రియ మొదలవుతుంది. ఏడాదిన్నర క్రితం వరకు హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో హైదరాబాద్, శివారు ప్రాంతాల్లోని ప్లాట్లను వేలం ద్వారా పెద్దఎత్తున విక్రయించారు. కోకాపేట నుంచి మేడిపల్లి వరకు లేఅవుట్లలోని ప్లాట్లను విక్రయించడం ద్వారా వచ్చిన రూ.13వేల కోట్ల మేర ఆదాయాన్ని అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్‌ఎండీఏ సమకూర్చింది. అప్పట్లో వివిధ ప్రాంతాల్లో డ్రాఫ్ట్ లేఅవుట్లను మాత్రమే ప్రకటించి ప్లాట్లను విక్రయించగా.. ఈ ఏడాదిన్నర కాలంలో హెచ్‌ఎండీఏ ఆయా లేఅవుట్లను అభివృద్ధి చేసింది. బహదూర్‌పల్లి, తొర్రూర్, కుర్మల్‌గూడ, తుర్కయాంజల్ ఇన్ముల్‌నార్వా, కోకాపేట లేఅవుట్లలోని పనులు తుది దశకు చేరాయి. ఇక మేడిపల్లి, బాచుపల్లి, మోకిల, బుద్వేల్ తదితర లేఅవుట్లలో అభివృద్ధి పనులు సాగుతున్నాయి.

కోకాపేటలో 24.05 ఎకరాలు..

హెచ్‌ఎండీఏకు కోకాపేటలో 24.05ఎకరాల విస్తీర్ణం ఉండే ఐదు ప్లాట్లు ఉండగా.. బుద్వేల్‌లో ఆరు ఎకరాల విస్తీర్ణం కలిగిన ఒక ప్లాటు ఉంది. అలాగే, 150చ.గజాల నుంచి వెయ్యి చ.గజాల విస్తీర్ణం కలిగిన 2,564ప్లాట్లు శివారులోని 10 ప్రాంతాల్లో అందుబాటులో ఉండగా, వీటి మొత్తం విస్తీర్ణం 9.16లక్షల చదరపు గజాలు (189ఎకరాలు) వరకు ఉన్నట్లు తెలిసింది. ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే తొలి విడతలో కోకాపేట, బుద్వేల్‌లోని ప్లాట్లను, ఆ తర్వాత మిగిలిన ప్లాట్లను ఈ-వేలం ద్వారా విక్రయించే అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వలసలపై కక్ష

అమెరికా చరిత్రలో కనీవినీ ఎరుగనంతమంది అక్రమవలసదారులను దేశంనుంచి వెళ్ళగొడతానని ఎన్నికలప్రచారంలో తన ఓటర్లకు హామీ ఇచ్చారు డోనాల్డ్ ట్రంప్. అందుకు అనుగుణంగా ఆయన చేస్తున్న ప్రయత్నాలు, తీసుకుంటున్న నిర్ణయాలు అత్యంత వివాదాస్పదమవుతున్నాయి. ఒకవైపు కవాతు, మరోవైపు అణచివేత, మధ్యలో పుట్టినరోజు అంటూ ఒక పత్రిక మొన్న శనివారం నాడు అమెరికాలో నెలకొన్న పరిస్థితిని చక్కగా అభివర్ణించింది. ఆర్మీ 250వ వార్షికోత్సవం, ట్రంప్ పుట్టినరోజు కూడా ఆనాడే కావడంతో అమెరికా వ్యాప్తంగా భారీ నిరసనలతో 'నో కింగ్స్' ఉద్యమాన్ని పతాకస్థాయికి తీసుకుపోవాలని నిరసనకారులు నిర్ణయించడంతో, ఊహించినట్టుగానే ప్రదర్శనలు హింసాయుతంగా మారాయి. యాభై రాష్ట్రాల్లోని రెండువేల పైచిలుకు ప్రాంతాల్లో నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో లక్షలాది మంది పాల్గొన్నారు. వీధులు, పార్కులు, బహిరంగస్థలాలు అన్ని చోట్లా జనం నిండిపోయారని, మహానగరాల నుంచి చిన్నపట్టణాల వరకూ జనం ర్యాలీలు నిర్వహించి, అద్భుతమైన నినాదాలతో ట్రంప్ నిరంకుశత్వాన్ని చీల్చిచెండాడారని వార్తలు వచ్చాయి. నిరంకుశత్వం కూడదన్న హెచ్చరికతో పాటు, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుంటామని, తమ వలసహక్కులను కాపాడుకుంటామని వారంతా ప్రతిజ్ఞలు చేశారు. ఆ ఒక్కరోజే ఒక కోటి ఇరవైలక్షల మంది నిరసనల్లో పాల్గొనడంతో ట్రంప్ దిగొచ్చేవరకూ ఈ తరహా ఆందోళనలు కొనసాగుతూనే ఉంటాయని నో కింగ్స్ కొయిలిషన్ నిర్వాహకులు ఉత్సాహంగా ప్రకటించారు. ట్రంప్ సహజంగానే ఈ తిరుగుబాటును సహించలేకపోయారు. తలెగరేసిన వారినందరినీ కటకటాల్లోకి తోసేయాలనీ, ట్రంప్ మస్ట్ గో అన్న ప్రతీ వ్యక్తినీ దేశం నుంచి గెంటేయాలని ఆయన సంకల్పించారు.

ఈ భారీ నిరసన ప్రదర్శన జరిగిన మర్నాడే అమెరికా అధ్యక్షుడు తన ఇమ్మిగ్రేషన్ అధికారులకు విస్పష్టమైన ఆదేశాలు జారీచేస్తూ, విపక్షం మీద తీవ్రంగా విరుచుకుపడ్డారు. రోడ్లమీదకు వచ్చి, తనకు వ్యతిరేకంగా నినాదాలు చేసిన, తన విధానాలను ప్రశ్నించినవారంతా డెమోక్రాటిక్ పార్టీ ఓటర్లనీ, కోట్లాదిమంది అక్రమవలసదారులను వెనకేసుకొస్తూ ఆ పార్టీ అమెరికా రాజకీయాల్లో బతుకునెట్టుకొస్తోందని ట్రంప్ విమర్శించారు. నికార్సయిన అమెరికన్ల కష్టార్జితాన్ని కొల్లగొడుతూ, శ్రమకు వెరవని అమెరికన్ల ఉద్యోగాలను తన్నుకుపోతూ, ప్రభుత్వ సంక్షేమ నిధులను పూర్తిగా స్వాహాచేస్తున్న విదేశీశక్తులంటూ తీవ్రంగా శపించారాయన. వారిని ఏరివేస్తున్నందుకు, అమెరికాను ఇమ్మిగ్రేషన్ అధికారులు జల్లెడపడుతున్నందుకు అసలు సిసలు అమెరికన్లు ఆనందిస్తున్నారని, జేజేలు పలుకుతున్నారని ఆయన చెప్పుకొచ్చారు.

తదనుగుణంగా ఆయన ఇప్పుడు డెమొక్రాట్ల ఏలుబడిలో ఉన్న న్యూయార్క్ తదితర నగరాల నుంచి అక్రమవలసదారుల ఏరివేతకు అగ్రప్రాధాన్యం ప్రకటించారు. ఇమ్మిగ్రేషన్ అధికారులకు కాలిఫోర్నియా రాష్ట్రంలోని లాస్ ఏంజెలెస్ నగరంలో ఈ మధ్యన ఎదురైన ప్రతిఘటన వలసదారులకు ఒక కొత్త ఉత్తేజాన్నిస్తే, ట్రంప్‌కు ఆయుధంగా ఉపకరించిన విషయం తెలిసిందే. ఆరున్నర దశాబ్దాల తరువాత ఆ రాష్ట్రం అనుమతి లేకుండా కేంద్ర బలగాలను అక్కడకు పంపి, డెమోక్రాటిక్ పార్టీని ఆయన రెచ్చగొట్టారు. ఆ నిర్ణయాన్ని ప్రశ్నించిన గవర్నర్‌ను జైల్లోకి నెడతానని, నిధులు ఆపేస్తానని హెచ్చరించారు. కాలిఫోర్నియా నుంచి ఫెడరల్ గవర్నమెంట్‌కు వెళ్ళే నిధులను నేను ఆపేస్తానంటూ ఆ రాష్ట్ర గవర్నర్ దీటుగా సమాధానం ఇచ్చారు. ఈ అత్యంత ధనిక రాష్ట్రంలో వలసలు కూడా అధికంగానే ఉండటంతో అధ్యక్షుడికీ విపక్షాలకూ మధ్య యుద్ధానికి ఇది కేంద్రస్థానమైంది. అత్యాధునిక ఆయుధాలతో ఫెడరల్ సైన్యాలు లాస్ ఏంజెలెస్ నగరంలో తిరుగుతున్న దృశ్యాలను దేశమంతటా చూడాలని ట్రంప్ కోరిక. విదేశీ చొరబాటుశక్తుల నుంచి తన ప్రజలను కాపాడటానికి న్యాయస్థానాల్లో పోరాడుతానని, ఎన్ని చట్టాలనైనా ఉల్లంఘిస్తానని ఆయన ప్రకటిస్తున్నారు. పూర్వ అధ్యక్షులు ఎన్నడూ వాడని చట్టాలను సైతం వెలికితీసి తన రాజకీయ ప్రయోజనాల కోసం అస్త్రాలుగా మలచడంలో ఆయనకు ఆయనే సాటి. ప్రజాస్వామ్యం, పౌరహక్కులు ఇత్యాది విలువలమీద నమ్మకం లేదు కనుక, అక్రమవలసదారుల ఏరివేత కార్యక్రమాన్ని ఎంత నిరంకుశంగానైనా అమలు చేయగలడు. ఎంతమందిని ఏరివేశామన్న కంటే, ఆ ప్రక్రియ తన ఓటుబ్యాంకును ఎంత పెంచిందనేది ఆయనకు ముఖ్యం.

ఇంటా బయటా నాయకత్వ శూన్యతే!



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

ప్రపంచ రాజకీయాల్లో నాయకత్వ శూన్యం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. అణు కార్యక్రమాన్ని చేపడుతోందన్న పేరుతో ఇరాన్‌పై దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ దుస్సాహసానికి అడ్డుకట్ట వేసేవారు కనపడడం లేదు. ఇజ్రాయెల్ చెబుతున్నట్లు అమెరికా వింటోందా, లేక అమెరికా చెప్పినట్లు ఇజ్రాయెల్ నడుచుకుంటుందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇజ్రాయెల్‌లో పదవి కోల్పోయే పరిస్థితిలో ఉన్న సమయంలో హమాస్‌పై దాడులు చేసి తన రాజకీయ అధికారాన్ని నిలుపుకున్న నెతన్యాహు ఇప్పుడు తన మనుగడకోసం ఇరాన్‌లో విధ్వంసానికి పూనుకుంటున్నాడు. గతంలో ఇజ్రాయెల్ ఇలాంటి దాడులకు పాల్పడినప్పుడు అమెరికా అడ్డుకట్ట వేసిన సందర్భాలున్నాయి. ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పే మాటలు వినేవారెవరూ కనపడడం లేదు. ఐక్యరాజ్య సమితి ఒక నామమాత్ర సంస్థగా మారిపోయింది.

నిజానికి ప్రపంచంలో అనేక దేశాలు అణ్వస్త్ర తయారీ కార్యక్రమాలను చేపట్టినప్పుడు ఏ దేశమూ మరో దేశాన్ని ఆపలేకపోయింది. ప్రస్తుత విదేశాంగమంత్రి జైశంకర్ తండ్రి, జాతీయ భద్రతా సలహా బోర్డు ఛైర్మన్‌గా ఉన్న రక్షణ వ్యూహ నిపుణుడు కె. సుబ్రహ్మణ్యం సలహా మేరకు భారతదేశం అణు పరీక్షలు చేపట్టిన తర్వాతే ఒక బలమైన దేశంగా రూపొందింది. అణ్వస్త్ర దేశాల శ్రేణిలో చేరినప్పుడే భారత్ ఒక బలమైన శక్తిగా మారుతుందని దీనివల్ల మనం ప్రత్యర్థులను నిలువరించగలుగుతామని సుబ్రహ్మణ్యం ఇచ్చిన సలహా అత్యంత విలువైనది. పలు దేశాలు అణు శక్తులుగా మారినప్పుడే ఒక సమతుల్యత ఏర్పడుతుందన్న అభిప్రాయానికి అన్ని దేశాలూ వచ్చాయి. అయితే ఇరాన్ అణ్వస్త్ర తయారీ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ఇజ్రాయెల్ ఆ దేశంలో రక్తపాతానికి పూనుకున్నది. ప్రపంచంలో ఏ దేశమూ ఇజ్రాయెల్‌ను ఆపలేని పరిస్థితిలో ఉన్నది. ఈ యుద్ధం ఎన్నాళ్లు కొనసాగుతుందో. ఇది ఏ పర్యవసానాలకు దారితీస్తుందో చెప్పలేము. రష్యా, చైనా, ఇస్లామిక్ దేశాల కదలికలను కూడా ప్రపంచం ఆసక్తితో గమనిస్తోంది. అమెరికా ఈ యుద్ధ నివారణలో విఫలమైతే ప్రపంచ రాజకీయాల్లో నాయకత్వ పాత్రను పూర్తిగా కోల్పోక తప్పదు.

ఈ వ్యవహారంలో భారతదేశం ప్రేక్షక పాత్ర వహించక తప్పడం లేదు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఇజ్రాయెల్‌తో స్నేహం చేస్తూనే పాలస్తీనా ప్రయోజనాలను కాపాడేందుకు ప్రయత్నించారు. పాలస్తీనా విమోచనోద్యమనేత అరాఫత్‌ను భారత్‌కు ఆహ్వానించారు. మన విలువలకు, ప్రయోజనాలకు మధ్య ఐక్యత సాధించినప్పుడే మన విదేశాంగ విధానం విజయవంతమవుతుంది. ఇజ్రాయెల్ నుంచి ఆయుధాలు కొనుగోలు చేసినంత మాత్రాన ఆ దేశ పద్ధతులను మనం సమర్థించాలని ఎక్కడా లేదు. ప్రధాని మోదీ ప్రభావదాయక దేశాలతో స్నేహం చేసి భారత్‌ను ఒక అగ్రగామి శక్తిగా మార్చేందుకు శాయశక్తులా కృషి చేశారు. ప్రపంచ రాజకీయాల్లో ఒక నిర్ణాయక శక్తిగా మారేందుకు మనకు ఎన్నో అవకాశాలున్నాయి. 140 కోట్ల మంది వినియోగదారులతో బలమైన మార్కెట్ శక్తిగా అవతరించిన భారతదేశం ప్రపంచ రాజకీయాల్లో ఒక నిర్దిష్ట పాత్ర పోషించగల స్థాయికి చేరుకోవాల్సిన అవసరం ఉన్నది.

విచిత్రమేమంటే అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం తర్వాత భారత రాజకీయాలు ఎందుకో స్తబ్ధంగా మారినట్లు కనిపిస్తున్నాయి. నరేంద్రమోదీ 11 సంవత్సరాల పాలనపై బీజేపీ విజయోత్సవాలు జరుపుకుంటున్న సమయంలో ఈ దుర్ఘటన సంభవించడంతో పార్టీ నేతల ఉత్సాహం నీరు కారినట్లయింది. ఆ తర్వాత మోదీ సైప్రస్‌తో పాటు మూడు దేశాల పర్యటనకు బయలుదేరితే ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ యూరప్‌లో ఏదో దేశానికి వ్యక్తిగత పర్యటన నిమిత్తం వెళ్లారు. రాహుల్ పార్టీ అధ్యక్షుడు కాకపోయినా ఆయన లేకపోతే కాంగ్రెస్ పార్టీలో స్తబ్ధత కొట్టొచ్చినట్లు కనపడుతోంది. ఆయన సోదరి ప్రియాంకా గాంధీ కేరళలో ఉప ఎన్నికల్లో తలమునకలై ఉన్నారు. భారతీయ జనతా పార్టీలోనూ, కాంగ్రెస్ పార్టీలోనూ చాలా నిర్ణయాలు పెండింగ్‌లో పడినట్లు ఆ పార్టీల నేతలు చెబుతున్నారు. బీజేపీకి సంబంధించి కొన్ని రాష్ట్రాల అధ్యక్షులతో పాటు జాతీయ అధ్యక్షుడు, పార్టీ ఆఫీసు బేరర్ల నియామకం ఎప్పుడు జరుగుతుందో ఎవరూ చెప్పలేని పరిస్థితిలో ఉన్నారు. కాంగ్రెస్ విషయానికి వస్తే కర్ణాటకలో నామినేటెడ్ ఎమ్మెల్సీలకు అభ్యర్థుల ఎంపిక నుంచి రాష్ట్రాల్లో పార్టీని పటిష్ఠం చేసే కార్యక్రమం కూడా పెండింగ్‌లో పడ్డట్లు కనపడుతోంది. ఈ రెండు జాతీయ పార్టీల ప్రధాన కార్యాలయాల్లో నేతల కదలికలు పెద్దగా లేవు.

ఇదిలావుంటే భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి పథంలో సాగుతున్నదని నేతలు చేస్తున్న ప్రకటనలు ఒక ఉత్సాహాన్ని కలుగచేస్తున్నాయి. భారత్ త్వరలో ప్రపంచ మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైప్రస్‌లో వ్యాపారవేత్తలతో మాట్లాడుతూ ప్రకటించారు. సరిగ్గా నెల రోజుల క్రితం భారతదేశం జపాన్‌ను అధిగమించి నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. అమెరికా, చైనా, జర్మనీల తర్వాతి స్థానం భారత్‌దే అని ఆయన అన్నారు.

మన దేశం నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారితే అంతకంటే కావల్సింది ఏముంటుంది? నిజంగా 4,186.43 బిలియన్ డాలర్ల జపాన్ జీడీపీతో పోలిస్తే 4,187.03 బిలియన్ డాలర్ల జీడీపీని సాధించిన భారతదేశం ఘనతను కాదనలేము. మరో మూడేళ్లలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి పూర్తిగా వికసిత్ భారత్‌గా భారత్ అవతరిస్తుందనే ప్రకటనలనూ కొట్టిపారేయలేము. గత 11 సంవత్సరాల్లో దేశంలో జరిగిన రహదారులు, రేవులు, విమానాశ్రయాల నిర్మాణం, డిజిటలీకరణ వంటి సాంకేతిక అభివృద్ధి, పెరుగుతున్న వినియోగదారుల సంఖ్య, ఉత్పాదక, సేవల రంగాల విస్తృతి కూడా చెప్పుకోదగ్గది.

భారతదేశం అనేక రాష్ట్రాల సముదాయం కనుక మన దేశంలో అభివృద్ధి సమానంగా ఉండదు. రాష్ట్రాల రెవిన్యూ వసూళ్లు, స్వంత పన్నుల సేకరణ చెప్పుకోదగ్గ విధంగా లేవు. అయినప్పటికీ జీడీపీ పెరుగుదల 6–7 శాతం మధ్య ఉంటూ వేగంగా పెరుగుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ గుర్తింపు పొందింది. కానీ ఈ పెరుగుదల 8–9 శాతం మధ్య ఉన్నప్పుడే మనం లక్ష్యాలకు చేరుకోగలం. అయినా ఒక దేశంలో జరుగుతున్న అభివృద్ధికి ఆ జీడీపీ కొలమానమా అన్న ప్రశ్న ఎంతో విలువైనది. ఎందుకంటే జీడీపీకి ప్రజల బాగుగోగులకూ పెద్దగా సంబంధం ఉండదు. కొనుగోలు శక్తి రీత్యా భారత జీడీపీ ఇప్పటికే 15వేల బిలియన్ డాలర్లకు చేరుకుందని నీతి ఆయోగ్ ప్రకటించింది. మౌలిక సదుపాయాల అభివృద్ధి ఎంతగా జరుగుతున్నా, దేశ శ్రామిక జనులలో 76 శాతం మంది వ్యవసాయ రంగంలోనూ, అసంఘటిత రంగంలోనూ దినసరి కూలీలుగా చాలీచాలని వేతనాలతో జీవితం గడుపుతున్న విషయం అందరికీ తెలిసిందే. అందువల్ల ఎవరి కొనుగోలు శక్తిని జీడీపీకి కొలమానంగా తీసుకుంటున్నామన్న విషయం చర్చనీయాంశం. అంతేకాదు, మన దేశంలో ప్రపంచంలో అతిపెద్ద జనాభా రీత్యా మనం చెప్పుకుంటున్న జీడీపీని జనాభా ప్రకారం విభజిస్తే మన తలసరి జీడీపీ శ్రీలంక, భూటాన్, వియత్నాం, కెన్యా, మొరాకో, లిబియా, మారిషస్, దక్షిణాఫ్రికా తదితర దేశాల కంటే తక్కువే ఉన్నదన్న విషయాన్ని కూడా విస్మరించలేం. జీడీపీ రీత్యా భారత్‌ను నాల్గవ అతిపెద్ద దేశంగా పరిగణిస్తే తలసరి జీడీపీ రీత్యా మన దేశం 196 దేశాల్లో 127వ స్థానంలో ఉన్నదన్నది ఒక పచ్చి వాస్తవం.

నిజానికి జపాన్‌ను మనం జీడీపీలో అధిగమించాము కానీ జపాన్ తలసరి ఆదాయం భారత్ తలసరి ఆదాయం కంటే 11.8 రెట్లు ఎక్కువ ఉంటుందని ఐఎంఎఫ్ తాజా అంచనా. జపాన్ స్థాయిలో తలసరి జీడీపీని సాధించాలంటే భారత్‌కు మరో 22 ఏళ్లు పడుతుందని నిపుణులు అంటున్నారు. అనేక యూరోపియన్ దేశాల కంటే భారత్‌లో తలసరి ఆదాయం వేగంగా పెరుగుతున్నప్పటికీ ఈ విషయంలోనూ మనకెన్నో సవాళ్లున్నాయి. పేదరికాన్ని తగ్గించడంలోనూ, సాంకేతిక ప్రగతిలోనూ మన దేశం చెప్పుకోదగ్గ విజయాలు సాధించింది. జపాన్‌తో పోలిస్తే భారతదేశంలో ఉన్న అత్యధిక యువ జనాభా మనకు ఒక వరం. ప్రజల జీవన ప్రమాణాలు, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ, శాంతిభద్రతలు, మౌలిక సదుపాయాలు, విద్యా ప్రమాణాలు, ఆదాయ అసమానతల తగ్గుదల విషయంలో జపాన్ స్థాయికి మనం చేరుకోవడానికి ఎంతో కాలం పడుతుంది. అనేక ఇతర దేశాలతో పోలిస్తే ప్రైవేట్ రంగ పెట్టుబడులు మన దేశంలో అంత వేగంగా పెరగడం లేదు. జపాన్ లాగా బుల్లెట్ రైళ్లు, ఆధునిక పరిశ్రమలు, పరిశోధనలకు భారీ కేటాయింపులు, అత్యంత నైపుణ్యంతో కూడిన కార్మిక శక్తి మనకు లేవు. నైపుణ్యం లేని శ్రామికులు, సరీ సరిపోని మౌలిక సదుపాయాలు, విదేశాలకు అవకాశాల కోసం పరుగులెత్తే మన సాంకేతిక నిపుణులు, ఏ మాత్రం వినూత్న ఆవిష్కారాలు లేకపోవడం భారతదేశ బలహీనతలు. జీడీపీ పెరుగుదలను సమానంగా పంపిణీ చేసి నిజమైన అభివృద్ధిగా మార్చినప్పుడే మన దేశం విజయం సాధించినట్లు లెక్క. సగటు జపానీ పౌరుడు సగటు భారతీయుడి కంటే 20 రెట్లు ఎక్కువ సంపాదిస్తాడని అంచనా. స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాలు ప్రకటించినప్పటికీ అనేక చిన్నచిన్న దేశాలతో పోలిస్తే మన దేశంలో అపరిశుభ్రత, క్రమశిక్షణారాహిత్యం ఎక్కువ కనపడుతోంది. ఉపాధి రంగంలో ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని నివారించడం భారత్ ముందున్న తక్షణ ప్రధాన కర్తవ్యం. ముఖ్యంగా వ్యవస్థలను పారదర్శకంగా, నిజాయితీగా, అవినీతిరహితంగా పనిచేయించడంలో మన ప్రభుత్వాలు విఫలమయ్యాయి. అందుకు ప్రధాన కారణం మన రాజకీయ సంస్కృతి పూర్తిగా విఫల వ్యవస్థలపైనే ఆధారపడి ఉండడం. ఇంట గెలిచినప్పుడే రచ్చ గెలువగలనన్న విషయం మోదీకి తెలియనిది కాదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



> ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధాన్ని నివారించడంలో అమెరికా విఫలమైతే ప్రపంచ రాజకీయాల్లో తన నాయకత్వ పాత్రను ఆ అగ్రరాజ్యం పూర్తిగా కోల్పోక తప్పదు. 140 కోట్ల మంది వినియోగదారులతో బలమైన మార్కెట్ శక్తిగా ఆవిర్భవించిన భారతదేశం అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక నిర్దిష్ట, ప్రభావశీల పాత్ర పోషించగల స్థాయికి చేరుకోవాల్సిన అవసరం ఉన్నది.

దేశ ప్రగతిలో 'నల్ల బంగారం'

ప్రస్తుతం మన దేశ తలసరి విద్యుత్ వినియోగం సుమారు 1,395 యూనిట్లు మాత్రమే. ఇది ప్రపంచ సగటు విద్యుత్ వినియోగం కంటే చాలా తక్కువ. యూఎస్ఏ తలసరి విద్యుత్ వినియోగం సుమారు 12,497 యూనిట్లు. చైనా సగటు తలసరి విద్యుత్ వినియోగం 6,150 యూనిట్లు. మన దేశ తలసరి విద్యుత్ వినియోగం కంటే ఖతార్, కువైట్, సౌదీ అరేబియా దేశాల తలసరి విద్యుత్ వినియోగం చాలా ఎక్కువ. దేశ ఆర్థికాభివృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం తలసరి విద్యుత్ వినియోగాన్ని భారీగా పెంచాల్సిన అవసరం ఉంది.

2024–25 ఆర్థిక సంవత్సరంలో పునరుత్పాదక ఇంధన రంగంలో భారతదేశం విశేష పురోగతి సాధించింది. గత ఏడాది దేశం 29.52 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకుంది. దీంతో మొత్తం సామర్థ్యం 220.10 గిగావాట్లకు పెరిగింది. ప్రధాని మోదీ నాయకత్వంలో 2030 నాటికి మన దేశం శిలాజేతర ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని 500 గిగావాట్లకు పెంచుకోవాలనే లక్ష్యంతో ముందుకుపోతోంది.



అంతర్జాతీయంగా ఈ ప్రయత్నాలు ఎన్నో ప్రశంసలు పొందుతున్నప్పటికీ భారతదేశ ఇంధన రంగంలో బొగ్గు రంగం పాత్ర మరువలేనిది. ఈ ఏడాది మార్చి 31 నాటికి భారతదేశ మొత్తం స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 483.26 గిగావాట్లు. ఇందులో బొగ్గు ఆధారిత విద్యుత్ స్థాపిత సామర్థ్యం 210 గిగావాట్లు. భారతదేశం తన ఇంధన మిశ్రమంలో దాదాపు 55 శాతం బొగ్గుపై ఆధారపడి ఉంది. దేశంలోని విద్యుత్తులో దాదాపు 74 శాతం బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అవుతోంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం రికార్డు స్థాయిలో ఒక బిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి ఓ కీలక మైలురాయిని అధిగమించింది. మోదీ క్రియాశీల నాయకత్వంలో బొగ్గు రంగంలో స్వావలంబన వైపు కదులుతూ ఇంధన భద్రత, ఆర్థికవృద్ధి సాధించేలా భారతదేశం అడుగులు వేస్తోంది. కేంద్రం తెచ్చిన సంస్కరణలు, విధానాల ఫలితంగా రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి జరిగింది. వీటిలో గనులు, ఖనిజాలు (అభివృద్ధి, నియంత్రణ) చట్టానికి సవరణలు, బొగ్గు గనుల చట్టం, CMSP చట్టం–2015 ద్వారా బొగ్గు బ్లాకుల వాణిజ్య వేలాన్ని, బొగ్గు రంగాన్ని ప్రైవేట్ సంస్థలకు తెరవడం, సింగిల్ విండో వ్యవస్థ, స్థిరమైన, బాధ్యతాయుతమైన మైనింగ్‌తో కూడిన అత్యాధునిక సాంకేతికతలు, సమర్థవంతమైన పద్ధతులు బొగ్గు ఉత్పత్తిని గణనీయంగా పెంచాయి. ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలో భారతదేశం క్రిటికల్ మినరల్స్ రంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, కీలకమైన ఖనిజాల రంగంలో ముఖ్య పాత్ర పోషించడానికి సాహసోపేతమైన చర్యలు తీసుకుంటోంది.

> భారతదేశం 2024–25 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో ఒక బిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి ఓ కీలక మైలురాయిని అధిగమించింది. మోదీ క్రియాశీల నాయకత్వంలో బొగ్గు రంగంలో స్వావలంబన వైపు కదులుతూ ఇంధన భద్రత, ఆర్థికవృద్ధి సాధించేలా భారతదేశం అడుగులు వేస్తోంది.

చైనా తర్వాత రెండో అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారు భారత్. ఇండోనేసియా, ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి హై గ్రేడ్ బొగ్గును కూడా దిగుమతి చేసుకుంటోంది. దేశీయ ఉత్పత్తి పెరగడం వల్ల 2024 ఏప్రిల్, డిసెంబర్ మధ్య భారతదేశ బొగ్గు దిగుమతులు 8.4 శాతం తగ్గాయి. ఫలితంగా గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే దాదాపు 5.43 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్యాన్ని దేశం ఆదా చేసింది. ఉద్గారాలను తగ్గించడం, వాతావరణ మార్పులను తగ్గించడం కోసం బొగ్గు/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను ప్రోత్సహించడానికి రూ.8,500 కోట్ల వ్యయంతో సమగ్ర పథకానికి ఇటీవల కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో మార్గం సుగమమైంది. 'బొగ్గు నుంచి SNG, నైట్రేట్ ప్రాజెక్టులను స్థాపించడానికి ఈక్విటీ పెట్టుబడుల ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించింది. భారతదేశం పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని, ముఖ్యంగా సౌర, పవన విద్యుదుత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరిగినప్పటికీ, వాటి ఉత్పత్తి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఒడిదొడుకులకు గురవుతూ ఉంటుంది. ఎల్లవేళలా స్థిరమైన ఉత్పాదకతను సౌర, పవన విద్యుత్ ప్లాంట్లు కలిగి ఉండకపోవడంతో గ్రిడ్ నిర్వహణలో సవాళ్లు తప్పవు. ఈ నేపథ్యంలో ఎళ్లవేళలా నాణ్యమైన థర్మల్ విద్యుదుత్పత్తి కోసం బొగ్గు ఎంతో కీలకంగా మారింది.

2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే 'వికసిత్ భారత్ @ 2047' లక్ష్యంతో భారత ప్రభుత్వం ముందుకు సాగుతోంది. 2021 నవంబర్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి 'ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ చేంజ్ (COP–26)లో భారతదేశం 2070 నాటికి కర్బన ఉద్గారాలను నికరంగా సున్నా (నెట్ జీరో) స్థాయికి తగ్గించాలని లక్ష్యంగా ప్రకటించింది. ఇక్కడ నెట్ జీరో అంటే బొగ్గు వాడకాన్ని జీరో చేయడం కాదు. పరిశ్రమల్లో అత్యాధునిక సాంకేతికతను వినియోగించి కర్బన ఉద్గారాలను సాధ్యమైనంతగా తగ్గించడంతో పాటు అడవుల విస్తీర్ణాన్ని పెంచి రెండింటి మధ్య సమతుల్యతను సాధించడం. మనదేశ పురోగతికి బొగ్గు దశాబ్దాల తరబడి ఇంధనాన్ని అందిస్తోంది. లక్షలాది గృహాలకు శక్తిని అందించింది. ఉపయోగకరమైన ఆర్థిక కార్యకలాపాలను ఉత్పత్తి చేసింది. వాతావరణ మార్పు, వాయు కాలుష్యంపై స్థిరమైన మార్గాన్ని అనుసరించాల్సిన అవసరాన్ని గుర్తించినప్పటికీ, రాబోయే రోజుల్లో బొగ్గు రంగం, సవాళ్లను ఎదుర్కొంటూనే భారతదేశ ఇంధన రంగానికి ప్రధాన దిక్సూచిగా నిలవనుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు.



• ప్రసన్నకుమార్ మోటుపల్లి
సీఎండీ, ఎన్ఎల్‌సీ ఇండియా, బొగ్గు మంత్రిత్వ శాఖ

'పిడుగు' నుంచి రైతులను రక్షించండి

వ్యవసాయ పనులు చేసుకుంటున్న రైతులపై పిడుగులు పడడం, వారు తాము నమ్ముకున్న చేనులోనే పాణాలు వదలడం బాధాకరం. ఆదిలాబాద్ జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో విత్తనాలు విత్తుతున్న రైతులపై పిడుగుపడి ఇటీవల ఆరుగురు చనిపోయారు, పన్నెండు మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇలాంటి హృదయ విదారక సంఘటనలు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ జరుగుతున్నాయి. విపత్తులను అడ్డుకోవడం ఎవరి వల్లా కాదు. కానీ జాగరూకతతో వ్యవహరిస్తే భారీ ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చు. సహజసిద్ధమైన వానలు దూరమైన తరువాత అకాల వర్షాలు పడుతున్నాయి. దీనికంతటికీ కారణం మారిన వాతావరణ పరిస్థితులు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అంచనా ప్రకారం ప్రతి సంవత్సరం సుమారు రెండు వేల మందికి పైగా పిడుగుపడి చనిపోతున్నారు.

మారిన వాతావరణ పరిస్థితుల వల్ల ఇపుడు వాన కంటే ముందే ఉరుములు, మెరుపులతో పిడుగులు పడుతున్నాయి. దీంతో జనంతో పాటు గొర్రెలు, మేకలు, ఆవులు వంటి మూగజీవాలు పిడుగుపాటుకు బలైపోతున్నాయి. ఇంతటి విధ్వంసాన్ని సృష్టిస్తున్న పిడుగుపాటు నుంచి పేద రైతాంగాన్ని కాపాడాలి. ఇందుకు ప్రభుత్వాలు శాస్త్ర, సాంకేతిక రంగాలను విరివిగా ఉపయోగించుకోవాలి. ప్రతి గ్రామంలోని చేలలో 'లైట్నింగ్ కండక్టర్లు' ఏర్పాటు చేయాలి. ఇవి పిడుగు పడినపుడు అధిక విద్యుదావేశం గ్రహించుకొని భూమిలోకి పంపిస్తాయి. ఇవి ఏర్పాటు చేయడం ప్రభుత్వానికి పెద్ద విషయం కాదు. పట్టణాలలో ప్రభుత్వ భవనాలపైన ఈ లైట్నింగ్ కండక్టర్లను విధిగా ఏర్పాటుచేస్తారు. మరి పల్లెలలో, వ్యవసాయ క్షేత్రాలలో ఎందుకు ఏర్పాటు చేయడం లేదు?

పిడుగు పడక ముందు తీసుకునే జాగ్రత్త చర్యలను ప్రభుత్వం లేదా స్వచ్ఛంద సంస్థలు విస్తృతంగా ప్రచారం చేయాలి. గ్రామీణాభివృద్ధికి వేల కోట్లను ఖర్చు చేస్తున్న ప్రభుత్వం రైతాంగం ప్రాణాలను కాపాడడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరం. కేంద్ర ప్రభుత్వం 'దామిని యాప్' ద్వారా సేవలందిస్తోంది. అది ఎంతమందికి చేరుతున్నదో తెలియదు. వాతావరణ శాస్త్రవేత్తలు నలభై నిమిషాల ముందు ఎక్కడ పిడుగు పడుతుందో చెప్పవచ్చని అంటున్నారు. కాని ఖచ్చితత్వం మీద సందేహం కల్గుతోంది. ఇస్రో 'ఎర్త్ నెట్‌వర్క్' సహకారంతో ముందస్తు సమాచారం ద్వారా అధికారులను అప్రమత్తత చేస్తుంది. కాని అధికార యంత్రాంగం కదలడం లేదు. విపత్కర పరిస్థితులలో ప్రజలే తగిన రక్షణ చర్యలు తీసుకొని తమ విలువైన ప్రాణాలు కాపాడుకోవాలి.

– బి. వేణుగోపాల్‌రెడ్డి, ఆదిలాబాద్

స్నేహం మాటున అమెరికా కుట్రలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ప్రధానమంత్రి మోదీకి మంచి మిత్రుడు అని భారతీయుల్లో చాలామంది నమ్ముతారు. 'మోదీ నాకు మంచి మిత్రుడు. భారతీయులంటే నాకు చాలా ఇష్టం' అని ట్రంప్ కూడా పలుమార్లు బహిరంగంగా చెప్పారు. కానీ అదే ట్రంప్ ఇటీవల భారత్‌లో ఆపిల్ కంపెనీ పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అంతేకాదు, 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మ నిర్భర్ భారత్' లాంటి కార్యక్రమాలను ఇప్పుడు ట్రంప్, ఒకప్పుడు మాజీ అధ్యక్షుడు బైడెన్ కూడా వ్యతిరేకించారు.

అలాగే బైడెన్ హయాంలో భారత ఎన్నికల వ్యవస్థలో అమెరికా జోక్యం చేసుకోవాలని చూసిందని, ఇందుకోసం నిధులు కూడా కేటాయించిందని స్వయంగా ట్రంప్ ఇటీవల కుండబద్దలు కొట్టిన సంగతి తెలిసిందే. ఇది నిజమే అనిపించే ఉదంతాలు కొన్ని మన దేశంలో జరిగాయి కూడా. పంజాబ్, హర్యానా తదితర రాష్ట్రాలలో జరిగిన రైతు ఉద్యమం; ఢిల్లీలో జరిగిన షాహీన్ బాగ్ ఉద్యమం లాంటివి. ఇవి అచ్చం శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో ఆ దేశ ప్రభుత్వాలను తల్లకిందులు చేసిన ఉద్యమాలను పోలి ఉండడం గమనార్హం. అంటే రైతు ఉద్యమకారులు దేశ రాజధాని ఢిల్లీకి రావడానికి తీవ్రంగా ప్రయత్నించింది భారత ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకేనా?

ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలు సైతం ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొంటున్న పరిస్థితిలో భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం కేవలం దశాబ్ద కాలంలోనే 11వ స్థానం నుంచి 4వ స్థానానికి చేరింది. అందుకే భారత్‌లో కూడా అలాంటి అలజడులు సృష్టించాలనుకుందా అనే సందేహాలు నిజమనిపిస్తున్నాయి.

గత చరిత్రను చూస్తే 1972 ప్రాంతంలో అమెరికాలో జనాభా చాలా తక్కువ. ఆ కాలంలో అమెరికాలో పరిశ్రమలు స్థాపిస్తే చవకగా ఉద్యోగులు, కార్మికులు లభించే పరిస్థితి లేదు. అందువల్ల ఆ దేశ పారిశ్రామికవేత్తలు చైనాలో పరిశ్రమలను పెట్టడం ప్రారంభించారు. దీంతో చైనా అనతికాలంలోనే ఎంతో అభివృద్ధిని సాధించింది. అయితే ప్రస్తుతం అమెరికాలో జనాభా పెరిగింది. తద్వారా నిరుద్యోగం కూడా పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లోనే చైనా పాలకుల వైఖరి కారణంగా చాలామంది పారిశ్రామికవేత్తలు ఆ దేశాన్ని వీడి మరో అనుకూలమైన దేశం కోసం చూస్తున్నారు. ఈ తరుణంలో వారందరికీ భారత్ అందివచ్చిన ఆశాకిరణంలా కనిపిస్తోంది. అందుకే ఎన్నో పరిశ్రమలు భారత్‌కు తరలి వస్తున్నాయి. అందులో భాగంగానే ఆపిల్ సంస్థ కూడా భారత్‌కు రావాలనుకున్నది. దీన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అడ్డుకుంటున్నారు. ఆ పరిశ్రమ అమెరికాలోనే పెట్టాలని, భారత్‌లో పెడితే అధిక సుంకాలు విధిస్తామని ఇటీవల ఆ కంపెనీని బహిరంగంగా హెచ్చరించారు.

ఇప్పటికే భారత ఆర్థిక వ్యవస్థ రాకెట్ స్పీడుతో దూసుకుపోతుండటంతో భారత్ మరింత శక్తివంతంగా మారకుండా చూసేందుకే అప్పుడు బైడెన్ ప్రభుత్వం కానీ, ఇప్పుడు ట్రంప్ సర్కార్ కానీ అడ్డుపడుతున్నాయని భావించాల్సి వస్తోంది. ఏ దేశమైనా అభివృద్ధి చెందకూడదంటే ఆ దేశ ఆర్థిక, పారిశ్రామిక, సైనిక శక్తులు పటిష్ఠం కాకూడదు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మ నిర్భర్ భారత్' లాంటివి విజయవంతం కాకూడదు. కానీ కేంద్ర ప్రభుత్వంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమ రాష్ట్రాల అభివృద్ధికి తీవ్రంగా కృషి చేస్తున్నాయి. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు వివిధ దేశాలలో పర్యటిస్తూ అక్కడి పారిశ్రామికవేత్తలను తమ రాష్ట్రాలకు ఆహ్వానిస్తూ గ్రీన్ కార్పెట్ పరుస్తున్నారు. దీంతో చైనా తదితర దేశాల్లోని పరిశ్రమలు భారత్ బాట పట్టాయి. అందుకే ఇప్పటిదాకా అమెరికా పలుమార్లు భారత్‌లో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్రంగా పలు రకాల ప్రయత్నాలు చేసింది. అవన్నీ విఫలం కావడంతోనే ఆపిల్ కంపెనీ విషయంలో ఇక ప్రత్యక్ష పోరాటానికి రంగంలోకి దిగింది. భారత్ ఇదే విధంగా అభివృద్ధి సాధిస్తూపోతే తమ అగ్రరాజ్య హోదా వీగిపోయే అవకాశముందని, గతంలో చైనా విషయంలో జరిగిన చారిత్రక తప్పిదం భారత్ విషయంలో జరుగకూడదని అమెరికా భావిస్తున్నది.

ఇందుకోసం మన దేశంలోని ప్రతిపక్ష నాయకులను కూడా వాడుకుంటున్నదన్న వాదనలు వినిపిస్తున్నాయి. భారత ఆర్థిక రంగాన్ని దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే అడ్రెస్ లేని అమెరికా సంస్థలు ఇచ్చిన రిపోర్టుల పేరుతో షేర్ మార్కెట్లో అక్రమాలు అంటూ దుష్ప్రచారం లేవదీస్తున్నారనీ, ఆ విధంగా అదానీ కంపెనీ లక్షల కోట్లు పోగొట్టుకునేలా చేసి తద్వారా షేర్ మార్కెట్ పతనం చెందేలా చేశారనీ ఒక వాదన. అలాగే కెన్యా ప్రభుత్వం అదానీతో ఒప్పందాన్ని రద్దు చేయడంతో భారత్‌కు ఆఫ్రికాలోకి ప్రవేశం ఆగిపోయింది. హిండెన్‌బర్గ్ పేరుతో ఆడిన నాటకం కూడా తెలిసిందే. ఇజ్రాయెల్‌లో కూడా అదానీని అడ్డుకునే ప్రయత్నం జరిగింది.

భారత్ కరోనా వ్యాక్సిన్‌ను స్వయంగా తయారు చేయడం కూడా అమెరికా మెడికల్ మాఫియాకు నచ్చలేదు. అదే సమయంలో ఇక్కడ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ భారత కరోనా వ్యాక్సిన్ విషయంలో పలు సందేహాలు వ్యక్తం చేశారు. అలాగే ఆయన రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలునూ అక్రమాల పేరుతో అడ్డుకునే ప్రయత్నం చేసిన సంగతి తెలిసిందే. ఈ ఒప్పందంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పాల్సి వచ్చింది. యాదృచ్ఛికమో ఏమో తెలియదు కానీ అమెరికా వ్యతిరేకించిన అన్ని అంశాలనూ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుంటుంది.

మోదీ ప్రభుత్వం అంబానీ, అదానీ కంపెనీలకు దోచిపెడుతుందన్న ప్రచారంతో ఆర్థిక రంగంతోపాటు పారిశ్రామిక రంగం స్వల్ప కుదుపులకు గురైనా మళ్ళీ నిలదొక్కుకున్నాయి. అలాగే స్వావలంబన దిశగా దూసుకెళ్తున్న భారత్ రక్షణ రంగంలోనూ పటిష్ఠంగా తయారవుతోంది. భారత్‌లో తయారైన మిస్సైల్స్ ఇటీవల పాకిస్థాన్‌తో జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో ప్రపంచ దేశాలను ఆశ్చర్యచకితులను చేశాయి. ప్రతి విషయంలోనూ విదేశాలపై ఆధారపడిన దశ నుంచి అగ్రశ్రేణి యుద్ధ విమానాలు కూడా స్వదేశంలోనే తయారు చేసుకునే స్థాయికి చేరడమే కాకుండా, భారత్ యుద్ధ విమానాల సరఫరాకు విదేశాల నుంచి డిమాండ్ పెరగడం కూడా అమెరికాకు చిరాకును కలిగించి ఉండవచ్చు. భారత్ ఎదుగుదలను అమెరికా జీర్ణించుకోలేకపోతోంది. కానీ భారత్ సర్వసత్తాక సార్వభౌమాధికార దేశమన్న విషయాన్ని అమెరికా మరచిపోకూడదు.

భారత్ లాంటి సువిశాలమైన, అత్యధిక జనాభా గల దేశంలో శక్తిమంతమైన ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉండడం ఎంతో అవసరం. అంతేగాక పరిపాలన కూడా పారదర్శకంగా ఉన్నప్పుడే అమెరికా లాంటి దేశాల కుట్రలు విఫలమవుతాయి.

■ శ్యామ్‌సుందర్ వరయోగి

> ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలు సైతం ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొంటున్న పరిస్థితిలో భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం దశాబ్ద కాలంలోనే 4వ స్థానానికి చేరింది. భారత్ ఇదే విధంగా అభివృద్ధి సాధిస్తూపోతే తమ అగ్రరాజ్య హోదా వీగిపోయే అవకాశముందని, గతంలో చైనా విషయంలో జరిగిన చారిత్రక తప్పిదం భారత్ విషయంలో జరగకూడదని అమెరికా భావిస్తున్నది.






సందిగ్ధ స్థానికం

స్థానిక సంస్థల ఎన్నికలపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం

- ఈనెలఖారులోగా నోటిఫికేషన్ వస్తుందని పొంగులేటి ప్రకటనతో జోష్
- టీపీసీసీ చీఫ్ కౌంటర్‌తో అయోమయంలో ఆశావహులు
- తొలుత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం మొగ్గు
- ఆ తరువాతే సర్పంచ్, మునిసిపల్ ఎన్నికలు నిర్వహించే అవకాశం
- ఇప్పటికే ఎన్నికలకు విస్తృతంగా ఏర్పాట్లు చేసిన అధికారయంత్రాంగం
- బీసీ రిజర్వేషన్లు తేల్చాకే ఎన్నికలకు వెళ్లేలా ప్రభుత్వం ఆలోచన
- ఉమ్మడి జిల్లాలో 1,702 జీపీలు, 75 జడ్పీటీసీలు, 775 ఎంపీటీసీ స్థానాలు



■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

స్థానిక సంస్థల ఎన్నికలపై సందిగ్ధం నెలకొంది. అదిగో.. ఇదిగో.. అంటూ ఊరిస్తున్న పరిషత్తు, సర్పంచ్, మునిసిపల్ ఎన్నికలకు బీసీ రిజర్వేషన్ల ఖరారుపై ఆధారపడి ఉన్నాయి. ఈ నెలఖారులోగా పరిషత్ ఎన్నికల నోటిఫికేషన్ ఉంటుందని ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటన చేయటంతో ఆశావహుల్లో ఉత్సాహం నిండింది. అయితే కోర్టులో ఉన్న అంశాన్ని, తనకు సంబంధం లేని శాఖపై ఎలా ప్రకటన చేస్తారని టీపీసీసీ అధ్యక్షుడు మంత్రి పొంగులేటి ప్రకటనపై కౌంటర్ ఇవ్వటంతో స్థానిక ఎన్నికలను సంకటంలో పడేస్తున్నాయి. బీసీ రిజర్వేషన్లను తేల్చాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

విస్తృత ఏర్పాట్లు

స్థానిక సంస్థల సంగ్రామానికి అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అధికారులు ఇప్పటికే ఓటరు జాబితాను సిద్ధం చేశారు. 2019లో జరిగిన స్థానిక సం స్థల ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాల్లో మొత్తం 1,708 గ్రామపంచాయతీలు ఉండగా, రిజర్వేషన్లపై కోర్టులు కేసు ఉండటంతో అప్పట్లో ములుగు జిల్లా మంగపేట మండలంలోని 25గ్రామాలకు ఎన్నికలు నిర్వహించలేదు. అలాగే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత 280గ్రామ పంచాయతీలు ఏకగ్రీవంగా పాలకవర్గాలను ఎన్నుకున్నారు. మిగిలిన 1,403 జీపీలకు ఎన్నికలు నిర్వహించారు. ఇటీవల స్టేషన్‌ఘన్‌పూర్, ములుగు కొత్తగా మునిసిపాలిటీలుగా ఏర్పడ్డాయి. వీటితో పాటు నర్సంపేట మునిసిపాలిటీలో నాలుగు గ్రామాలు విలీనమయ్యాయి. దీంతో ప్రస్తుతం 1,702 గ్రామపంచాతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2019లో 71మండలాలకు జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించారు. ఈసారి మహబూబాబాద్ జిల్లాల్లో సీరోలు, ఇనుగుర్తి మండలాలు కొత్తగా ఏర్పడ్డాయి. వీటితో పాటు భూపాలపల్లి జిల్లాలో గోరికొత్తపల్లి, ములుగు జిల్లాలో మల్లంపల్లి మండలాలు ఏర్పడ్డాయి. కొత్తగా నాలుగు మండలాలే ఏర్పడటంతో జడ్పీటీసీల సంఖ్య 71 నుంచి 75కు చేరింది. కాగా, గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. దీంతో సాధ్యమైనంత త్వరగా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.

బీసీ రిజర్వేషన్లు తేలాకే ఎన్నికలు

స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉంది. 2024 ఫిబ్రవరి 1వ తేదీతో సర్పంచుల పదవీకాలం, జూన్ 31న ఎంపీటీసీ, జడ్పీటీసీలు, ఆగస్టులో మునిసిపల్ చైర్మన్ల పదవీకాలం పూర్తికావటంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. దీంతో ఈనెలఖారులోగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ వస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన ప్రకటన ఆశావాహుల్లో జోష్ నింపింది. అయితే మరుసటిరోజే టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ మంత్రి ప్రకటనపై కౌంటర్ ఇవ్వటంతో ఆశావహుల

(మిగతా 6వ పేజీలో...)

ఉమ్మడి వరంగల్ జిల్లాలో జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, గ్రామపంచాయతీలు ఓటర్ల వివరాలు..

జిల్లా	జడ్పీటీసీలు	ఎంపీటీసీలు	జీపీలు	ఓటర్లు
వరంగల్	11	130	317	3,85,163
హనుమకొండ	12	129	210	3,65,832
జనగామ	12	134	281	4,01,115
మహబూబాబాద్	18	193	482	5,52,192
భూపాలపల్లి	12	106	241	2,90,663
ములుగు	10	83	171	2,31,052
మొత్తం	75	775	1,702	22,26,017



మంజూర్‌నగర్‌లో సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే జీఎస్ఆర్

సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల్లా నడిపిస్తున్నాం..

- పేదలందరికీ ఇళ్లు, ఆదాయం సమకూరేలా చేయడమే లక్ష్యం
- సాధించుకున్న రాష్ట్రంలో ప్రజలే ఫలాలు అందుకోవాలి..
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- భూపాలపల్లిలో సబ్‌స్టేషన్ల ప్రారంభం, శంకుస్థాపన

6

మద్యం మత్తులో..

- భార్యను హత్య చేసిన భర్త
- కొన్ని రోజులుగా కుటుంబ కలహాలు
- నెల్లికుదురు మండలంలో ఘటన



రంగమ్మ(ఫైల్)

నెల్లికుదురు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో తాగిన మైకంలో ఓ వ్యక్తి తన భార్యను హత్య చేశాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లాలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్సై శివరామకృష్ణ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లికుదురు మండలం హేమ్లాతండాలో బానోత్ భద్రు-రంగమ్మ(55) దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ఓ కూతురు ఉంది. ఆమెకు వివాహమైంది. ఈ క్రమంలో నిత్యం భద్రు తాగిరావడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. సోమవారం రాత్రి భద్రు మద్యం తాగి తన భార్యతో గొడవపడ్డారు. క్షణికావేశంలో భార్యపై దాడిచేసి, గొంతు నులిపి చంపేశాడు. మంగళవారం తెల్లవారుజామున తండావాసులు ఇంట్లో చూడగా రంగమ్మ శవమై కనిపించింది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. భద్రును అదుపులోకి తీసుకున్నారు. వారి కుమార్తె వాంకుడోత్ శ్రీలత ఫిర్యాదు మేరకు భద్రుపై కేసు నమోదు చేసి, రంగమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై శిరామకృష్ణ తెలిపారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్లకు తీపి కబురు

నియామకాలపై తొలగిన ఉత్కంఠ



ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణాతో చర్చిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, ఇతర పాలక మండలి సభ్యులు

- 2010 బ్యాచ్ 27మంది అధ్యాపకులకు లైన్ క్లియర్
- కొత్త పీహెచ్‌డీ అడ్మిషన్లు బంద్
- స్నాతకోత్సవ బంగారు పతకాల అదనపు ఖర్చుకు ఆమోదం
- లేడీస్ హాస్టల్.. డైనింగ్ హాల్‌కు ఒకే..
- నూతన కంప్యూటర్ల కొనుగోలుకు పచ్చజెండా..
- కేయూ పాలకమండలి సమావేశంలో నిర్ణయాలు

7

దసరాకు సిద్ధం

- శరవేగంగా భద్రకాళి మాడవీధుల నిర్మాణం
- గుడిచుట్టూరా మట్టి పరవడం పూర్తి
- త్వరలో రివిటింగ్ పని.. ఆ తర్వాత సీసీ రోడ్డు నిర్మాణం
- రెండింతలు పెరగనున్న ఆలయ విస్తీర్ణం
- తెలంగాణలో మూడో అతిపెద్ద ఆలయంగా భద్రకాళి



7

ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకోవాలి

- ఇబ్బందులు తలెత్తినప్పుడు అధికారులను సంప్రదించాలి
- ఇళ్ల పరిశీలనలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



పెంబర్తిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

హసన్‌పర్తి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ లబ్ధిదారులకు సూచించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ మంగళవారం పెంబర్తిలో పురోగతిలో ఉన్న ఇందిరమ్మ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్లాబ్, రూఫ్ లెవల్, బేస్‌మెంట్ లెవల్ వరకు నిర్మాణాలు పూర్తి అయిన ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి గ్రామానికి చెందిన లబ్ధిదారులు స్వరూప, రజిత, నిర్మల, అరుణ, సమ్మక్క, మంజుల, సులోచన, రాజేశ్వరీలను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల నిర్మాణ పనులను ఏవిధంగా చేయిస్తున్నారని, మేస్త్రీలు ఇంటి నిర్మాణానికి ఎంత తీసుకుంటున్నారని, నిర్మాణ పనులు ఎప్పటి వరకు పూర్తి చేస్తారని, ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ఫొటో క్యాప్చర్ చేస్తున్నారా అని లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిర్మాణ పనులకు దశల వారీగా బిల్లులు అందుతాయని తెలిపారు. ఎక్కడైనా చిన్న చిన్న సమస్యలు వచ్చినప్పుడు వాటి పరిష్కార మార్గాల కోసం సంబంధిత అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ ధారావత్ రవిందర్, డీఈ సిద్దార్థనాయక్, డిప్యూటీ తహసీల్దారు రహీం పాషా, ఎంపీడీవో కర్ణాకర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ చేగొండ సరిత, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ చైర్మన్ పంచాయతీ స్పెషలాఫీసర్ నాగవల్లి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి హేమలత, ఇందిరమ్మ కమిటీ సభ్యులు జోరుక పూల, తాళ్ళపెల్లి రమాదేవి రమేష్, గోపాల్, సునీల్, సుధాకర్, కారోబార్ సదానందం, యూత్ నాయకులు సౌరం చరణ్‌తో పాటు లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలు లేకుండా
చర్యలు తీసుకోవాలి

ట్రాఫిక్ అడిషినల్ డీసీపీ రాయల ప్రభాకర్ రావు


పోలీస్ హెడ్‌క్వార్టర్ ఎదుట ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న డీసీపీ ప్రభాకర్‌రావు

వరంగల్ క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్ ఆక్రమణలకు గురికాకుండా ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ అడిషినల్ డీసీపీ రాయల ప్రభాకర్‌రావు సూచించారు. మంగళవారం వరంగల్ పోలీస్ హెడ్‌క్వార్టర్ జంక్షన్‌తో పాటు కేయూ క్రాస్ ట్రాఫిక్ జంక్షన్‌లను హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డితో కలిసి అడిషినల్ డీసీపీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా ఫ్రీలెఫ్ట్‌లో వాహనాలు సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అవసరం లేని నోపార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మిషన్ భగీరథ పైప్‌వాల్వ్‌ల వద్ద ఏర్పాటు చేసిన ఐరన్ జాలీలు రోడ్డుకు ఎత్తుగా ఉన్నాయని, రోడ్డుకు సమానంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జంక్షన్‌లలో సిబ్బంది అప్రమత్తంగా ఉండి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌లను, సిబ్బందిని ఆదేశించారు.

23న గంగా రామాయణ రైలు యాత్ర

కాజీపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న కాజీపేట మీదుగా గంగా రామాయణ పుణ్య క్షేత్ర యాత్రకు ప్రత్యేక రైలును నడిపించనున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ డీఎస్‌జీపీ కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలు యాత్ర జూన్ 23న ప్రారంభమై (కాశీ) వారణాసి, అయోధ్య, నైమిశారణ్య, ప్రయాగ్‌రాజ్, శృంగవర్పూర్ ప్రాంతాల సందర్శనతో జూలై 1న ముగుస్తుంది. సికింద్రాబాద్, భువనగిరి, జనగామ, కాజీపేట, వరంగల్, మమబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, పలాస, బరంపూర్, భువనేశ్వర్ రైల్వే స్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు. ఈ రైలుకు సాధారణ టిక్కెట్ ధర ఒక్కరికి రూ.16,200, థర్డ్ ఏసీ 26,500, సెకండ్ ఏసీ రూ.35,000 ఉంటుందని. తెలిపారు.

ప్యాకేజీ 2 - ఐదు జ్యోతిర్లింగాల యాత్ర

ఈ రైలు జూలై 5న ప్రారంభమై ఉజ్జయిని మహాకాలేశ్వర్ - ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీంశంకర్, ఘృష్ణేశ్వర్, ఎల్లోరా, మోఘ్, నాగ్‌పూర్ ప్రాంతాల మీదుగా సందర్శించి జూలై 13న ముగుస్తుంది. ఈ రైలు సికింద్రాబాద్ మీదుగా ప్రారంభమె కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాపూర్, నాందేడ్, ముద్ఖడ్, పూర్ణ రైల్వే స్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు. జనరల్ టికెట్ ధర ఒక్కరికి రూ.14,700, థర్డ్ ఏసీ రూ.22,900, సెకండ్ ఏసీ రూ.29,900 ఉంటుందని తెలిపారు. టిక్కెట్ బుకింగ్ తోపాటు ఇతర వివరాలకు 97013 60701, 92814 95843, 92814 95845, 92810 30749 ఫోన్ నంబర్లు సంప్రదించాలని చెప్పారు.

ములుగు డీఈవోగా వాసంతికి బాధ్యతలు




వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా డీఈవో పాణి ఏసీబీకి పట్టుబడిన నేపథ్యంలో హనుమకొండ డీఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డిప్యూటీ ఈవో డెడ్డే వాసంతికి ములుగు జిల్లా డీఈవోగా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, వాసంతి బుధవారం ములుగు జిల్లా ఎఫ్ఏసీ డీఈవోగా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

వరంగల్ క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ సన్‌ప్రీత్ సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ కమిషనరేట్‌కు అలాట్ అయిన వి.జానకీరాంరెడ్డిని పాలకుర్తికి బదిలీ చేయగా, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న జి.మహేందర్‌రెడ్డిని మహబూబాబాద్ టౌన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల్లా నడిపిస్తున్నాం..

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- భూపాలపల్లిలో సబ్‌స్టేషన్ల ప్రారంభం, శంకుస్థాపన


సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

భూపాలపల్లిటౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల్లా నడిపిస్తున్నామని, పేదలందరికీ ఇళ్లు, ఆదాయం సమకూరేలా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని చెన్నాపూర్‌లో మంగళవారం రూ.1.40కోట్లతో నిర్మించిన సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. అలాగే భూపాలపల్లి మంజూర్‌నగర్‌లో ధర్మారావుపేట, నవాబుపేట గ్రామాలలో రూ.7.30కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ల కోసం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భూపాలపల్లి పట్టణంలోని మంజూర్ నగర్‌లో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గడిచిన పదేళ్లలో దోపిడీ చేసిందని ఆరోపించారు. గడిచిన పదేళ్లలో ఉద్యోగాలు ఇవ్వలేదని, పేదలకు ఇండ్లు లేవని, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వకపోగా కనీసం ఉపాధి కల్పించేందుకు రుణాలు కూడా అందించిన దాఖలాలు లేవన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల ఇవ్వలేదని, 200 యూనిట్ల ఉచిత కరెంటు లేదని తీవ్ర విమర్శలు చేశారు. కానీ తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు వడ్డీలేని రుణాలు అందిస్తుందని అన్నారు. ఏడాదికి రూ.20వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.1లక్ష కోట్లు ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు. పారిశ్రామిక అభివృద్ధి కోసం రూ.1.60లక్షల కోట్లు తీసుకువస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమం కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్సియల్ స్కూళ్ల కోసం రూ.11.500కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థులకు 40శాతం డైట్ చార్జీలు పెంచామని, 200శాతం కాస్మోటిక్స్ చార్జీలు పెంచినట్లు తెలిపారు. అంతేకాకుండా సన్న బియ్యం అందిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంటే ఉండదని ప్రజలను తప్పుదోవ పట్టించారని అన్నారు. కానీ రాష్ట్రంలోని 200యూనిట్ల వినియోగించుకుంటున్న ప్రజలకు ఉచితంగా విద్యుత్ అందించడమే కాకుండా ఇప్పటివరకు రూ.16వేల కోట్లు విద్యుత్ శాఖకు చెల్లించిందని తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గంలో 50వేల మంది లబ్ధి పొందుతున్నారని అన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థలన్నింటికీ ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఇదిలా వుంటే.. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రూ.లక్ష కోట్లు దోపిడీ చేసి అందులో నాణ్యత లేకుండా చేశారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో నిర్మించిన ప్రాజెక్టులు నాగార్జునసాగర్ ప్రాజెక్టు, శ్రీరాంసాగర్, శ్రీపాద, ఎల్లంపల్లి, ఇతర ప్రాజెక్టులు ఇప్పటివరకు చెక్కుచెదరలేదని అన్నారు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టు ప్రమాదంలో ఉందని నిపుణులే స్పష్టం చేశారని అన్నారు. సింగరేణి ఏరియాలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేస్తామని అన్నారు. దుబ్బపల్లి, పరుశరాంపల్లి గ్రామాలకు తగిన న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.



గోరికొత్తపల్లి మండలం చెన్నాపూర్‌లో సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు

మహిళలను ఆర్థికంగా ఉన్నతులుగా తీర్చిదిద్దుతాం..

రాష్ట్రంలోని మహిళలను ఆర్థికంగా ఉన్నతులుగా తీర్చిదిద్దుతామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఈ క్రమంలోనే మహిళా శక్తికి సౌర శక్తిని అప్పగించేందుకు సన్నద్ధమయ్యామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్ వస్తే కరెంటు కష్టాలు తప్పవని ఆరోపించిన బీఆర్ఎస్ నాయకులకు చెంపపెట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిందని అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇవ్వడమే కాకుండా ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వమే చెల్లిస్తోందని అన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండాలని సబ్‌స్టేషన్లను నిర్మాణం చేయిస్తున్నట్లు తెలిపారు. అలాగే భవిష్యత్ తరాల కోసం సోలార్ సిస్టంను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. భూపాలపల్లికి రైల్వేలైన్ తెచ్చేందుకు కృషి చేస్తున్నానని అన్నారు. మోదీ ప్రభుత్వం వల్ల దేశంలో శాంతిభద్రతలు దెబ్బతింటున్నాయని, భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే సెక్యులరిజం బతుకుతుందని స్పష్టం చేశారు.

మెరుగైన విద్యుత్ కోసమే సబ్‌స్టేషన్లు..

భూపాలపల్లి నియోజకవర్గంలోని ప్రజలకు మెరుగైన విద్యుత్ సౌకర్యం కోసమే సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ల వల్ల ఈ ప్రాంతంలోని రైతాంగానికి సరిపడా విద్యుత్ అందుతుందని, లోవోల్టేజీ సమస్య తీరుతుందని అన్నారు. అంతేకాకుండా 100 పడకల ఆస్పత్రి, మెడికల్ కళాశాల, ఆయుష్ కేంద్రంలతో పాటు పట్టణ ప్రజలకు విద్యుత్ అసౌకర్యం ఉండదని స్పష్టం చేశారు. సమావేశంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్‌రెడ్డి, పుల్లా పద్మావతి, ఎన్ఎన్ఆర్ సంపత్‌రావు, టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, సింగరేణి సీఎండీ బలరాంనాయక్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అశోక్‌కుమార్, సబ్‌కలెక్టర్ మయాన్‌సింగ్, ఎస్ఈ మల్హార్‌నాయక్, ఆర్డీవో రవికుమార్, సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, జెన్‌కో సీఈ ప్రకాష్, మునిసిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, నాయకులు శ్రీదేవి, మధు, సమ్మయ్య, భట్టు కర్ణాకర్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కీర్తిప్రతిష్టలకు భంగం కలిగించొద్దు

వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కీర్తి ప్రతిష్టలకు భంగం కలగకుండా విధులు నిర్వర్తించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. హనుమకొండ, సుబేదారి, ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌లతోపాటు సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, యాంటీ డ్రగ్ విభాగాల్లో ఇటీవల నూతన ఇన్‌స్పెక్టర్లుగా బాధ్యతలు చేపట్టిన శివకుమార్, రంజిత్, సురేశ్, రాఘవేందర్, సత్యనారాయణ, సతీష్‌లు మంగళవారం సీపీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేశారు. పోలీసులను ఆశ్రయిస్తే న్యాయం జరుగుతందనే నమ్మకాన్ని ప్రజలకు మరింతగా పెంచాలన్నారు సీపీ సూచించారు.

11 మంది గిరిజనులపై కేసు నమోదు

ఏటూరునాగారం రూరల్, జూన్17, (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని రొయ్యూర్ సమీపంలో సోమవారం అటవీశాఖాధికారులపై దాడికి యత్నించిన 11 మంది గిరిజనులపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై రాజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. మండలంలోని రొయ్యూర్ బీట్ పరిధిలో గల పోడుభూమిలో గుడిసెలు వేసి నివాసం ఉంటున్న వారి గుడిసెలు తొలగించేందుకు అటవీశాఖ అధికారులు ప్రయత్నించగా గుడిసెవాసులు అడ్డు తగిలారు. గుడిసెవాసులు, అటవీశాఖాధికారుల మధ్య వాగ్వాదం చేసుకోగా గుడిసెవాసులు అటవీ అధికారులపై దాడికి యత్నించారు. ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత వాతావరణం చేసుకోవడంతో అటవీశాఖాధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా అటవీశాఖ అధికారులు గుడిసెవాసులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసి 11 మందిపై కేసు పెట్టినట్లు ఎస్సై తెలిపారు.

కాళోజీ వర్సిటీ డిప్యూటీ రిజిస్ట్రార్‌గా డాక్టర్ కేశవ్

వరంగల్ మెడికల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం డిప్యూటీ రిజిస్ట్రార్‌గా డాక్టర్ కేశవ్ నియమితులయ్యారు. నీట్ కౌన్సెలింగ్, అడ్మిషన్ల ప్రక్రియ కోసం ఐదుగురు అధికారులను డిప్యూటేషన్‌పై ఆరోగ్య విశ్వవిద్యాలయానికి కేటాయించారు. ఈ మేరకు వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తు మెమో నెంబర్ 4433 విడుదల చేశారు. మెదక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతి, నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాల ఆర్థో విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కేశవ్, వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ కళాశాల ప్రొఫెసర్ డి.నాగలక్ష్మి, హైదరాబాద్ ఆర్‌హెచ్ఎఫ్‌డబ్ల్యూటీసీ కార్యాలయ పర్యవేక్షకుడు ఎం.డి.ఫయాజ్, మహబూబాబాద్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల పరిపాలన అధికారి బి.శ్రీనివాస్‌ను డిప్యూటేషన్‌పై ఆరోగ్య విశ్వవిద్యాలయానికి కేటాయించారు. ఏడాది కాలంపాటు ఆరోగ్య విశ్వవిద్యాలయంలో విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని లేఖలో పేర్కొన్నారు.

లడ్డూల డబ్బులు మాయం

కాళేశ్వరాలయం ఈవో నోటీసులిచ్చినా ఫలితం శూన్యం



మహదేవపూర్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలోని ప్రసాదశాల ఉద్యోగులు చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాళేశ్వరం పుష్కరాల్లో లడ్డూ ప్రసాదం అమ్మకాల ఆదాయం 1 కోటి 47 లక్షలు సమకూరగా, వచ్చిన ఆదాయంలో నుంచి రూ.3.45లక్షల నగదు మాయమైంది. హుండీల లెక్కింపు అనంతరం ప్రసాదశాల ఆదాయం ఇతర అంశాలపై ఆలయ ఈవో లెక్కలు బయటకు తీయడంతో అసలు బండారం బయటపడింది. వెంటనే ఈవో మారుతి స్పందించి ప్రసాదశాల ఇన్‌చార్జికి నోటీసులు ఇచ్చారు. సదరు ఇన్‌చార్జి నోటీసులు అందుకున్న అనంతరం రూ.1.29 లక్షలు చెల్లించారు. ఇంకా రూ.2.45 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఆలయ ఈవో నోటీసులు ఇచ్చినా ఇంత వరకు కొంత మేరకే డబ్బులు చెల్లించి మిగతా రెండున్నర లక్షల డబ్బులు చెల్లించకుండా లెక్కలు చెప్పకుండా తాత్సారం చేస్తున్నారు. పుష్కరాలు ముగిసి దాదాపు 20 రోజులు కావస్తున్నా లడ్డూ అమ్మకాల డబ్బులు ఇంతవరకూ లెక్కతేలకపోవడంలో పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. దేవాదాయశాఖ కమిషనర్ స్పందించి లడ్డూ ప్రసాదంలో జరిగిన అవినీతిని బయటకు తీసి బాధ్యులపై చర్య తీసుకోవాలని పలువురు భక్తులు, కాళేశ్వర ప్రజలు కోరుతున్నారు.

కంచ కట్టయ్య జీవితం స్ఫూర్తిదాయకం

రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



కంచ కట్టయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ప్రభాకర్

చెన్నారావుపేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : కంచ కట్టయ్య జీవితం స్ఫూర్తిదాయకమని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని పాపయ్యపేట గ్రామంలోని రాష్ట్ర ప్రభుత్వ ఎక్స్‌పర్ట్ కమిటీ వైస్ చైర్మన్, ప్రొఫెసర్ కంచ ఐలయ్య సోదరుడు కంచ కట్టయ్య ఇటీవల మృతి చెందారు. ఆయన చిత్రపటం వద్ద మంత్రి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కట్టయ్య తన గుండెకు సర్జరీ ఐన తర్వాత 46 సంవత్సరాలు ఒక స్టీల్ వాల్వ్‌తోనే జీవించడం గొప్ప విషయమన్నారు.

వైద్య రంగంలో ఎన్నో విప్లవమైన మార్పులు తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని అన్నారు. అందరూ చదువుపై దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుత సమాజంలో చదువు ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం గ్రామంలోని గౌడ సంఘం నాయకుల ఆహ్వానంతో కంఠ మహేశ్వరాలయాన్ని సందర్శించారు. ఫంక్షన్ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని గౌడ కులస్థులు కోరారు. మంజూరు చేస్తానని హామీ మంత్రి ఇచ్చారు. గౌడన్నలు ఇచ్చిన తాటి ముంజలను మంత్రి తిన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, పీసీసీ వర్కింగ్ చైర్మన్ ఏటీసీ వీరన్న యాదవ్, కాంగ్రెస్ నాయకులు సుభాష్, కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వన్నడి రమేష్, వెంకట్‌నాయక్, ముకల శివ, గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు బండి రమేష్, గండు రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- కూతురు, మామకు గాయాలు

టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొట్టిన పాల వాహనం ● పాలకుర్తిలో ఘటన


మృతి చెందిన చైతన్య

పాలకుర్తి, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్న కుటుంబాన్ని బొలెరో వాహనం ఢీకొట్టడంతో కోడలు మృతిచెందగా, కూతురు, మామ గాయపడిన ఘటన మంగళవారం పాలకుర్తిలో చోటుచేసుకుంది. ఎస్సై పవన్‌కుమార్ కథనం ప్రకారం.. చెన్నూరుకు చెందిన పండుగ చైతన్య (36)కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త కుమార్ 2005లో యాక్సిడెంట్‌లో మృతి చెందాడు. నాటి నుంచి కూలీగా పనిచేస్తూ బిడ్డల్ని పోషించుకుంటోంది. మంగళవారం వ్యక్తిగత పని మీద పాలకుర్తికి చైతన్య తన మామ సోమయ్య, కూతురు ప్రవళికతో కలిసి ఎక్సెల్‌పై వస్తుండగా, వెనుక నుంచి అతివేగంగా బొలెరో (పాలు) వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మామ సోమయ్య కాలు విరిగింది. కూతురు ప్రవళికకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చైతన్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామకు తరలించారు. మృతురాలి సోదరుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సందిగ్ధ 'స్థానికం'

(5వ పేజీ తరువాయి)

ఉత్సాహంపై నీళ్లు చల్లినట్లైయింది. మంత్రికి సంబంధం లేని శాఖపై ప్రకటన చేయడమే కాకుండా, కోర్టులో ఉన్న అం శాలను, మంత్రివర్గంలో చేర్చి అంశాలపై ముందుగా ప్రకటనలు చేయటం సరికాదని మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నట్లుగా సమాచారం. దీంతో ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను ఏ విధంగా అమలు చేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నట్లుగా తెలిసింది. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ మేరకు పార్టీ పరంగా బీసీలకు 42శాతం టికెట్లు ఇవ్వడమా..? చట్టబద్ధంగానే 42శాతం రిజర్వేషన్లు కల్పించాలా..? అనే దానిపై చర్చిస్తున్నట్లుగా సమాచారం. ప్రభుత్వం ఇప్పటికే కులగణనను కూడా పూర్తి చేసింది. బీసీ కమిషన్ నియమించి అభిప్రాయాలు సేకరించింది. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించింది. అయితే కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూలత వచ్చే అవకాశం లేకపోవటంతో పాత రిజర్వేషన్ల ఆధారంగానే స్థానిక ఎన్నికలు నిర్వహించాలనే ఒత్తిడి కూడా ప్రభుత్వం ఉంది. దీంతో ప్రభుత్వం త్వరలోనే ఏదో ఒక నిర్ణయం తీసుకుని, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తుందనే ఆశతో ఆశావహులు ఎదురుచూస్తున్నారు. తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నట్లుగా మంత్రి పొంగులేటి ప్రకటన బట్టి తెలుస్తోంది. పార్టీ గుర్తులపై పరిషత్తు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికలు ప్రభుత్వ పనితీరుకు రెఫరెండంగా భావించే అవకాశం ఉన్నట్లుగా సమాచారం. పరిషత్తు ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే.. ఆ తరువాత సర్పంచ్ ఎన్నికలు, మునిసిపల్ ఎన్నికలు జరుగుతాయనే ప్రచారం జరుగుతోంది.

రిజర్వేషన్ల టెన్షన్

ఎంపీటీసీ, జడ్పీటీసీ, మునిసిపల్ చైర్మన్, సర్పంచ్‌గిరిపై పదేళ్లకు పైగా గురి పెట్టిన గ్రామస్థాయి నేతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ప్రభుత్వం కొత్తగారిజర్వేషన్లను అమలు చేస్తే.. తమ సీటుకు ఎక్కడ ఎసరు వస్తుందో అనే ఆందోళనలో కొందరు ఆశావహులు ఉన్నారు. కొత్త రిజర్వేషన్లతో తమకు అదృష్టం కలిసి వస్తుందనే ఆశతో ఉన్న నేతలు ఉన్నారు. ద్వితీయ శ్రేణి నేతల్లో ఎక్కువ మంది జడ్పీ చైర్మన్ సీటుపైనే దృష్టి పెడుతున్నారు. ఈ సీటు దక్కితే నియోజకవర్గాల పునర్విభజనలో పెరిగే అసెంబ్లీ సీట్లపై కర్చీఫ్ వేసే అవకాశం దక్కుతుందనే ఆశతో ఉన్నారు. కాగా, 2019లో వరంగల్ రూరల్ జడ్పీ పీఠం జనరల్ మహిళకు, వరగంల్ అర్బన్ (హనుమకొండ) ఎస్సీ జనరల్, ములుగు జనరల్, జనగామ జనరల్, భూపాలపల్లి ఎస్సీ మహిళ, మహబూబాబాద్ ఎస్టీ మహిళకు రిజర్వుడు అయ్యాయి. పాత రిజర్వేషన్లు అమలైతే ఆ వర్గాలకు చాన్స్ వస్తుందని, కొత్త రిజర్వేషన్లతో జడ్పీ చైర్మన్‌ల రిజర్వేషన్ కూడా మారి తమకు కలిసి వస్తుందనే ఆశగా ఎదరు చూసే వారు కూడా లేకపోలేదు. ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాల్లో కూడా రిజర్వేషన్ల మార్పు జరుగనుంది. మొత్తానికి స్థానిక ఎన్నికలకు అధికారయంత్రాంగం, ఆశావహులు సిద్ధంగా ఉండగా, ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను ఖరారు చేస్తే ఇక గ్రామాల్లో కురుక్షేత్రమే జరుగనుంది.

కొండా మురళికి భద్రత ఎందుకు?

- ఏసీపీ, సీఐలు ఎస్కార్ట్‌గా ఎందుకు వెళ్లారు?
- వరంగల్ డివిజన్ పోలీసులకు సీపీ మెమోలు

వరంగల్ క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుకి భద్రత కల్పించాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేవని, అలాంటప్పుడు ఆయన పర్యటనలో వరంగల్ డివిజన్ పోలీసులు ఎస్కార్ట్‌గా ఎందుకు వెళ్తున్నారో రెండురోజుల్లో సమాధానం ఇవ్వాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ మెమోలు జారీ చేశారు. భద్రతకు అనర్హుడైన కొండా మురళికి ఏసీపీ, సీఐలు, ఎస్సైలు ఎస్కార్ట్‌గా వెళ్లాల్సిన అవసరం ఏమి వచ్చిందని సీపీ ప్రశ్నించారు. వరంగల్ పోలీసుల చర్యల వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తద్వారా తమపై చర్యలు ఎందుకు తీసుకోవద్దు..? అనే అంశంపై రెండు రోజుల్లో వివరణ ఇవ్వకపోతే ఎస్కార్ట్ విధుల్లో ఉన్న పోలీస్ అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నట్లు సీపీ హెచ్చరించారు.

కాగా, వరంగల్ డివిజన్ పోలీసులకు ఇవేమి కొత్త కాదని, ఇప్పటికే పలు మెమోలు అందుకున్నారని, ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన పోలీసులు రాజకీయ నాయకులకు గులాంగిరి చేస్తూ తప్పుడు సందేశం ఇస్తున్నారని చర్చ జరుగుతోంది. అలాంటి అధికారులపై వేటు వేయడంతోనే దారిలోకి వచ్చి ప్రజలకు అందుబాటులో ఉంటారని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

దసరాకు సిద్ధం

శరవేగంగా భద్రకాళి మాడవీధుల నిర్మాణం

- గుడిచుట్టూరా మట్టి పరవడం పూర్తి
- త్వరలో రివిటింగ్ పని.. ఆ తర్వాత సీసీ రోడ్డు నిర్మాణం



మాడవీధుల నిర్మాణంలో భాగంగా భద్రకాళి గుడి చుట్టూరా పూర్తయిన మట్టి పని

హనుమకొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి ఆలయం మాడవీధుల నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మాడవీధుల నిర్మాణంలో భాగంగా ఆలయం చుట్టూరా మట్టి పరవడం పూర్తయింది. ఇక దీనిపై నుంచి సీసీ రోడ్డును వేయడమే తరువాయి. దసరా నాటికి మాడవీధుల నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నది లక్ష్యం. ఆ దిశగా కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతోంది. పనులను త్వరితగతిన చేస్తోంది.

సీసీ రోడ్డు

రివిటింగ్ పని పూర్తయిన తర్వాత వాహనసేవల్లో భాగంగా అమ్మవారి రథం తిరగడానికి వీలుగా మట్టిబాటపై సీసీ రోడ్డు వేస్తారు. సుమారు 200 అడుగుల వెడల్పుతో ఆలయం చుట్టూర విశాలమైన ఈ రోడ్డు నిర్మాణమవుతుంది. ఇదే అసలైన మాడవీధి మార్గం. ఆలయం ప్రధాన ద్వారం గుండా బయటికి వచ్చే వాహనం చెరువు వైపు భద్రమ్మ గుట్ట పక్క నుంచి త్వరలో నిర్మాణమయ్యే రాజగోపురం గుండా తిరిగి ప్రధాన ఆలయం లోకి ప్రవేశించేలా మాడవీధుల నిర్మాణం జరుగుతుంది. బ్రహ్మోత్సవాలు, శాకాంబరి ఉత్సవాలు, దసరా ఉత్సవాల సందర్భంగా తొమ్మిది రోజులు తొమ్మిది వాహనాపై నవవిధ రూపాల్లో అమ్మవారు ఊరేగుతారు. మాడ వీధులు లేకపోవడంవల్ల ప్రస్తుతం గర్భ గుడి చుట్టూ ఇరుకైన ప్రదక్షిణ మార్గంలో తిరగడంవల్ల కలుగుతున్న ఇబ్బందులు శాశ్వతంగా తొలగిపోతాయి. తిరుపతిలో మాదిరిగా మాడవీధుల గుండా వాహనంపై ఉత్సవ మూర్తి ఊరేగుతున్నప్పుడు ఏకకాలంలో వేలాది మంది తిలకించేందుకు అవకాశం కలుగుతుంది.

విశాలమైన ఆలయ ప్రాంగణం

మట్టిపోయడంతో భద్రకాళి ఆలయ ప్రాంగణం విశాలమైంది. స్థలం అంతకు ముందుకన్నా రెండింతలు పెరిగింది. భక్తులు భారీగా వచ్చినా ఎలాంటి రద్దీ లేకుండా అమ్మవారిని దర్శనం చేసుకునే అవకాశం ఏర్పడింది. అమ్మవారిని దర్శించుకునేందుకు ఇప్పటికే నిత్యం వేలాదిమంది భక్తులు వస్తున్నారు. పర్వదిన సందర్భాలు, ఉత్సవ సమయాల్లో మరింత అధిక సంఖ్యలో హాజరవుతుంటారు. దీనితో స్థలం సరిపోక ఇబ్బందులు కలుగుతున్నాయి. మాడవీధులతో ఆ సమస్య తొలగిపోతుంది. ఆలయం చుట్టూర నాలుగు రాజగోపురాలు, 5 అంతస్థులు పరిపాలనా భవనం, ఆలయాన్ని ఆనుకొని వేదపాఠశాల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు పూర్తయితే తెలంగాణలోకెల్లా అతిపెద్ద దేవాదాయల్లో మూడోదిగా భద్రకాళి గుడి నిలుస్తుందని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ అధికారులు చెబుతున్నారు.

3 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి

రూ.30కోట్ల వ్యయంతో భద్రకాళి ఆలయం చుట్టూరా మాడవీధులను నిర్మిస్తున్నది తెలిసిందే. ఇందులో రూ.20కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయగా మిగతా రూ.10కోట్ల కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ సమకూర్చింది. ఆలయం ఆనుకొని ఉన్న భద్రకాళి చెరువు పూడికతీత పనులు జరుగుతున్న సంగతి తెలిసిందే. చెరువు నుంచి తీసిన మట్టితోనే ఆలయం చుట్టూరా మాడవీధి ఏర్పాటు జరిగే మార్గంలో పూర్తిగా నింపేశారు. సుమారు 800 మీటర్ల పొడవైన ఈ మార్గంలో 3 లక్షల క్యూబిక్ మట్టిని మూడు మీటర్ల ఎత్తువరకు పోశారు. అనంతరం జేసీబీ సాయంతో చదును చేశారు. రోలర్లతో పటిష్ట పరిచారు. వర్షం వచ్చినప్పుడు మట్టి కుంగిపోకుండా ఉండేలా అడుగుభాగం నుంచి పొరలు పొరలుగా మట్టిపోయడం ద్వారా పటిష్టపరుస్తూ వచ్చారు. 2లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిన ఆలయం ఆనుకొని ఉన్న చెరువు వైపు, మరో లక్ష క్యూబిక్ మీటర్ల మట్టిని ఆలయం వెనుక భద్రమ్మగుట్ట వైపు పోశారు. ఇంతకు ముందు ఈప్రాంతం అంతా లోతట్టుగా ఉండేది. మట్టి పోయడంతో ఎత్తుపెరిగి ఆలయం చుట్టూరా ఉన్న పొంతమంతా సమంగా మారింది. మాడవీధి ఏర్పాటుకు మార్గం సుగమం అయింది.

త్వరలో రివిటింగ్ పనులు

మాడవీధుల కోసం పోసిన మట్టి జారిపోకుండా ఉండేందుకు త్వరలోనే రివిటింగ్ పనులు చేపట్టనున్నారు. వర్షాలు జోరందుకోక ముందే ఈ పనులు మొదలు పెట్టనున్నారు. భద్రకాళి చెరువువైపు మొదలు కొని భద్రమ్మగుట్ట లోతట్టున మట్టిపోసిన ప్రాంతం వరకు రివిటింగ్ చేస్తారు. భవిష్యత్తులో భారీ వర్షాలు కురిసి భద్రకాళి చెరువులోకి పెద్దఎత్తున వరదనీరు చేరినా మాడవీధులకు ఎలాంటి ఇబ్బంది కులగకుండా భారీ బండరాళ్ల, కాంక్రీటుతో రివిట్‌మెంట్ చేస్తారు. ప్రత్యేక సందర్భాల్లో ఉత్సవ మూర్తుల చక్రస్నానానికి భద్రకాళి చెరువులోకి దిగడానికి వీలుగా మధ్యమధ్యలో ఘాట్లను ఏర్పాటు చేస్తారు.

విహంగ వికాసం

- పక్షుల సంరక్షణ కేంద్రంగా భద్రకాళి చెరువు
- నవద్వీపాల్లో మొక్కలు నాటడం పూర్తి
- ద్వీపాల వద్ద సేదతీరేందుకు బోట్ సౌకర్యం
- పక్షుల కిలకిలలతో కళకళలాడనున్న చెరువు



భద్రకాళి చెరువు మధ్యలోని నవ ద్వీపాల్లో ఇటీవల కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ మొక్కలు నాటిన దృశ్యం

హనుమకొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి చెరువును అతిపెద్ద పక్షుల సంరక్షణ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చర్యలు చేపట్టింది. చెరువు మధ్యలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న తొమ్మిది నవ ద్వీపాల్లో (మట్టి ద్వీపాలు) సంస్థ మొక్కలు నాటడం ఇటీవలే పూర్తి చేసింది. చెరువులోకి నీరు చేరిన తర్వాత అక్కడ మొక్కలు నాటడం సాధ్యం కాదు. అందుకే ఒక పక్క చెరువులో పూడిక తీత పనులు జరుగుతుండగానే కుడా ఈ ద్వీపాల్లో వివిధ రకాల మొక్కలు నాటింది.

పక్షుల ఆవాస కేంద్రం

భద్రకాళి చెరువు సుందరీకరణలో భాగంగా 4నెలలుగా పూడికతీత పనులు జరుగుతున్నది తెలిసిందే. కుడాతో పాటు నీటిపారుదల శాఖ ఈ సుందరీకరణ పనులను సంయుక్తంగా చేపడతున్నాయి. ఇందులో భాగంగా చెరువులోని మట్టిని నీటిపారుదల శాఖ తొలగిస్తుండగా సుందరీకరణ పనులను కూడా పర్యవేక్షిస్తోంది. భద్రకాళి చెరువు సుందరీకరణలో భాగంగా ఈ చెరువును పక్షుల ఆవాస కేంద్రంగా చేయాలనే నిర్ణయం తీసుకున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెరువు మధ్యలో పెద్దఎత్తున చెట్లను పెంచినట్లయితే అక్కడ వివిధ రాకల పక్షులు ఆవాసం ఏర్పరుచుకునే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని చెరువులో పూడిక తీస్తున్నప్పుడే ఈ చెరువు మధ్యలో ఇదివరకే సహజసిద్ధంగా ఉన్న పెద్ద మట్టిదిబ్బ (ద్వీపం)తో పాటు పూడిక తీయగా వచ్చిన మట్టితోనే చెరువు మధ్యలో మరో ఎనిమిది దిబ్బలను నిర్మించింది. ఈ మొత్తం తొమ్మిది దిబ్బలకు నవద్వీపాలు అని పేరుపెట్టింది. ఈ ద్వీపాల్లో వివిధ రకాల మొక్కలను నాటింది. ఇవి పెరిగి పెద్దవైతే స్థానికంగానే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి, ఇతర దేశాల నుంచి సైతం పక్షులు పెద్ద ఎత్తున వలస వచ్చి ఇక్కడ ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటాయని భావిస్తున్నారు. చెరువు చుట్టూ కొండలు, చెరువును ఆనుకొని పచ్చిక బయళ్ళు, ప్రశాంతమైన వాతావరణం, ఎల్లకాలం చెరువులో నిండుగా ఉండే నీళ్లు, ఈ నీళ్లలో పెరిగే చేపలు ఇవన్నీ ఇక్కడ పక్షులు పెద్ద ఎత్తున ఆవాసం ఉండేందుకు అవకాశం ఉందని పర్యావరణ వేత్తలు అభిప్రాయపడుతున్నారు. దీంతో భద్రకాళి చెరువు రాష్ట్రంలోనే అతిపెద్ద పక్షుల సంరక్షణ కేంద్రంగా అభివృద్ధి చెందగలదని భావిస్తున్నారు. దట్టంగా పెరిగిన చెట్లు, వాటిపై రకరకాల పక్షలతో కళకళలాడే ఈ ద్వీపాలను పర్యాటకులు, ముఖ్యంగా పర్యావరణ ప్రేమికులు సందర్శించేందుకు వీలుగా చెరువులో నీటిని నింపిన తర్వాత బోటింగ్ సౌకర్యం కల్పించే ఆలోచనలో కూడా ఉంది.

వర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాల వేళాయే..

- నేటి నుంచి దరఖాస్తులు.. జూలై 17 వరకు తుది గడువు..
- రాష్ట్ర వ్యాప్తంగా 8 వర్సిటీల్లో ప్రవేశాలకు దరఖాస్తులు



కేయూ క్యాంపస్ జూన్ 17, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రఖ్యాత 8 వర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదలైంది. కామన్ పోస్టు గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్-2025 (టీజీ పీసీజీఈటీ-2025)గా పిలుస్తారు. 2025-26 ఏడాదికి గాను అడ్మిషన్ల కోసం ప్రవేశాల పరీక్షలు నిర్వహిస్తారు. 18 నుంచి వచ్చే నెల జూలై 17 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులను స్వీకరిస్తారు. డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులందరూ తమకు ఇష్టమైన సబ్జెక్టుల్లో పీజీ కోర్సులను అభ్యసించవచ్చు. ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంజీజే, ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సులలతో పాటు ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులు ఎంఏ, ఎంఎస్సీ, ఎంబీఏ కోర్సుల్లోనూ అడ్మిషన్లు కల్పిస్తారు.

8 వర్సిటీలకు ఒకే ఒక్క దరఖాస్తు

రాష్ట్రవ్యాప్తంగా పేరొందిన హైదరాబాద్‌లోని ఉస్మానియా, వరంగల్ కాకతీయ వర్సిటీ, నిజామాబాద్ తెలంగాణ వర్సిటీ, నల్లగొండలోని మహాత్మాగాంధీ వర్సిటీ, మహబూబ్‌నగర్‌లోని పాలమూరు వర్సిటీ, కరీంనగర్‌లోని శాతవాహన వర్సిటీ, హైదరాబాద్‌లోని వీరనారి చాకలి అయిలమ్మ మహిళ వర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీలకు కామన్ ఎంట్రెన్స్ టెస్టు నిర్వహిస్తారు. రాష్ట్రంలోని అన్ని ప్రధాన వర్సిటీల్లో పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పించేందుకు ఉస్మానియా వర్సిటీయే ప్రవేశాల పరీక్షలను నిర్వహిస్తోంది. గతంలో ఏ వర్సిటీకి ఆ వర్సిటీ ప్రవేశాల పరీక్షలను నిర్వహించగా, కొన్నేళ్లుగా ఉస్మానియా వర్సిటీ ప్రవేశాల పరీక్షలు నిర్వహించి మెరిట్ ఆధారంగా పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు.

అందించే కోర్సులివే..

పీజీ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా ఎంఏ తెలుగు, ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, అరబీ, ఇస్లామిక్ స్టడీస్, ఉర్దూ, రాజనీతిశాస్త్రం, ఎకానమిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ, సోషియాలజీ, ఎంఎల్ఐఎస్సీ, ఎంకామ్, ఎంఎస్సీ కెమిస్ట్రీ, ఫిజిక్స్, బాటనీ, జువాలజీ, మైక్రోబయోలజీ, బయో కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, ఎంఈడీతో పాటు ఇతర పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తారు. వీటితో పాటు ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులైన ఎంఎస్సీ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, ఎంబీఏతో పాటు ఇతర కోర్సులున్నాయి.

కంప్యూటర్ పరీక్షలు

పీజీ ఎంట్రెన్స్ పరీక్షలకు దరఖాస్తులు స్వీకరించిన తర్వాత అర్హులందరికీ కంప్యూటర్ బేస్డ్ పరీక్షలను (సీబీటీ) నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రముఖ పట్టణాల్లో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. పరీక్షల 100 మార్కులకు గాను నిర్వహిస్తారు. ఎంపిక చేసుకున్న సబ్జెక్టుల్లో డిగ్రీ సిలబస్ ఆధారంగా ప్రశ్నాలిస్తారు. మెరిట్ కం రిజర్వేషన్ ఆధారంగా క్యాంపస్‌తో పాటు ఇతర అనుబంధ, ప్రైవేట్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

జూలై 28వరకు రూ.2వేల అపరాధ రుసుంలో గడువు

జూలై 28వ తేదీ వరకు రూ.2వేల అపరాధ రుసుము చెల్లించుకుని దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించారు. రూ.500 అపరాధ రుసుముతో జూన్ 24 వరకు గడువు విధించారు.

దరఖాస్తులకు వెబ్‌సైట్ లింక్‌లు ఇవే...

https://www.osmania.ac.in/,cpget.tsche.ac.in 2025లలో దరఖాస్తులు సమర్పించాలి. నిర్ణీత ఫీజులను చెల్లించాలి. హాల్ టికెట్‌ను వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరుకావాలి. కోర్సులు, ఫీజులు, హాస్టల్ వసతితో పాటు సమగ్ర వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

కుంగుతున్న బాల్యం

- అధిక పుస్తకాల బరువుతో విద్యార్థుల ఇక్కట్లు
- ఏటా పెరుగుతున్న పుస్తకాలు మోత
- చిన్న వయస్సులో వెన్నెముకపై భారంతో పొంచి ఉన్న వ్యాధులు
- అమలు కాని విద్యాహక్కు చట్టం నిబంధనలు
- అవగాహన కల్పించని అధికారులు



వర్ధన్నపేట రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బాల్యాన్ని పుస్తకాల బరువు కుంగదీస్తోంది. కిలోల కొద్దీ బరువును మోయాల్సి రావడంతో వెన్నుపూస వంగిపోతోంది. ప్రైవేటు పాఠశాలల పుణ్యమా అని ఒకటి రెండు తరగతుల విద్యార్థులే 30 నుంచి 45 కిలోల పుస్తకాలను మోస్తున్నారు. వాస్తవానికి విద్యార్థి బరువులో 10శాతం మాత్రమే పుస్తకాల బరువు ఉండాలని విద్యాహక్కు చట్టం చెబుతోంది. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు అసలు పుస్తకాలు ఉండొద్దని పేర్కొంటోంది. కానీ ఈ నిబంధనలేవి అమలవడం లేదు. పుస్తకాలు స్కూళ్లలో ఉంచుకునేలా లాకర్ల సదుపాయం ఏర్పాటు చేయాలని ఉన్న పట్టించుకోవడం లేదు. మరోవైపు మారిన ఫ్యాషన్ పోకడలను అనుసరించి విద్యార్థులు నడుం కిందకు బ్యాగు వేలాడేలా వేసుకుంటున్నారు. ఇలా వేసుకోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రేపటి నుంచి విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు సిద్దం అవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని, అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమ లాభాపేక్ష కోసం ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నాయి. పలు పబ్లికేషన్స్ రూపొందించిన పుస్తకాలు కొనుగోలు చేసేలా విద్యార్థుల తల్లిదండ్రులకు సూచిస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలల పేరిట ముద్రణ చేసిన నోట్ బుక్కులు, పాఠ్య పుస్తకాలనే వాడాలిన హుకుం జారీ చేసి అమ్ముతున్నారు. ఎల్‌కేజీ చదువుకునే విద్యార్థిని 6 నుంచి 10 పాఠ్యపుస్తకాలు, హోమ్ వర్క్ కోసం నోటు పుస్తకాలు తీసుకోమని చెబుతున్నాయి. తల్లిదండ్రులు వాటిని బ్యాగుల్లో ఉంచి పిల్లలను బడికి పంపుతున్నారు. వీటికి లంచ్ బాక్స్, వాటర్ బాటిల్ తోడు కావడంతో 4 నుంచి 6 కిలోల బరువు అవుతుంది. ఇలా తరగతి పెరిగే కొద్ది బరువు పెరుగుతోంది. ఈ మోత భారంతో పిల్లలు చిన్నతనం నుంచే వృద్ధాప్యం బారిన పడుతున్నారు.

ఈసారైనా అవగాహన కల్పించేనా...

విద్యాహక్కు చట్టంపై క్షేత్రస్థాయిలో అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా పని చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం అదేస్థాయిలో విద్యా హక్కు చట్టం ప్రైవేటు పాఠశాలల్లో అమలవుతుందా..? లేదాచూసుకోవడంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు మాజమాన్యాలను ప్రశ్నించేలా చట్టంపై అవగాహన తేవాలి. ఆయా మండలాల్లోని ఎంఈవోలతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేయడంతోపాటు కళాజాత మాదిరిగా, ప్రభుత్వ పాఠశాలల పనితీరును వివరించేటప్పుడు, విద్యాహక్కుపై గల సామాన్య ప్రజల హక్కును గుర్తు చేయాల్సి బాధ్యత ఎంతైనా ఉంది.

అధిక భారం వెన్నుపూస పైనే..

నిటారుగా నిలబడాలంటే వెన్నుపూస ప్రధాన ఆధారం. పుస్తకాల బ్యాగును వీపుపై వేసుకోవడం వల్ల వెన్నముకపై భారం పడుతుంది. దీంతో అది దెబ్బతినే ప్రమాదం ఉంది. 15 ఏళ్ల పిల్లల శరీరంలో వివిధ రకాల మార్పులు సంభవిస్తాయి. ఈ వయస్సులో వెన్నముకపై సామర్థ్యానికి మించి భారం వేయడం వల్ల అనేక సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వెన్నముక, మెడ, నొప్పులు, వచ్చే ప్రమాదం ఉందని చెబుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అంటున్నారు.

అవసరం లేని పుస్తకాలే ఎక్కువ

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరు సబ్జెక్టులకు సంబంధించిన ఆరు పుస్తకాలు, నోటు పుస్తకాలు ఉంటాయి. కానీ, ప్రైవేట్ పాఠశాలల్లో మాత్రం అందుకు విరుద్ధంగా తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని మోపేందుకు ఒకటి, రెండు తరగతులు చదివే విద్యార్థులకు 10 నుంచి 12 పుస్తకాలు, ఒక్కో సబ్జెక్టుకు తరగతి వర్క్ బుక్, హోం వర్క్, ప్రాజెక్టు పని ఇలా మూడేసి పుస్తకాలు కొనుక్కోవాలని చెబుతున్నారు. పుస్తకాలు నోట్ బుక్కులు మొత్తం 30 నుంచి 45 అవుతుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అవసరం లేని పస్తకాలను పక్కకు పెట్టి అవసరం ఉన్న వాటిని వాడుకుంటే మంచిదని నిపుణులు చెపుతున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి...

- పాఠశాలకు వెళ్లే విద్యార్థులు మందం ఎక్కువ ఉన్న పుస్తకాలు వీపునకు ఆనుకునేలా సర్దుకోవాలి. తర్వాత తక్కువ మందం ఉన్న పుస్తకాలను అమర్చుకోవడం వల్ల వెన్నుపూసపై బరువు ఎక్కువగా పడే ప్రమాదం ఉండదు.
- విద్యార్థులు బ్యాగును ఒక భుజానికి కాకుండా రెండు భుజాలకు తగిలించాలి.
- విద్యార్థులు పాఠ్యపుస్తకాలు పెట్టుకునేలా పాఠశాలల్లో లాకర్ల సదుపాయాన్ని కల్పించాలి. హోంవర్క్, నోట్‌బుక్స్ మాత్రమే ఇంటికి తీసుకెళ్లాలి.
- విద్యార్థుల బరువుల్లో పదో వంతు మాత్రమే పుస్తకాల బరువు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- విద్యార్థులు ఎప్పుడు చదువుకోవడం రాసుకోవడమే కాకుండా రోజుకు కనీసం గటన్నర పాటు ఆటలు ఆడితే ఆరోగ్యంగా ఉంటారు.

విద్యాహక్కు చట్టం ఏం చెబుతోంది..

- నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు అసలు స్కూల్ బ్యాగులే మోయకూడదు.
- ఆ పై తరగతి విద్యార్థులు శరీర బరువు కంటే 10 శాతం మించి మోయకూడదు.
- విద్యార్థి పాఠశాలకు రోజు తెచ్చేకోవాల్సిన పుస్తకాలు శాస్త్రీయ అంచనాలతో విద్యార్థుల తల్లిదండ్రులకు మార్గదర్శకాలు ఇవ్వాలి.
- ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలను దాచుకునేందుకు తరగతి గదిలో ప్రత్యేక ఏర్పాటు చేయాలి.
- ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రతీ విద్యార్థికి లాకర్లు, డెస్కులు ఏర్పాటు చేయాలి.
- ప్రైవేటు బడుల యాజమాన్యాలు విద్యార్థులకు సరిపడా ఏర్పాటు చేయకుంటే నిబంధనల ప్రకారం పాఠశాలలపై చట్టపరంగా చర్యలు తీసుకునే హక్కు విద్యాశాఖకు ఉంది. పాఠశాల గుర్తింపుతో పాటు రూ.3 లక్షల జరిమానా విధించవచ్చు.

అమలుకు నోచుకోని చట్టాలు

ప్రైవేట్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పాఠ్యపుస్తకాల బరువు తగ్గించాలని ప్రభుత్వం 2006లోనే చట్టాన్ని తీసుకొచ్చింది. కానీ, అది అమలుకు నోచుకోవడం లేదు. విద్యార్థి శరీర బరువులో కేవలం 10 శాతం మాత్రమే పాఠ్యపుస్తకాలు ఉండేలా ఆ చట్టం చెబుతోంది. విద్యార్థి సుమారు 14 కిలోలు ఉన్నాడనుకుంటే ఆ విద్యార్థి తీసుకెళ్లే బ్యాగు మాత్రం 4 కిలోలు ఉంటుంది. దాన్ని మోసేందుకు విద్యార్థి అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి. ప్రైవేటు పాఠశాలలు నాలుగైదు అంతస్థులో ఇరుకిరుకు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. దాంతో విద్యార్థులు పుస్తకాల బ్యాగులు అన్ని అంతస్థులు ఎక్కాల్సిన పరిస్థితి.

కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు తీపి కబురు

- నియామకాలపై తొలగిన ఉత్కంఠ
- కేయూ పాలకమండలి సమావేశంలో నిర్ణయాలు

కేయూ క్యాంపస్ జూన్ 17, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో 2010 బ్యాచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు తీపి కబురు వచ్చింది. సుదీర్ఘకాలంగా తీవ్ర వివాదాల్లో చిక్కుకున్న 27 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల ఎపిసోడ్‌కు ఎట్టకేలకు ముగింపు లభించింది. చివరకు సుప్రీంతీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో నియామకాలపై ఉత్కంఠవిడి లైన్ క్లియరైంది. మంగళవారం కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సమావేశంలో హైదరాబాద్ సెక్రటేరియట్‌లో జరిగింది. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్య ప్రిన్సిపాల్ సెక్రటరీ యోగితారాణా, కాలేజీయేట్ కమిషనర్ శ్రీదేవసేనా, కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, కేయూ పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ కరుకాల అనితారెడ్డి, డాక్టర్ బొద్దిరెడ్డి రమారెడ్డి, డాక్టర్ మల్లం నవీన్, డాక్టర్ సుకుమారి, డాక్టర్ చిర్రా రాజుగౌడ్ పుల్లూరి సుధాకర్, బి.బాలు చౌహన్‌లు హాజరయ్యారు. 2010లో కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో నియమితులైన రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలపై వివాదం నెలకొంది. నియామకాల్లో నిబంధనలు పాటించలేదని, అర్హులైన తమకు నియామకాల్లో అన్యాయం జరిగిందని పోస్టులను ఆశించిన పలువురు ఆశావహులు కోర్టు మెట్లెక్కారు. దీంతో హైకోర్టు నుంచి సుప్రీం కోర్టు వరకు కేసు నడిచింది. చివరకు సుప్రీం ఆదేశాలతో వర్సిటీకి రెగ్యులర్ పాలక మండలిని నియమించి 2010 అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలపై తుది నిర్ణయం తీసుకోవాలని కోర్టు సూచించింది. చివరకు గతంలో ఉన్న పాలకమండలి 2010 నియామకాలపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. పాలక మండలి తీసుకున్న నిర్ణయం మేరకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ 2010 అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు ఒకే చెప్పారు. అయా జీవోను మంగళవారం వర్సిటీ పాలక మండలి ఆమోదించడంతో 2010 బ్యాచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల జీవితాల్లో కొత్త వెలుగులు వచ్చాయి.

అదనపు ఖర్చులకు ఒకే..

కాకతీయ యూనివర్సిటీలో వచ్చే నెల 7న నిర్వహించే స్నాతకోత్సవంలో బంగారు పతకాలకు అదనపు ఖర్చు అవుతున్న దృష్ట్యా పాలక మండలి చర్చించింది. బంగారం ధరలు విపరీతంగా పెరగడంతో వర్సిటీలో విద్యార్థులకు ఇచ్చే బంగారపు పూతకు అదనపు ఖర్చు అవుతుందని వర్సిటీ పాలక మండలి ఫైనాన్స్ కమిటీ చర్చించింది. విద్యార్థులకు ఇచ్చే పతకాలకు బంగారం పూత వేస్తారు. అయితే ఎంత ఖర్చు అయినా వర్సిటీ భరించి విద్యార్థులకు గతంలోగా బంగారు పతకాలు ఇవ్వాల్సిందేనని పాలక మండలి ఆమోదం తెలిసింది.

లేడీస్ హాస్టల్.. డైనింగ్ హాల్‌కు పచ్చజెండా..

కాకతీయ యూనివర్సిటీలో మహిళ విద్యార్థులకు అదనపు హాస్టల్‌తో పాటు డైనింగ్ హాల్‌కు పాలక మండలి పచ్చజెండా ఊపింది. అయితే వర్సిటీ అధికారులు పూర్తి ఖర్చుతో కూడిన సమాచారం ఇవ్వకపోవడంతో నిధులు ఇస్తాం, పూర్తి వివరాలు సమర్పించాలని పాలక మండలి వర్సిటీ అధికారులకు సూచించింది. వర్సిటీలో కొత్త హాస్టల్ భవనంతో మహిళ విద్యార్థుల వసతి కష్టాలు కొంత మేరకు తప్పనున్నాయి.

ఇకా పీహెచ్‌డీ అడ్మిషన్లు బంద్

ఇటీవల వర్సిటీలో కొందరు విద్యార్థులు తమకు పీహెచ్‌డీ అడ్మిషన్లు కావాలని నిరసన ఆందోళనలకు దిగుతున్న నేపథ్యంలో వర్సిటీ పాలక మండలి కొత్తగా ఇచ్చేందుకు పీహెచ్‌డీ అడ్మిషన్లపై చర్చించింది. ఇక వర్సిటీలో నూతనంగా పీహెచ్‌డీ అడ్మిషన్లను నిబంధనలకు విరుద్ధంగా ఇవ్వద్దని స్పష్టమైన నిర్ణయం తీసుకున్నారు.

వర్సిటీ గౌరవ డాక్టరేట్‌లు లేవు..

జూలై 7న జరిగే కేయూ 23వ స్నాతకోత్సవ నేపథ్యంలో గౌరవ డాక్టరేట్‌లు ఇచ్చే ప్రతిపాదనలు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు వర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించేందుకు చాలా సమయం పడుతోందని, ఇప్పటికప్పుడు గౌరవ డాక్టరేట్‌లు ఇవ్వడం కుదరదని పాలక మండలి గౌరవ డాక్టరేట్ విషయాన్ని ప్రక్కన పెట్టింది.

విభాగాలకు అదనపు కంప్యూటర్లకు ఒకే..

వర్సిటీలో వివిధ విభాగాల్లో అదనపు కంప్యూటర్లను అవసరం ఉన్న నేపథ్యంలో పాలక మండలి నూతనంగా కంప్యూటర్లను కొనుగోలు చేసేందుకు అమోదించింది.

కేయూలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు వర్సిటీ క్యాంపస్ భూమిని వినియోగించుకునేందుకు పాలక మండలి ఆమోదం తెలిపింది.సుమారు రూ.200కోట్ల నిధులతో వరంగల్ పశ్చిమ నియోజక వర్గంలో ఏర్పాటు చేయనున్నారు. దీనిలో వర్సిటీ ఉద్యోగుల పిల్లలకు అడ్మిషన్ల కల్పించే వీలుంది. వీసీ పదవి రిత్యా స్కూల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులు కానున్నారు. అలాగే కేయూ ఇంజనీరింగ్ కళాశాలకు 3 వర్క్‌షాప్‌లు నిర్మించుకునేందుకు ఆమోదం తెలిపారు. హాస్టల్ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుడిన ఏఆర్ కృష్ణయ్య అంశాన్ని రాష్ట్ర అవినీతి నిరోదక శాఖ అధికారులకు లేఖ రాయాలని నిర్ణయించారు. గత వీసీ తాటికొండ రమేశ్ హయాంలో కొనుగోలు చేసిన 100 కంప్యూటర్ల అవకతవకలపై విచారణను పునఃపరిశీలించాలని, రాష్ట్ర విజిలెన్స్ విభాగానికి కేసును అప్పగించాలని నిర్ణయించారు. వర్సిటీలోని ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పెన్సింగ్, లేడీస్ హాస్టల్ వద్ద ప్రహరీ నిర్మాణాలకు ఒకే చెప్పారు. తాజా కాన్వకేషన్ తో పాటు భవిష్యత్ అవసరాల దృష్ట్యా కేయూ పరీక్షల విభాగంలో ఆడియో, వీడియో పరికరాలను కొనుగోలు చేయనున్నారు.



పాలక మండలి సమావేశంలో పాల్గొన్న యోగితారాణా, ప్రతాప్‌రెడ్డి, వల్లూరి రామచంద్రం తదితరులు

మడికొండలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

మడికొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కాజీపేట మండలం మడికొండ గ్రామంలోని 64వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు యాదవ్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుర్ల మోహన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు దువ్వ చిన్న కుమార్, అంకూస్ రాజ్‌కుమార్, దువ్వ విజయ్‌కుమార్, గోపనబోయిన దిలీప్, హౌసింగ్ ఏఈ రాజేశ్వరి , వార్డు ఆఫీసర్ మమత, కాంగ్రెస్ శ్రేణులు జిట్టా చంటి, మూల మురళి, రసజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు అభినందనల వెల్లువ

మడికొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్‌పాయ్‌ని 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి అభినందించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మునిసిపల్ కార్పొరేషన్ సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.



కమిషనర్‌ను అభినందిస్తున్న మేయర్ గుండు సుధారాణి

నగర ప్రజలకు మెరుగైన సేవలందించాలి

మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బల్దియా ద్వారా నగర ప్రజలకు మెరుగైన సేవలందించాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాలులో కమిషనర్ చహత్‌బాజ్‌పాయ్‌తో కలిసి అన్ని విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, ఎలక్ట్రికల్, హార్టికల్చర్, డీఆర్‌ఎఫ్ కార్యక్రలాపాలపై సమీక్షించారు. అనంతరం సఫాయి మిత్ర కార్మికుల ఆరోగ్య రక్షణలో భాగంగా నమస్తే కార్యక్రమం క్రింద 37 మందికి సఫాయి మిత్ర కార్మికులకు, సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్లుకు పీపీఈ కిట్లను మేయర్ సుధారాణి కమిషనర్‌తో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవిందర్‌రాడేకర్, ఇన్‌చార్జి ఎస్‌ఈ శ్రీనివాస్, సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, అకౌంట్స్ అఫీసర్ శివలింగం, హార్టికల్చర్ అధికారులు రమేష్, లక్ష్మారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌ని కలిసిన కార్పొరేటర్లు

హనుమకొండ చౌరస్తా, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన చహత్ బాజ్‌పాయిని జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లుతో పాటు పలువురు కార్పొరేటర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హనుమకొండ జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో తోట వెంకటేశ్వర్లు తోపాటు కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, జక్కుల రవీందర్‌యాదవ్, రజాలీ, కాంగ్రెస్ నాయకులు దేవరకొండ సురేందర్, చీకటి ఆనంద్, నెక్కొండ కిషన్, శోభనబోయిన కుమార్‌లు కమిషనర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధానకార్యదర్శి మర్రి మహేష్ అన్నారు. మంగళవారం మర్కజీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొని ఉన్న సమస్యలపై సర్వే నిర్వహించామని, అందులో అనేక సమస్యలను గుర్తించి వాటి నివేదకను ముఖ్యమంత్రికి పంపిస్తున్నామన్నారు. ప్రభుత్వం సత్వరమే గుర్తించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంశీ, రూపేష్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అందజేత

వరంగల్ క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పీఎస్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి మంగళవారం ఐదుగురి బాధితులకు ఫోన్‌లను అందజేసినట్లు సీఐ శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సెల్‌ఫోన్‌లను కనిపెట్టడంలో నిరంతరం శ్రమిస్తున్న హోంగార్డు పుప్పాల అశోక్‌ను సీఐ అభినందించారు.

మోషన్ విద్యార్థి స్టేట్ ఫస్ట్ ర్యాంకు



హరిహరిణి

రాంనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ ఫస్టియర్ ఫలితాల్లో బైపీసీ విభాగంలో నయీంనగర్ మోషన్ కళాశాలకు చెందిన ఒల్లోజి హరి హరిణి 438 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించినట్లు కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. విద్యార్థితో పాటు కళాశాల అధ్యాపక బృందాన్ని, తల్లితండ్రులను వేణుగోపాల్‌గౌడ్ అభినందించారు.

ఘనంగా పార్వతి నాగరాజ రాజేశ్వర స్వామి కల్యాణోత్సవం

వడ్డెపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ వడ్డెపల్లి టీఎన్జీవోస్ కాలనీలోని శ్రీనాగరాజ రాజేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం నాగరాజ రాజేశ్వర స్వామికి సహస్ర కలశాభిషేకాన్ని భక్తులు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు గౌడపర్తి జీవన్‌శర్మ పర్యవేక్షణలో పార్వతి నాగరాజ రాజేశ్వర స్వామి దివ్య కల్యాణోత్సవాన్ని అర్చకులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కుందూరు అనిల్‌రెడ్డి , కార్యదర్శి ఇ.కొండల్‌రావు, కోశాధికారి పి. విద్యాసాగర్, ఉపాధ్యక్షులు ఎన్. సురేందర్, సభ్యులు వరప్రసాద్, సదానందరావు, పబ్బ రవీందర్, కక్కెర్ల రమేష్ వీర రమేష్, సారయ్య, సురేందర్‌శర్మతో పాటు భక్తులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలుశిక్ష

వరంగల్ క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 26 మందిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ చారి ఇద్దరికి జైలు శిక్ష విధించి, 24 మందికి రూ.26,800 జరిమానా విధించారని హనుమకొండ ట్రాఫిక్ సీఐ జి.సీతారెడ్డి తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని నలుగురి రూ.3,400జరిమానా విధించారన్నారు.

చరిత్ర, టూరిజం కోర్సులను ప్రవేశపెట్టాలి

కేయూ క్యాంపస్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్డులోని జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో ఈ ఏడాది నుంచి చరిత్ర, టూరిజం కోర్సులను ప్రవేశపెట్టాలని చరిత్ర పరిరక్షణ సమితి నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం జానపద గిరిజన విజ్ఞాన పీఠం అధిపతి ప్రొఫెసర్ గడ్డం వెంకన్నను కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా చరిత్ర పరిరక్షణ సమితి కేయూ కన్వీనర్ డాక్టర్ బి.రమేశ్ నాయక్ మాట్లాడారు. చరిత్ర, టూరిజం విభాగాన్ని ప్రవేశపెట్టాలని కోరగా స్పందించిన పీఠాధిపతి గడ్డం వెంకన్న రిజిస్ట్రార్ దృష్టికి తీసుకువెళ్లి కోర్సును ప్రవేశపెట్టేందుకు తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చరిత్ర పరిరక్షణ సమితి నేతలు డాక్టర్ బి.రమేశ్‌నాయక్, మాలోతు వెంకన్ననాయక్, భూక్య రమేశ్, బానోతు సాయికృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రవికుమార్, డాక్టర్ బి.సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



గడ్డం వెంకన్నకు వినతి పత్రాన్ని ఇస్తున్న చరిత్ర పరిరక్షణ సమితి నేతలు

శానిటేషన్ నిర్వహణలో అలసత్వం వద్దు

బల్దియా కమిషనర్ చహత్ బాజ్‌పాయ్



25, 26 డివిజన్‌లలో శానిటేషన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): శానిటేషన్ నిర్వహణలో అలసత్వాన్ని వీడాలని బల్దియా కమిషనర్ చహత్‌బాజ్ పాయ్ సూచించారు. మంగళవారం వరంగల్ నగర పరిధిలోని 25, 26 డివిజన్‌లలో చార్‌బౌలి ప్రాంతంలో కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి శానిటేషన్ నిర్వహణను పరిశీలించారు. సిబ్బంది అటెండెన్స్ రిజిస్టార్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. జవాన్‌లు, సిబ్బంది మాన్యువల్‌గా సంతకాలు చేయడంతో పాటు బయోమెట్రిక్ హాజరు కూడా ప్రతీరోజు ఉదయం, మధ్యాహ్నం విధులకు హాజరై వెళ్లేటప్పుడు నమోదు చేయాలని సూచించారు. అటెండెన్స్ నమోదులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. బయోమెట్రిక్ అటెండెన్స్ ఆధారంగానే వేతనాలు చెల్లింపులు జరుగుతాయన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఎల్లమ్మ గుడి వద్ద గల చౌరస్తా నుంచి చార్‌బౌలి వాటర్‌ట్యాంక్ వరకు నిర్వహించిన ర్యాలీలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో కలియ తిరిగిన కమిషనర్ స్థానికులతో మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా రక్షిత చర్యలు తీసుకోవడంతో పాటు కార్పొరేషన్ సిబ్బందికి సహకరించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరుగా అందజేయాలని అవగాహన కల్పించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని అందజేసి ఇందుకు సంబంధించిన స్టిక్కర్‌లను గృహాలకు అతికించి స్వచ్ఛ ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. చార్‌బౌలి వాటర్ ట్యాంక్ ఆవరణలో నిర్వహిస్తున్న డీఆర్‌సీసీ సెంటర్‌తో పాటు నర్సరీని పరిశీలించి నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్న బయోగ్యాస్ ప్లాంట్‌ను సందర్శించి నిర్వహణ తీరును ప్రశంసించారు. ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు మరింత బలోపేతం చేస్తూ మరో ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో, ఇన్‌చార్జి ఎస్‌ఈ డాక్టర్ రాజారెడ్డి, సీపీలు శ్రీనివాస్, రవిందర్, రాడేకర్, వెటర్నరీ డాక్టర్ గోపాల్‌రావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, ఏసీపీ ఖలీల్, శానిటరీ సూపర్‌వైజర్ భాస్కర్, ఏఈలు మొజామిల్ హబీబ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ శివకుమార్

ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసుకోవాలి

వరంగల్ క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బస్టాండ్ ఆవరణంలోని ఆటో అడ్డా డ్రైవర్లు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూసుకోవాలని హనుమకొండ సీఐ శివకుమార్ సూచించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఆటో డ్రైవర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. బస్టాండ్ ఏరియాలో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా అడ్డాపై ఉండే డ్రైవర్లు ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ పోలీసులకు సహకరించాలని సూచించారు.

పెట్టుబడి సాయం రూ.84కోట్లు

- 1.17 లక్షల మంది రైతు ఖాతాల్లో జమ
- రెండు ఎకరాల లోపువారికి సాయం
- తొమ్మిది రోజుల్లో మిగతా రైతులకు విడుదల

హనుమకొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకం (రైతు భరోసా) కింద వానాకాలం-2025 పంట కాలానికి గాను జిల్లాకు నిధులు విడులయ్యాయి. ప్రతీ రైతు ప్రారంభ పెట్టుబడి అవసరాలను తీర్చడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రైతువేదికలకు హాజరైన రైతులను ఉద్దేశించి మాట్లాడిన అనంతరం ఎకరానికి రూ.6వేల చొప్పున పెంచిన మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారు. మొదటి విడతగా రెండు ఎకరాల లోపు రైతులకు ఈ పెట్టుబడి సాయం అందింది. జిల్లాలో మొత్తం 1,17,028 మంది రైతు ఖాతాల్లో రూ. 84,01,14,516 జమ అయ్యాయి. ఇలా వరుసగా తొమ్మిది రోజుల పాటు మిగతా మూడు, నాలుగు ఎకరాల్లోపు రైతులకు సాయం అందుతుంది.

మండలాలవారీగా..

భీమదేవరపల్లి మండలంలో 8557 మంది రైతులకు రూ.6,96,17,582. ధర్మసాగర్ మండలంలో 9593 మంది రైతులకు రూ.7,32,23,824. ఎల్కతుర్తి మండలంలో 9698 మంది రైతులకు రూ. 7,05,82,455. హనుమకొండ మండలంలో 1153 మంది రైతులకు రూ. 56,68,099. హసన్‌పర్తి మండలంలోని 11992 మంది రైతులకు రూ. 7,68,00,157. ఐనవోలు మండలంలోని 10476 మంది రైతులకు రూ. 7,71,95,424, కమలాపూర్ మండలంలో 13485 మంది రైతులకు రూ. 9,59,72,715, ఖాజీపేట మండలంలో 4971 మంది రైతులకు రూ. 2,78,36,657, వేలేరు మండలంలోని 6452 మంది రైతులకు రూ. 5,33,30,308, ఆత్మకూరు మండలంలోని 9101 మంది రైతులకు రూ. 6,13,12,041, దామెర మండలంలోని 6488 మంది రైతులకు రూ. 4,85,01,619, నడికుడ మండలంలోని 9020 మంది రైతులకు రూ. 6,78,40,221, పరకాల మండలంలోని 6387 మంది రైతులకు రూ.4,47,06,890, శాయంపేట మండలంలోని 9655 మంది రైతులకు రూ.6,75,26,524 జమ అయ్యాయి. తొలకరి ప్రారంభమై దుక్కులు దున్నడం కూడా పూర్తయిన నేపథ్యంలో పెట్టుబడి సాయం ఎప్పుడు అందుతుందా అని ఆతృతగా ఎదురుచూస్తున్న అన్నదాతలకు తమ ఖాతాల్లో డబ్బులు జమకావడంతో హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

కేయూ బీసీ అధ్యాపకుల సమస్యలపై సమష్టి పోరు



బీసీ టీచర్స్ సమావేశంలో పాల్గొన్న ప్రిన్సిపాల్స్ జ్యోతి, నరసింహచారి తదితరులు

కేయూ క్యాంపస్ జూన్ 17, (ఆంధ్రజ్యోతి): కేయూ బీసీ టీచర్స్ అసోసియేషన్‌ను బలోపేతం చేసి అధ్యాపకుల సమస్యలపై సమష్టిగా పనిచేయాలని బీసీ టీచర్స్ అసోసియేషన్ నేతలు సూచించారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుంకరిజ్యోతి, ఎస్.నరసింహచారి, డాక్టర్ శాస్త్రి, స్వర్ణలతలతో పాటు ఇతర అధ్యాపకులు హాజరయ్యారు. బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పనిచేయాలని కోరారు. దేశంలోని బీసీలకు దక్కాల్సిన సహజ న్యాయమైన వాటా దక్కడం లేదన్నారు. 45 కేంద్రియ వర్సిటీలో బీసీ ప్రొఫెసర్లు 4 శాతమే ఉన్నారని, బీసీలకు అన్యాయం జరుగుతోందని చెప్పారు. రెగ్యులర్, కాంట్రాక్టు, పార్టుటైమ్ అధ్యాపకులందరినీ కలుపుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. బీసీ టీచర్ల కార్యక్రమాలను నిర్వహించేందుకు డాక్టర్ నాగయ్య, రమేశ్, సునీత, కృష్ణయ్య, శ్రీలత, కిరణ్‌లను కన్వీనర్లగా నియమించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో బీసీ అధ్యాపకులు ఎంకే కృష్ణ సుమంత్, డాక్టర్ ఎర్రబోజ్జు రమేశ్, చింతం ప్రవీణ్‌కుమార్, బ్రహ్మం, డాక్టర్ తిరుణహరి శేషు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్



జిల్లా జడ్జికి పూలమొక్కను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ స్నేహ శబరీష్ మంగళవారం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి డాక్టర్ కె.పట్టాభిరామారావును మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా న్యాయస్థానాల సముదాయ భవనంలోని జిల్లా జడ్జి చాంబర్‌లో వారికి పూలమొక్కను అందజేశారు. జిల్లా స్థితిగతులపై, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలపై ఇరువురు కొద్దిసేపు చర్చించారు.

సీపీని కలిసిన కలెక్టర్

హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన స్నేహ శబరీష్ మంగళవారం వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో పోలీసు కమిషనర్ చాంబర్‌లో కమిషనర్‌ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ కలిసి పూలమొక్కను అందజేశారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

జులైవాడ, (ఆంధ్రజ్యోతి): మూడు నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం 49వ డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి అధ్యక్షతన అమ్మ మాట, అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులను పంపినట్లయితే వారిలో శారీరక పెరుగుదలతోపాటు మానసిక, సామాజిక, మేధో సంపత్తి అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు.

అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్, కార్పొరేటర్ మానస చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్, సీడీపీవో విశ్వజ, సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మీ, జ్యోతి, పోషణ్ అభియాన్ కో ఆర్డినేటర్ ప్రీతి, కళ్యాణి, హైమావతి, అంగన్‌వాడీ టీచర్లు ప్రసన్న, రమాతార, హెల్పర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ లబ్దిదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వరంగల్ మెడికల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల నియంత్రణలో అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య సూచించారు. మంగళవారం హనుమకొండ పట్టణ పరిధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలు, పీహెచ్‌సీ కడిపికొండకు సంబంధించిన వైద్యాధికారులు, సూపర్‌వైజర్లతో డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా 15 రోజులపాటు పిల్లలు అతిసార వ్యాధికి గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఓఆర్‌ఎస్, జింక్ టాబ్లెట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రైడే పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయ్ కుమార్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ, ఇన్‌చార్జి మలేరియా అధికారి డాక్టర్ మదన్‌మోహన్‌రావు, డాక్టర్ మహేందర్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ ఇక్తాధర్ అహ్మద్, డాక్టర్ మంజుల పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణంతోనే ధర్మ పరిరక్షణ

హసన్‌పర్తి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ఆలయాల నిర్మాణంతోనే ధర్మ పరిరక్షణ సాధ్యమని వేద పండితులు కేశవ ఆచార్యులు అన్నారు. మండలంలోని అర్వపల్లిలో శిథిలావస్థలో ఉన్న శివలింగాన్ని, హనుమాన్ విగ్రహాన్ని సొంత ఖర్చులతో ఆలయ నిర్మాణానికి చేయూతనందించిన దాతలు ఆకుల వారసులతో మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు రూ.2 లక్షలకు పైగా ఆలయ నిర్మాణానికి సహకరించిన దాత లతో ప్రత్యేక హోమాన్ని నిర్వహింపజేసి ఆకుల వారసులను ఆశీర్వదించారు. అనంతరం వేదపండితుడు కేశవ ఆచా ర్యులు మాట్లాడుతూ దైవత్వం ఎక్కడ ఉంటుందో అక్కడ ధర్మం ఉంటుందన్నారు. కార్యక్రమంలో దాతలు ఆకుల మొగిళిపద్మ, రామకృష్ణఅనూష, రాజుమానస దంపతులు, దూలం రమ, వారి కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే భూభారతి

హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

హసన్‌పర్తి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం మండలంలోని సూదన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సదస్సుకు హాజరైన పలువురు రైతుల భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి భూ సమస్య ఉందని, కాస్తులో ఉన్నారా? సాదాబైనామాకు దరఖాస్తు చేశారా..? భూములు అమ్మిన వారికి పాసుబుక్కులు ఉన్నాయా..? లేదా భూములకు సంబంధించి ఎలాంటి ఆధారాలతో క్రయవిక్రయాలు చేశారు. తదితర భూ సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి చట్టాన్ని అమలు చేస్తుందన్నారు. భూ సమస్యలున్న వారు సదస్సులలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అదేవిధంగా స్థానికులు తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేయాలని కలెక్టర్‌ను కోరగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంది రమ్మ ఇండ్లు అందుతాయని ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దారు ఎండీ.రహీంపాషా, ఎంపీడీవో కర్ణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయాలి

వడ్డెపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని బీజేపీ గోపాల్‌పూర్‌జోన్ అధ్యక్షుడు బండి హరీష్ ముదిరాజ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌లోని గోపాల్‌పూర్‌లో నిర్వహించిన బీజేపీ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయ ఢంకా మోగించాలని బండి హరీష్ ముదిరాజ్ అన్నారు. సభకు హాజరైన నాయకులతో వికసిత్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ తక్కళ్లపల్లి అమృతరావు, మండల కన్వీనర్ నాతి రమేష్, కో కన్వీనర్ ఆరె రోహిత్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పప్పుల రమేష్, ఓబీసీ మోర్చ జిల్లా కార్యాలయ కార్యదర్శి అలుగునూరి కృష్ణం రాజు, జిల్లా నాయకులు చింతలపణి అమరేందర్‌రెడ్డి, కటకం రాజేష్, పోలేపల్లి బాలరాజు,సురేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి లక్ష్మణ్‌రావు, బండారు కుమార్, హుస్సేన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐలో ఎన్నికలు

కాజీపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట ఎఫ్‌సీఐలో మంగళవారం ఉద్యోగ సంఘాల ఎన్నికలు జరిగాయి. భారతీయ ఖాద్య నిగం కర్మచారి, ఎగ్జిక్యూటీవ్ స్టాఫ్ యూనియన్ , డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ యనియన్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ అసోసియేషన్ యూనియన్ ఎన్నికలు జరిగాయి. మెత్తం 126 ఓట్లకు గాను 123 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు శివ, వెంకట్, రవి ప్రకాశ్ తెలిపారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ ఎన్నికల ఫలితాలు ఈ నెల 26 న ప్రకటించనున్నట్లు చెప్పారు.

కోటి విత్తనాల సేకరణ

కాజీపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షకుడు ప్రకాశ్ పర్యావరణ పరిరక్షణకోసం పద్మశ్రీ జీవ రామయ్య స్ఫూర్తితో మంగళవారం నిట్ క్వార్టర్స్ వద్ద కోటి విత్తనాల కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా నేరేడు విత్తనాలు సేకరించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ.. పండ్లు తిన్నతర్వాత విత్తనాలు వృథాగా పడేయకుండా భద్రపరిచి తమకు ఇవ్వాలని కోరారు. విత్తనాలు 88011 61695 ఫోన్ నెంబర్‌కు వాట్సప్ లేదా, కాల్‌చేసి సమాచారం ఇస్తే తీసుకుంటామని చెప్పారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 18 జూన్ 2025





ఓణీల్లో వెలుగు నగలు!

ఓణీల ఫంక్షన్‌లో సంప్రదాయ నగలదే పెద్ద పీట అయినా, వాటికి కొంత ఆధునికతను జోడిస్తే సరికొత్తగా వెలిగిపోవచ్చు. ఇందుకోసం అవే నగలకు కొత్త హంగులు అద్దాలి.

ఫ్యాషన్





ఇలాంటి నగలు మేలు

మెడలో రెండు హారాలకు బదులు ఒకే హారాన్ని ఎంచుకునేపనైతే, కాస్త భారీగా ఉండే మధ్యస్థ పొడవున హారాన్ని ఎంచుకోవచ్చు. వీటిలో వెచ్చించే డబ్బును బట్టి ప్లెయిన్ గోల్డ్ లేదా వజ్రాల నగలను ఎంచుకోవచ్చు. అలాగే వేడుక సమయాన్ని బట్టి కూడా నగల ఎంపికలో కొన్ని నియమాలు పాటించాలి. వేడుక ఉదయం అయితే పూర్తి బంగారంతో తయారైన నగలు బాగుంటాయి. అలాకాకుండా రాత్రి వేళ అయితే మెరిసే జాతి రాళ్ళు, మరీ ముఖ్యంగా పోల్కి, కుందన్, మోజనైట్స్ లేదా వజ్రాల నగలైతే మిరుమిట్లు గొలుపుతూ ఆడపిల్లల అందాన్ని రెట్టింపు చేస్తాయి.

కాసుల పేరు, వరాల మాల

ఓణీల వేడుకలో ఆడపిల్లలకు పోల్కి నెక్లెస్, కాసుల హారం కూడా వేసుకోవచ్చు. ఇవి సంప్రదాయ నగలు కాబట్టి కాసుల హారం పాత ఫ్యాషన్ అనుకోనవసరం లేదు. కాసుల పేరు వద్దనుకునేవారు, 'రాంపరి వరాల మాల' వేసుకోవచ్చు. మరీ భారీ నగలు ఎంచుకుంటే పిల్లలు పెద్దయ్యాక వేసుకోలేకపోవచ్చు. కాబట్టి కాస్త తేలికపాటి మాలనే ఎంచుకోవటం మేలు. వీటిని తర్వాత అయినా మార్చుకోవచ్చు.

తక్కువ బరువులో

వడ్డాణం కొనలేకపోతే, బంగారు మెరుగు వేసిన వెండి నగలూ, గిల్టువీ దొరుకుతాయి. మాంగ్ టీకా (పాపడి బిళ్ల), చంపసరాలు, ముక్కు పుడక అలంకరించటం కూడా తాజా ఫ్యాషన్. ఇవి తక్కువ బరువులోనే దొరుకుతాయి. కాబట్టి తక్కువ బంగారంతో ఆడంబరంగా అలంకరించాలనుకుంటే వీటిని ఎంచుకోవాలి. వీటితోపాటు జడ బిళ్లలూ అలంకరించుకోవచ్చు.

---

116 ఏళ్ల చరిత్ర కలిగిన బ్రిటిష్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలో బ్రెయిస్ మెట్రివెలీ అనే 47 ఏళ్ల మహిళ... తొలిసారిగా చీఫ్‌గా ఎంపికైంది. ప్రపంచ అస్థిరతతో పాటు పెరుగుతున్న భద్రతాపరమైన సవాళ్లను ఎదుర్కోవడంలో మెట్రివెలీతో పాటు గతంలో ఇంటెలిజెన్స్ సర్వీస్‌లో సేవలందించిన మరికొందరు మహిళలు కూడా అమోఘమైన ప్రతిభను కనబరిచారు. వాళ్ల గురించిన ఆసక్తికరమైన విశేషాలు...

బ్రిటన్ నిఘాకు లేడీ బాస్



న్యూస్ మేకర్

జేమ్స్‌బాండ్ 007 సినిమాలు చూసే అలవాటున్న వాళ్లకు, శక్తివంతమైన 'ఎమ్' పాత్ర పోషించిన నటి 'జూడి డెంచ్' ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఇప్పుడు నిజ జీవితంలో అదే పాత్రను పోషించబోతోంది బ్రెయిస్ మెట్రివెలీ. తాజాగా యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన విదేశీ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, సీక్రెట్ ఇంటెలిజెన్స్ సర్వీస్, ఎమ్ఐ6 మెట్రివెలీని చీఫ్‌గా ఎంచుకుంది. దాంతో ప్రస్తుతం ఎమ్ఐ6లో, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్‌కు డైరెక్టర్ జనరల్‌గా వ్యవహరిస్తున్న మెట్రివెలీ, అక్టోబరు 1న, ఎమ్ఐ6కు 18వ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టబోతోంది. గతంలో ఎమ్ఐ5లో దేశ భద్రతకు సంబంధించి కీలక బాధ్యతలు నిర్వహించిన మెట్రివెలీ, 1999లో కేస్ ఆఫీసర్‌గా ఇంటెలిజెన్స్ సేవల్లోకి అడుగుపెట్టింది. సేవల సంప్రదాయం ప్రకారం కొత్త చీఫ్ కాబోతున్న మెట్రివెలీ 'సి' అనే పేరును ఉపయోగించుకోబోతోంది. వెస్ట్ మినిస్టర్ స్కూల్‌లో ఎ లెవల్స్ పూర్తి చేసిన మెట్రివెలీ కేంబ్రిడ్జ్, పెంబ్రోక్ కాలేజీలో ఆంత్రోపాలజీ చదివింది. 1997లో మహిళల పడవ పందెంలో గెలుపొందిన సిబ్బందిలో ఈమె కూడా ఒక సభ్యురాలు. 1999లో ఇంటెలిజెన్స్‌లో చేరిన ఈమె, ఎమ్ఐలో డైరెక్టర్ స్థాయిలో సేవలందించింది. 2021లో టెలిగ్రాఫ్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో తన కుటుంబం గురించి వివరిస్తూ, పిల్లలు స్వయంగా దర్యాప్తు చేసి తన అసలు వృత్తి గురించి తెలుసుకున్నారనే విషయాన్ని బహిర్గతం చేసింది. మెట్రివెలీ మాదిరిగానే నిరంతర సవాళ్లను ఎదుర్కొంటూ, అత్యద్భుతమైన మేధస్సును ప్రదర్శిస్తూ, ఇంటెలిజెన్స్, గూఢచర్య రంగాల్లో గణనీయమైన కృషి చేసిన మహిళాధికారులు గతంలో ఎంతోమంది ఉన్నారు. వాళ్ల గురించి కూడా తెలుసుకుందాం!



వర్జీనియా హాల్

రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో అత్యంత విశిష్టమైన గూఢచారిగా మారిన అమెరికా మహిళ ఈమె. కృత్రిమ చెక్క కాలుతో విధులు నిర్వహించిన ఈ మహిళ, ఆఫీస్ ఆఫ్ ది స్ట్రాటెజిక్ సర్వీసెస్‌కు ఫీల్డ్ ఏజెంట్‌గా పని చేస్తూ, విధ్వంసక మిషన్లు చేపట్టడంలో మిత్రదేశాల సైనికులు తప్పించుకోవడంలో కీలక పాత్ర పోషించింది. యుద్ధ సమయంలో విశిష్టమైన సర్వీస్ క్రాస్‌ను అందుకున్న ఏకైక మహిళా పౌరురాలు.. ఈ వర్జీనియా హాల్.

నూర్ ఇనాయత్ ఖాన్

బ్రిటిష్ ఇండియన్ రాకుమారి, మొట్టమొదటి మహిళా వైర్‌లెస్ ఆపరేటర్ అయిన ఈమెకు నోరా బేకర్ అనే మరో పేరు కూడా ఉంది. రెండవ ప్రపంచ యుద్ధంలో ఈమెను నాజీ ఆక్రమిత ఫ్రాన్స్‌లోకి పంపించారు. మ్యాడెలీన్ అనే కోడ్ నేమ్‌తో విధులు నిర్వర్తించిన నూర్, చివరకు పట్టుబడి ప్రాణాలు పోగొట్టుకునే వరకూ కీలకమైన సమాచారాన్ని చేరవేస్తూనే ఉంది. నూర్ కనబరిచిన ధైర్యసాహసాలకు గుర్తింపుగా ఆమెను జార్జ్ క్రాస్ బిరుదుతో గౌరవించారు.

ఏమీ ఎలిజబెత్ థోర్ప్

ఈ ఆంగ్లో అమెరికన్ మహిళా గూఢచారికి బెట్టీ ప్యాక్, బెట్టీ థోర్ప్, ఎలిజబెత్ ప్యాక్ అనే ఇతరత్రా పేర్లు కూడా ఉన్నాయి. ఈమె రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటన్‌కూ, అమెరికాకూ సేవలందించింది. సింథియా అనే కోడ్ నేమ్ కలిగి ఉన్న ఏమీ, తన అందచందాలతో విదేశీ అధికారులను ఆకట్టుకుని, వారి నుంచి జర్మన్ ఎనిగ్మా కోడ్స్, ఫ్రెంచ్ నావిక రహస్యాలతో పాటు సున్నిత సమాచారాన్ని రాబట్టింది.

మెలిటా నార్‌ఉడ్

ఈ బ్రిటిష్ ప్రభుత్వోద్యోగిని, కొన్ని దశాబ్దాల పాటు సోవియట్ యూనియన్‌కు రహస్యంగా అణు రహస్యాలను చేరవేసింది. బ్రిటనల్‌లో దీర్ఘకాలం పాటు పని చేసిన సోవియట్ గూఢచారి ఈమె. 'హోలా' అనే కోడ్ నేమ్‌తో పని చేసినన మెలిటా గూఢచర్యం ఆమె మరణానంతరం బహిర్గతమైంది.

ఇల్లు చూడచక్కగా...

- రోజూ ఆఫీసుకు వెళ్లే హడావుడిలో అవసరం కోసం తీసిన వస్తువులను పక్కన పడేసి వెళ్తూ ఉంటాం. ఇలా తీసిన వస్తువులను కొంచెం ఓపిక చేసుకుని వాడిన వెంటనే యథాస్థానంలో పెట్టేస్తే ఇల్లు శుభ్రంగా ఉంటుంది.
- హడావుడిలో బట్టలను ఎలా పడితే అలా లాగుతాం. అది బాలేదు ఇది బాలేదు అని తేల్చుకోలేక మార్చుతూ ఉంటాం. దీంతో అల్మారా చిందరవందరగా మారుతుంది. ఇలా కాకుండా ఉండాలంటే ముందు రోజు రాత్రే రేపు వేసుకునే బట్టలను నిర్ణయించుకుని అల్మారాలోంచి బయటకు తీసి పెట్టుకోవాలి.
- షాపింగ్‌కు వెళ్లినప్పుడు నచ్చింది అనో, తక్కువ రేటు అనో అనవసర వస్తువులను కొంటుంటాం. ఆ తర్వాత వాటికి స్థలం లేక ఎక్కడో ఒక దగ్గర ఇరికిస్తూ ఉంటాం. ఇలాంటి వాటివల్ల ఇల్లు గందరగోళంగా మారుతుంది. అవసరమైతేనే ఏదైనా కొనడం మంచిది.
- ఇంట్లో వాడని వస్తువులను, అనవసరమైన వాటిని, పాత వాటిని అవసరంలో ఉన్న వారికి ఇవ్వాలి లేదా పడెయ్యాలి.



- మూడు నాలుగు నెలలకు ఒకసారి ఇలాంటి వాటిని వేరు చేయడం వల్ల ఇంట్లో చెత్త తగ్గుతుంది. కొత్త వస్తువులకు స్థలం దొరుకుతుంది.
- తరచూ వాడే వస్తువులను అందుబాటులో పెట్టుకోవాలి. అప్పుడప్పుడు మాత్రమే వాడే వాటిని లోపలి వైపు పెట్టుకోవాలి.

ప్రజారథ సారథి

బస్సులో డ్రైవింగ్ సీటు అంటే... అందులో కచ్చితంగా మగవారే కనిపిస్తారు. దశాబ్దాలుగా చూస్తున్న దృశ్యం ఇది. కానీ ఆ సంప్రదాయానికి తెరదించారు **వాంకుతోడు సరిత.** ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (డీటీసీ)లో పదేళ్లపాటు బస్సు నడిపిన ఆమె... ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో మొట్టమొదటి మహిళా డ్రైవర్‌గా చరిత్ర సృష్టించారు. మహిళలు తలుచుకొంటే అసాధ్యమనేది ఏదీ లేదంటున్న సరిత... 'నవ్య'తో తన అనుభవాలు పంచుకున్నారు.



సంకల్పం

"యాదాద్రి భువనగిరి జిల్లా సీపీయానాయక్ తండాలో వ్యవసాయ కుటుంబం మాది. అమ్మ రుక్క, నాన్న రాంకోటి. మేం ఆరుగురు సంతానం. ఐదుగురు ఆడపిల్లల్లో నేను చిన్నదాన్ని. స్థానికంగా పదో తరగతి వరకు చదువుకున్నా. అక్కల పెళ్లిళ్లు చేయడంతో మా కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. రోజు గడవడం కష్టంగా మారింది. దీంతో నేను చదువు ఆపేసి... 2004లో ఊళ్లో ఆటో నడపడం మొదలుపెట్టాను. ఒకటీ రెండు కాదు ఆరేళ్లపాటు ఆటో నడిపాను. అమ్మానాన్నలకు ఆసరా అయ్యాను. ఒక ఆడపిల్ల ఆటో నడపడం అంటే అందరూ వింతగా చూసేవారు. కొందరు అభినందించేవారు.

ఢిల్లీ వెళ్లి డ్రైవింగ్...

అలా ఒక స్వచ్ఛంద సంస్థ దృష్టిలో పడ్డాను. సంస్థ వారు నన్ను ఢిల్లీకి తీసుకువెళ్లి డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పించారు. అక్కడ నేను భారీ వాహనాలు నడపడం నేర్చుకున్నాను. సదరు సంస్థ దేశవ్యాప్తంగా మొత్తం 15 మంది మహిళలకు శిక్షణ ఇచ్చింది. అందులో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నది నేనొక్కదాన్నే. బాగా నైపుణ్యం సంపాదించాక హెవీ వెహికిల్ లైసెన్స్ తెచ్చుకున్నాను. దాంతో 'ఢిల్లీ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్'లో డ్రైవర్‌గా ఉద్యోగం లభించింది. ఆ క్షణం ఎంతో ఉద్వేగానికి లోనయ్యాను. దేశ రాజధాని. నిత్యం రద్దీగా ఉండే రోడ్లు. ఆ రహదారులపై భారీ వాహనం నడపడం అంటే సాధారణ విషయం కాదు. అడుగడుగునా సవాళ్లు ఎదురవుతాయి. కానీ నేను ఏ రోజూ ఇబ్బంది పడిందిలేదు. నావల్ల కాదని అనుకోలేదు.

కన్నవారి కోసం...

పదేళ్లపాటు ఢిల్లీ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్‌లో పని చేశాను. ప్రభుత్వ ఉద్యోగం. మంచి జీతం. కానీ ఊళ్లో అమ్మానాన్నలను చూసుకోవడానికి ఎవరూ లేకపోవడం నన్ను బాధించింది. ఓ రోడ్డు ప్రమాదంలో నాన్న కాలు విరిగింది. వయోభారంతో కంటిచూపు మందగించింది. ఇటీవల ప్రమాదవశాత్తూ అమ్మ కాలికి కూడా ఫ్రాక్చరయింది. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని సొంతూరికి తిరిగి రావాలని నిర్ణయించుకున్నాను. దాంతో ఢిల్లీలో ఉద్యోగం వదిలేశాను. నేను ఉద్యోగం మానేయడంతో మాకు ఏ ఆధారం లేకుండాపోయింది. దీంతో స్థానిక నాయకులు, అధికారులను కలిశాను. మా కుటుంబ ఆర్థిక పరిస్థితి గురించి వివరించాను. నా నైపుణ్యం, అనుభవాన్ని గుర్తించి ఉద్యోగ అవకాశం కల్పించాలని విన్నవించుకున్నాను. ఆ ప్రయత్నాలు ఫలించాయి. అయితే ప్రస్తుతం ఆర్టీసీలో నేరుగా నియామకాలు లేకపోవడంతో తాత్కాలికంగా జేబీఎం విద్యుత్ బస్సు నడిపేందుకు అధికారులు అవకాశం ఇచ్చారు. ఇప్పుడు హైదరాబాద్- మిర్యాలగూడ రూట్‌లో విధులు నిర్వర్తిస్తున్నాను. ఢిల్లీ రద్దీ రోడ్లపై బస్సు నడిపిన అనుభవం వల్ల ఇక్కడ డ్రైవింగ్ ఎంతో సులువుగా అనిపిస్తోంది. అన్నిటికీ మించి అమ్మానాన్నలను దగ్గరుండి చూసుకోగలుగుతున్నాను. ఇప్పుడు నా మనసు కాస్త కుదుటపడింది."

> **అందుకే పెళ్లి వద్దనుకున్నా...**
>
> నలుగురు అక్కలకు పెళ్లిళ్ల సమయంలో డబ్బు సర్దుబాటుకాక అమ్మానాన్న ఎన్నో ఇబ్బందులు పడ్డారు. వారి కష్టం చూసి నేను ఎంతో బాధపడేదాన్ని. నేను వారికి భారం కాకూడదనుకున్నాను. అందుకే ఆటో నడిపాను. కన్నవారికి దూరంగా ఢిల్లీ వెళ్లి ఉద్యోగం చేశాను. నా పెళ్లితో అమ్మానాన్నలపై మరింత భారం మోపకూడదని అనుకున్నాను. అంతేకాదు... నేను అత్తింటికి వెళ్లిపోతే వాళ్లు ఒంటరి అయిపోతారు. వృద్ధాప్యంలో ఏ దిక్కూ లేక అవస్థలు పడతారు. అందుకే చివరి వరకు వారికి తోడుగా ఉండాలని భావించి... పెళ్లి చేసుకోకూడదనే నిర్ణయానికి వచ్చాను.



• యస్.సోమేశ్వర్

స్వతంత్రంగా ఎదగనివ్వాలి

పేరెంటింగ్



తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రేమతో అపురూపంగా పెంచాలని అనుకుంటారు. పిల్లలకు సంబంధించిన ప్రతి పనినీ దగ్గరుండి చేస్తూ వాళ్లకి ఏ కష్టమూ కలగకూడదని తాపత్రయపడుతూ ఉంటారు. ఈ ధోరణి వల్ల పిల్లలు స్వతంత్రంగా ఏ పనీ చేయలేక పోతున్నారు. అలాకాకుండా పిల్లలకు చిన్నప్పటి నుంచే సొంత పనులు చేసుకోవడంతోపాటు ఇతర పనులూ చేయడం నేర్పించాలని నిపుణులు సూచిస్తున్నారు..

- పిల్లలకు ఉదయాన్నే నిద్ర లేవడం అలవాటు చేయాలి. కొంచెం పెద్ద పిల్లలు అయితే దుప్పట్లు మడతపెట్టడం, పక్క సర్దడం లాంటివి చేయమని చెప్పవచ్చు. నిద్ర లేవగానే పళ్లు తోముకోవడం, మంచినీళ్లు తాగడం, కాలకృత్యాలు తీర్చుకోవడం, స్నానం చేయడం, యూనిఫామ్ లేదా బట్టలు వేసుకోవడం, షూ లేసులు కట్టుకోవడం లాంటి వాటిని దగ్గరుండి నేర్పించాలి.
- బడికి వెళ్లేముందు బ్యాగ్‌లో పుస్తకాలు సర్దుకోవడం, లంచ్ బాక్స్- వాటర్ బాటిల్ పెట్టుకోవడం లాంటి పనులను వాళ్లనే చేసుకోనివ్వాలి. బడి నుంచి ఇంటికి రాగానే లంచ్ బాక్స్‌ను వంటగది సింక్‌లో వేయడం అలవాటు చేయాలి..
- సాయంత్రం వేళ కొద్ది సేపు తోట పని చేయడం, పెంపుడు జంతువులను బయటికి తీసుకెళ్లడం, బజారు నుంచి వస్తువులు కొని తీసుకురావడం లాంటి పనులు చేయించాలి.
- ఇంట్లో నానమ్మ, తాతయ్య లాంటి పెద్దవారికి సహాయం చేయడం, చిన్నపిల్లలను ఆడించడం నేర్పించాలి. వంటచేసేటప్పుడు చిన్న చిన్న పనులు చెప్పి చేయించాలి.
- వారాంతాల్లో ఇల్లు శుభ్రం చేసేటప్పుడు పిల్లల సహాయం అడగాలి. వాళ్లు ఆడుకునే బొమ్మలు, రోజూ వేసుకునే బట్టలు, యూనిఫామ్‌లు, పుస్తకాలను కేటాయించిన అరల్లో చక్కగా ఎలా సర్దాలో చేసి చూపించాలి.
- యుక్తవయసు పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత, వంటచేయడం, బట్టలు ఉతకడం వంటివి నేర్పించాలి. బ్యాంక్ సంబంధిత ఆర్థిక వ్యవహారాలపై కొద్దిపాటి అవగాహన కల్పించాలి. వివిధ రకాల బిల్లులు చెల్లించడం, పొదుపు చేయడం, ప్రథమ చికిత్స పద్ధతుల గురించి తెలియజెప్పాలి.
- పిల్లలకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు వాళ్లు ఏవిధంగా పరిష్కరించుకుంటున్నారో గమనించాలి. అవసరమైతేనే సహాయం చేయాలి. పెద్దలను సలహా అడగడం అలవాటు చేయాలి.
- పిల్లలు ఏదైనా పొరబాటు చేస్తే దానినుంచి ఎలా పాఠం నేర్చుకోవాలో సూచించాలి.
- గెలిచినప్పుడు పొంగిపోవడం, ఓడినప్పుడు కుంగిపోవడం కాకుండా రెంటినీ సమానంగా స్వీకరించే విధానాన్ని నేర్పించాలి.

శరీరం నుంచి దుర్వాసనా..?

కొంతమందికి శరీరం నుంచి దుర్వాసన వస్తూ ఉంటుంది. వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, వాతావరణ కాలుష్యం, మితిమీరి చెమట పట్టడం లాంటి కారణాల వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది. చిన్నపాటి జాగ్రత్తలతో ఈ సమస్యనుంచి బయటపడవచ్చు.

- ఈ సమస్య ఉన్నవారు లేత రంగుల్లో పలుచగా ఉండే కాటన్ బట్టలు వేసుకోవడం మంచిది. నైలాన్, సిల్క్ బట్టలు అలాగే మందంగా ఉండే వాటిని వేసుకుంటే గాలి ఆడక చెమట పెరిగి శరీరం నుంచి వాసన వస్తుంది. వీలైతే ఆరు గంటలకు ఓసారి బట్టలను మార్చుకోవడం మంచి ఫలితాన్ని ఇస్తుంది.
- రోజుకు రెండుసార్లు తప్పనిసరిగా గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. సబ్బుతో కాకుండా సున్నిపిండి లేదా కుంకుడు రసంతో శరీరాన్ని రుద్దుకుంటే చర్మ రంధ్రాలు పూర్తిగా శుభ్రమవుతాయి. హానికారక బ్యాక్టీరియాలు కూడా తొలగి సమస్య చాలావరకు తీరుతుంది.
- తల, చెవుల వెనక భాగం, మెడ, పాదాల మీద ఎక్కువగా చెమట పడుతూ ఉంటుంది. దీనివల్ల కూడా శరీరం నుంచి దుర్వాసన రావచ్చు. స్నానం చేసేటప్పుడు ఈ భాగాలను ప్రత్యేకంగా శుభ్రం చేసుకోవాలి.
- స్నానం చేసిన తరవాత పొడిగా పరిశుభ్రంగా ఉన్న దుస్తులను మాత్రమే ధరించాలి. ఒకసారి వేసుకున్న బట్టల మీద చెమట, దుమ్ము, ధూళి చేరి ఉంటాయి. ఇవి దుర్వాసనకు కారణం కావచ్చు. ఇలాంటి దుస్తులను ఉతకకుండా మరోసారి వేసుకోకూడదు.
- దుస్తులను ఉతికిన తరవాత వాటిని గాలి తగిలేలా ఆరేయాలి. పొడిగా ఆరిన తరవాతనే వాటిని మడతపెట్టాలి. బట్టలు సరిగా ఆరకపోతే ఒక్కోసారి వాటి నుంచి దుర్వాసన వస్తూ ఉంటుంది. వీటిని అలాగే ధరిస్తే శరీరానికి చెడు వాసన పడుతుంది.
- పాదాలకు ధరించే సాక్స్, కాన్వాస్ షూస్ లాంటివాటిని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- సెంట్లు, పెర్ఫ్యూమ్‌లను ఎక్కువగా ఉపయోగించకూడదు. ఇవి సమస్యను మరింత పెంచుతాయి.
- ఒక్కోసారి ఆహారపు అలవాట్లు కూడా సమస్యకు కారణం కావచ్చు. ఉల్లి, వెల్లుల్లి, మాంసాహారం ఎక్కువగా తీసుకోకూడదు. జింక్, మెగ్నీషియం, పీచు పదార్థాలు ఉండే ఆహారాన్ని తరచూ తీసుకోవడం మంచిది.



కులగణన ఉద్దేశం కేంద్రానికి లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయి. జనాభా లెక్కల సేకరణకు రూ.10 వేల కోట్లు అవసరం. కానీ కేంద్రం రూ.574 కోట్లు మాత్రమే కేటాయించింది. ఎలాగైనా కాలహరణం చేయడం, పతాక శీర్షికలకు ఎక్కడం.. ఆయా అంశాలను తన చేతుల్లోకి తీసుకోవడమే దాని ఉద్దేశంగా కనబడుతోంది' అని విమర్శించారు. తెలంగాణలోని తమ పార్టీ ప్రభుత్వం కులగణనను మంచి పద్ధతిలో నిర్వహించిందని తెలిపారు. ఇందులో ప్రభుత్వ సిబ్బందిని నియోగించలేదని.. స్వచ్ఛంద సంస్థలు, సాంకేతిక నైపుణ్యం ఉన్నవారి సాయంతో లెక్కలు సేకరించిందని చెప్పారు. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులను తెలుసుకునే దిశగా కులగణన మొదటి అడుగన్నారు. కానీ ఇది చేపట్టే ఉద్దేశం కేంద్రానికి ఉన్నట్లు కనబడడం లేదని చెప్పారు. ఈ అంశాన్ని రాజకీయం చేయడం మాని సమర్థంగా పనిచేయాలని.. జాతీయ స్థాయిలో కులగణనకు తెలంగాణ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. అయితే, కేంద్రం జారీచేసిన నోటిఫికేషన్‌లో కులగణన ప్రస్తావన లేదని, మోదీ ప్రభుత్వం యూటర్న్ తీసుకుందన్న ఆరోపణలను కేంద్ర హోం శాఖ సోమవారమే తోసిపుచ్చింది. ఇవి తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలుగా పేర్కొంది. ఏప్రిల్ 30, జూన్ 4, 15 తేదీల్లో విడుదల చేసిన పత్రికా ప్రకటనల్లో కులగణన ప్రస్తావన ఉందని స్పష్టంచేసింది.

జస్టిస్ వర్మ చాలా మంచి జడ్జి: కపిల్ సిబల్

న్యూఢిల్లీ, జూన్ 17: అధికారిక నివాసంలోని స్టోర్ రూంలో నోట్ల కట్టలు దొరికాయన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మకు రాజ్యసభ సభ్యుడు, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ అండగా నిలిచారు. మంచి న్యాయమూర్తుల్లో ఆయన ఒకరని అభివర్ణించారు. కొలీజియం వ్యవస్థను నాశనం చేసి, న్యాయమూర్తుల నియామకాన్ని తన గుప్పిట్లో ఉంచుకోవాలన్న దురుద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం ఆయనపై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. మతపరమైన వ్యాఖ్యలు చేసిన జస్టిస్ శేఖర్ యాదవ్‌పై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశ పెట్టకుండా జస్టిస్ వర్మపైనే చర్యలు తీసుకోవడాన్ని ప్రశ్నించారు. ఆయన ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ "ఎలాంటి ఆధారాలు లేనప్పటికీ ఒక న్యాయమూర్తిని ప్రభుత్వం లక్ష్యంగా చేసుకొంది. బహిరంగంగా మతపర వ్యాఖ్యలు చేసిన మరో న్యాయమూర్తిపై అభిశంసన నోటీసు అందజేసినా సంతకాల తనిఖీ పేరుతో రాజ్యసభ ఛైర్మన్ దాన్ని పెండింగ్‌లో పెట్టారు" అని విమర్శించారు. జస్టిస్ యాదవ్‌ను ఎందుకు రక్షిస్తున్నారని ప్రశ్నించారు.

సైకిల్‌పై నుంచి జారిపడ్డ డీకే శివకుమార్



బెంగళూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సైకిల్ మీద నుంచి జారిపడ్డారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు బెంగళూరులో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో డీకే శివకుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని సైకిల్ తొక్కారు. ఈ క్రమంలో విధాన సౌధ మెట్ల వద్ద సైకిల్ ఆపి కిందకు దిగే ప్రయత్నంలో అదుపు తప్పి జారిపడ్డారు. వెంటనే ఆయనకు భద్రతా సిబ్బంది సహాయం అందించి పైకి లేపారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో ఒక ఫోటో షేర్ చేశారు. "పవర్ కారిడార్‌లో నేను సైకిల్ ఎంచుకున్నాను. అభివృద్ధికి ఎప్పుడూ హార్స్‌పవర్ అవసరం లేదు, ప్రజా బలం చాలు" అన్నారు.

విమానం.. ఆగమాగం!

వరుసగా సాంకేతిక సమస్యలు, యూటర్న్‌లు

- అత్యవసర ల్యాండింగ్‌లతో ఆందోళన
- మంగళవారం 8 జాతీయ, అంతర్జాతీయ సర్వీసులను రద్దు చేసిన ఎయిరిండియా



కోల్‌కతాలో దిగిన ఎయిరిండియా విమానం

న్యూఢిల్లీ, జూన్ 17: అహ్మదాబాద్ ఘోర ప్రమాదం తర్వాతి నుంచి.. విమానాల్లో వరుసగా సాంకేతిక సమస్యలు, వెనక్కి మళ్లించడాలు, అత్యవసర ల్యాండింగ్ వంటివి ఆందోళన రేపుతున్నాయి. వరుసగా మరిన్ని ఘటనలు జరుగుతున్నాయి. మంగళవారం వివిధ కారణాలతో ఎనిమిది జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులను ఎయిరిండియా రద్దు చేసింది. అందులో ఆరు సర్వీసులు అహ్మదాబాద్‌లో ప్రమాదానికి గురైన బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ రకం విమానాలే కావడం గమనార్హం. మంగళవారం ఢిల్లీ నుంచి పారిస్ (ఏఐ143), పారిస్ నుంచి ఢిల్లీ (ఏఐ142) సర్వీసులను సాంకేతిక సమస్యలతో రద్దు చేసినట్టు ఎయిరిండియా ప్రకటించింది. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం, పలు దేశాల గగనతలాన్ని మూసివేయడంతో లండన్ నుంచి అమృత్‌సర్‌కు రావాల్సిన ఏఐ170 విమానాన్ని రద్దు చేసినట్టు తెలిపింది. ఇక విమానం అందుబాటులో లేకపోవడంతో అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లాల్సిన మరో సర్వీసు కూడా రద్దయింది. అహ్మదాబాద్‌లో టేకాఫ్ అవుతూ కూలిపోయిన ఏఐ171 విమానం స్థానంలో ఏఐ159 కోడ్‌తో సోమవారమే ఈ సర్వీసును ప్రారంభించడం గమనార్హం. ఇక విమానంలో తనిఖీల కారణంగా జాప్యం జరగడం, అప్పటికే పైలట్లు, ఇతర సిబ్బంది విధుల సమయం ముగియడంతో ముంబై-అహ్మదాబాద్ (ఏఐ2493) విమానాన్ని రద్దు చేసినట్టు ఎయిరిండియా తెలిపింది. ఢిల్లీ-దుబాయ్ (ఏఐ915), ఢిల్లీ-వియన్నా (ఏఐ153), లండన్-బెంగళూరు (ఏఐ132) విమానాలనూ రద్దు చేసినట్టు ప్రకటించింది. మరోవైపు దేశవ్యాప్తంగా విమానాల షెడ్యూల్‌లో తీవ్రంగా జాప్యం జరుగుతోంది. అహ్మదాబాద్ ప్రమాదం నేపథ్యంలో.. కఠినమైన తనిఖీలు, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో పలుదేశాల గగనతలాన్ని మూసివేయడం వంటివి ఈ ఆలస్యానికి కారణమని ఎయిరిండియా ప్రతినిధులు తెలిపారు.

విమానాల్లో సమస్యలతో ఆందోళన..

మరోవైపు అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి కోల్‌కతా మీదుగా ముంబైకి బయలుదేరిన ఎయిరిండియా ఏఐ180 విమానం ఎడమ ఇంజన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీనితో మంగళవారం తెల్లవారుజామున కోల్‌కతాలో ప్రయాణికులందరినీ విమానం నుంచి దింపేసి.. లోపాన్ని సరిదిద్దే పని చేపట్టారు. గోవా నుంచి లక్నోకు వెళుతున్న ఇండిగో విమానం ఎయిర్ టర్బులెన్స్‌తో తీవ్ర కుదుపులకు గురైంది. సోమవారం సాయంత్రం 4.25 గంటలకు ఢిల్లీ నుంచి రాంచీకి బయలుదేరిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో.. టేకాఫ్ అయిన కాసేపటికే వెనక్కి మళ్లించి ఢిల్లీలో ల్యాండ్ చేశారు. మస్కట్ నుంచి కోచి మీదుగా ఢిల్లీకి వస్తున్న ఇండిగో విమానంలో బాంబు ఉందన్న బెదిరింపులతో మంగళవారం ఉదయం 9.30 గంటల సమయంలో మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు.

ప్రమాదానికి గురైన విమాన.. పైలట్ల శిక్షణ రికార్డులు ఇవ్వండి

న్యూఢిల్లీ, జూన్ 17: అహ్మదాబాద్‌లో ఘోర ప్రమాదానికి గురైన విమానాన్ని నడిపించిన పైలట్ల శిక్షణ రికార్డులను తమకు అందజేయాలని ఎయిరిండియాను డీజీసీఏ ఆదేశించింది. పైలట్లతోపాటు ఆ విమానం బయలుదేరడానికి అనుమతి ఇచ్చిన అధికారుల శిక్షణ వివరాలనూ అందజేయాలని కోరింది. ప్రభుత్వం రహస్యంగా సర్క్యులేట్ చేసిన మెమోలను ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తా సంస్థ ఈ వివరాలను వెల్లడించింది. దేశంలోని అన్ని విమన, హెలికాప్టర్ పైలట్ శిక్షణ సంస్థలు (ఫ్లైయింగ్ స్కూళ్లు) అన్ని రకాల భద్రతా తనిఖీలు నిర్వహించాలని డీజీసీఏ ఆదేశించింది.

మరోవైపు, కేరళలోని తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో మూడు రోజుల క్రితం అత్యవసరంగా ల్యాండ్ అయిన బ్రిటన్ యుద్ధ విమానం ఎఫ్-35బీ ఇంకా అక్కడే ఉంది. అందులోని హైడ్రాలిక్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో.. పెద్దగా సమస్యలేమీ లేవు

- 24 బోయింగ్ విమానాల్లో భద్రతా తనిఖీలు పూర్తి చేశాం
- విమానయాన భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయి: డీజీసీఏ

న్యూఢిల్లీ, జూన్ 17: ప్రస్తుతం భారత విమానయాన సంస్థల వద్ద ఉన్న బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో పెద్దగా భద్రతా సమస్యలేమీ లేవని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ప్రకటించింది. అహ్మదాబాద్ ఘోర విమాన ప్రమాదం, ప్రపంచవ్యాప్తంగా పలుచోట్ల 787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తడం నేపథ్యంలో.. మన దేశ విమానయాన సంస్థల వద్ద ఉన్న ఈ తరహా విమానాలన్నింటిలో డీజీసీఏ విస్తృతమైన భద్రతా తనిఖీలు చేపట్టిన విషయం తెలిసిందే. మంగళవారం ఈ తనిఖీలు పూర్తయిన అనంతరం ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థల ఉన్నతాధికారులతో డీజీసీఏ అధికారులు భేటీ అయి సమీక్షించారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. "మన దేశ సంస్థల వద్ద ఉన్న మొత్తం 24 బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో కీలక భద్రతా తనిఖీలు నిర్వహించాం. ఈ అన్ని విమానాలు కూడా విమానయాన భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్టు గుర్తించాం" అని వెల్లడించారు.

రోబోలకూ స్పర్శ అనుభూతి!

- వేడి, నొప్పిని గుర్తించే రోబోటిక్ చర్మం
- కేంబ్రిడ్జ్ వర్సిటీ పరిశోధకుల ఆవిష్కరణ

వాషింగ్టన్, జూన్ 17: యంత్రాలకు సైతం చర్మాన్ని అమర్చి వాటికి మానవ రూపాన్ని ఇవ్వడమే కాకుండా అవికూడా స్పర్శను గుర్తించేలా.. అమెరికాలోని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ పరిశోధకులు విప్లవాత్మక ఆవిష్కరణకు శ్రీకారం చుట్టారు. వేడిని, నొప్పిని, ఒత్తిడిని సైతం ఫీలయ్యే సరికొత్త రోబోటిక్ చర్మాన్ని వారు సృష్టించారు. సౌకర్యవంతమైన, తక్కువ ధర కలిగిన జెల్ పదార్థంతో తయారు చేసిన ఈ చర్మం... రోబోటిక్ చేతిని సున్నితమైన, తెలివైన సెన్సర్‌గా మారుస్తుంది. విభిన్న సెన్సర్లతో కూడిన ప్యాచ్‌వర్క్‌పై ఆధారపడే ఇతర ఎలాక్ట్రానిక్ చర్మంలా కాకుండా.. ఈ పదార్థం ఒత్తిడి, ఉష్ణోగ్రత, నొప్పిని సైతం గుర్తించగలదు. కేంబ్రిడ్జి యూనివర్సిటీ, యూనివర్సిటీ కాలేజ్ లండన్ (యూసీఎల్)కు చెందిన పరిశోధకులు ఈ రోబోటిక్ స్కిన్‌ను అభివృద్ధి చేశారు. కరిగించే వీలున్న దీన్ని విభిన్న ఆకారాల్లో రూపొందించవచ్చు. రోబోల కాళ్లు, చేతులు, ముఖం.. ఇలా ఎక్కడ, ఏ ఆకారంలో కావాలన్నా సులువుగా తయారు చేసేలా దీన్ని అభివృద్ధి చేశారు. ఇది మానవ చర్మం అంత సున్నితమైనది కానప్పటికీ.. ఈ పదార్థంలో ఉండే 8.6లక్షల చిన్న చిన్న మార్గాల ద్వారా ఇది సంకేతాలను, వివిధ రకాల స్పర్శలను, ఒత్తిడిని గుర్తించగలదు. కత్తి గాటు వల్ల కలిగే బాధను, వేడి లేదా చల్లగా ఉన్న ఉపరితలాలను గుర్తించగలదు.

మావోయిస్టుల ఘాతుకం.. ముగ్గురి హత్య..12 మంది కిడ్నాప్

చర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్‌లో మావోయిస్టులు దుశ్చర్యలకు పాల్పడ్డారు. బీజాపూర్ జిల్లాలోని పెద్ద కుర్మ గ్రామానికి చెందిన చెందిన ముగ్గురు స్థానికులను మంగళవారం సాయంత్రం హత్యచేశారు. వీరిలో ఓ విద్యార్థిని కూడా ఉంది. హత్యలతో పాటు మావోయిస్టులు 12 మందిని కిడ్నాప్ చేశారు. మృతులంతా గతంలో లొంగిపోయిన గంగలూరు ఏరియా కమిటీ చెందిన డీవీసీఎం కమిటీ సభ్యుడు పొడియ దినేశ్ కుటుంబ సభ్యులుగా సమాచారం. ఈ ఏడాది మార్చి 4న బీజాపూర్ పోలీసులు ఎదుట దినేశ్ లొంగిపోయారు. ఆ తర్వాత గంగలూరు అడవుల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 26 మంది మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఘటనకు ప్రతీకారంగానే నక్సల్స్ బుధవారం హత్యలు, అపహరణలకు పాల్పడి ఉంటారని తెలుస్తోంది. బీజాపూర్ పోలీసులు మాత్రం ఈ ఘటనను ఇంకా ధ్రువీకరించలేదు.

ఎంఐటీ 'అధిపతి'గా చంద్రకాసన్

ప్రొవోస్ట్‌గా తొలి భారత-అమెరికన్.. జూలై 1న బాధ్యతల స్వీకారం



న్యూయార్క్, జూన్ 17: మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) 'ప్రొవోస్ట్' పదవికి ప్రొఫెసర్ అనంత చంద్రకాసన్ ఎంపికయ్యారు. ఎంఐటీకి అధిపతిగా పేర్కొనే ఆ పదవికి ఎంపికైన తొలి భారతీయ అమెరికన్‌గా ఆయన రికార్డులకెక్కారు. చెన్నైలో పుట్టిన చంద్రకాసన్ ప్రస్తుతం ఎంఐటీ చీఫ్ ఇన్నోవేషన్ అండ్ స్ట్రాటజీ ఆఫీసర్‌గా, ఇంజనీరింగ్ డీన్‌గా పనిచేస్తున్నారు. జూన్ 1 నుంచి ఆయన కొత్త బాధ్యతలు చేపట్టనున్నారు. ఎంఐటీ చీఫ్ అకడమిక్, బడ్జెట్ ఆఫీసర్‌ను ప్రొవోస్ట్‌గా వ్యవహరిస్తారు. ప్రొవోస్ట్‌కు విస్తృత అధికారాలు ఉంటాయి. ఫ్యాకల్టీకి సంబంధించిన అన్ని వ్యవహారాలతో పాటు విద్యా సంస్థ పర్యవేక్షణ వరకు అన్నీ ఆ అధిపతే చూసుకుంటారు. దీనితోపాటు ఎంఐటీ వ్యూహాత్మక ప్రణాళిక ఆయన ప్రధాన బాధ్యతగా ఉంటుంది. ఈ సందర్భంగా ఎంఐటీ ప్రెసిడెంట్ మాట్లాడుతూ.. అద్భుతమైన ప్రదర్శన కనబర్చిన సభ్యులలో నుంచి చంద్రకాసన్‌ను ఈ పోస్టుకు ఎంపిక చేశామన్నారు. చంద్రకాసన్ మాట్లాడుతూ.. ప్రొవోస్టు బాధ్యత తనకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. చంద్రకాసన్‌కు న్యూయార్క్‌లో భారత కాన్సులేట్ జనరల్ శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో చంద్రకాసన్ బీఎస్, ఎంఎస్, పీహెచ్‌డీని కాలిఫోర్నియా వర్సిటీలో పూర్తి చేశారు. ఎంఐటీలో ఫ్యాకల్టీగా చేరిన తర్వాత 2006లో మైక్రోసిస్టమ్స్ టెక్నాలజీ ల్యాబొరేటరీస్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. 2011లో ఈఈసీఎస్ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా, 2017లో స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్‌గా నియమితులయ్యారు. ఎంఐటీ చీఫ్ ఇన్నోవేషన్, స్ట్రాటజీకి తొలి ఆఫీసర్‌గా 2024లో నియామకయ్యారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

అభిమానుల గుండెల్లో ఎప్పటికీ ఎన్టీఆర్ ఉంటారు



నందమూరి రామకృష్ణ

నందమూరి తారకరామారావు సినీ వజ్రోత్సవ వేడుకలను విదేశాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ యూనివర్స్ సక్సెస్ సెలబ్రేషన్స్‌ను మంగళవారం హైదరాబాద్‌లో జరిపారు. ఈ కార్యక్రమంలో నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ "ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు అభిమానుల గుండెల్లో ఎన్టీఆర్ ఎప్పటికీ ఉంటారు. ఆయన ఆశయాలను, స్ఫూర్తిని ఇలాంటి కార్యక్రమాల ద్వారా మరింతగా ప్రజలకు చేరువ చేయాలి" అని అన్నారు. ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ అధ్యక్షుడు టీడీ జనార్దన్ మాట్లాడుతూ "ప్రపంచ సినీ చరిత్రలో ఎన్టీఆర్ వంటి గొప్ప నటుడు లేరు" అని చెప్పారు. నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ "నటుడిగా, ప్రజానాయకుడిగా ఎన్టీఆర్ జీవితం అందరికీ ఆదర్శం. ఈ సినీ వజ్రోత్సవం ఇంత వేడుకగా జరుగుతున్నందుకు ఆనందంగా ఉంది" అని తెలిపారు.

నాకు నటించడమే రాదన్నారు



'శతమానం భవతి', కార్తికేయ 2' లాంటి పలు సూపర్ హిట్ చిత్రాల్లో కథానాయికగా తెలుగు ప్రేక్షకులను అలరించారు అనుపమ పరమేశ్వరన్. ఆమె నటించిన 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' అనే మలయాళ చిత్రం ఈనెల 27న విడుదలవుతోంది. ఇందులో లాయర్‌గా సురేశ్ గోపీ నటించారు. ఈ సినిమా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న అనుపమ మాట్లాడుతూ 'నాకు నటన రాదంటూ చాలా మంది ట్రోల్ చేశారు. అయినా దర్శకుడు ప్రవీణ్ నాకు అవకాశం ఇచ్చారు. 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' వంటి గొప్ప చిత్రంలో ఎంపిక చేశారు. నాపై నమ్మకంతో ఇలాంటి పాత్రను ఇవ్వడమే నాకు దక్కిన విజయంగా భావిస్తున్నాను. ఇక నుంచి ప్రేక్షకులకు నచ్చే సినిమాలు మాత్రమే అంగీకరించాలని నిర్ణయించుకున్నా. కొవిడ్ సమయంలో నా కెరీర్ పరంగా, జీవితంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాను' అని చెప్పారు. కాగా, అనుపమ వ్యాఖ్యలపై సురేశ్ గోపీ స్పందించారు. ఒక నటిపై వివక్షను ప్రదర్శించడం మలయాళ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఇదే తొలిసారి కాదని అన్నారు. 'అనుపమ మాట్లాడిన మాటలు ఆమె హృదయాంతరాళం నుంచి వచ్చాయి. గతంలో నటి సమ్రాన్ విషయంలోనూ ఇదే విధంగా జరిగింది. మలయాళ చిత్రపరిశ్రమ ఆమెను చిన్నచూపు చూసి ఇండస్ట్రీ వదిలిపోయేలా చేసింది' అని అన్నారు.

మెగాస్టార్‌తో డ్యూయెట్



చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం (మెగా 157-వర్కింగ్ టైటిల్) షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఈ చిత్రంలో చిరంజీవికి జోడీగా నయనతార నటిస్తున్నారు. కొన్ని రోజుల క్రితమే ఉత్తరాఖండ్‌లోని మసూరీలో రెండో షెడ్యూల్ మొదలైంది. ఇందులో చిరంజీవి సహా ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. మంగళవారం నయనతార సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఈ షెడ్యూల్‌లో చిరంజీవి, నయనతారపై కీలక సన్నివేశాలతో పాటు ఓ పాటను చిత్రీకరించనున్నారు. దర్శకుడిగా వరుస విజయాలను అందుకుంటున్న అనిల్ రావిపూడి ప్రేమ, కుటుంబ విలువలతో హృద్యంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ఇందులో చిరంజీవి పాత్ర చిత్రణ నవ్యపంథాలో ఉంటుంది, ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది అని యూనిట్ తెలిపింది. షైన్‌స్క్రీన్స్, గోల్డ్‌బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సినిమాటోగ్రఫీ: సమీర్‌రెడ్డి

భయపడి అడుగు ఆపకే...



నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'తమ్ముడు'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. సప్తమి గౌడ కథానాయిక. జులై 4న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. మంగళవారం చిత్రబృందం 'ఆగకే అమ్మాడీ... భయపడి అడుగు ఆపకే' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది ఈ సందర్భంగా చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. లయ వర్ష బొల్లమ్మ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్

ఓ బలమైన స్త్రీ కథ



అనంతిక సునీల్ కుమార్ ప్రధాన పాత్రలో ఫణీంద్ర నర్సెట్టి తెరకెక్కించిన చిత్రం '8 వసంతాలు'. మైత్రి మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు ఫణీంద్ర మంగళవారం మీడియాతో చిత్ర విశేషాలు పంచుకున్నారు. "మను' సినిమా తర్వాత నాకు ఆరేళ్ల గ్యాప్ వచ్చింది. ఆ సమయంలో కొన్ని కథలపై వర్క్ చేశాను. అయితే '8 వసంతాలు' కథకు అధిక ప్రాధాన్యం ఇచ్చాను. ఒక బలమైన స్త్రీ పాత్ర చుట్టూ కథను చెప్పాలనిపించింది. మా అత్తయ్యలు, ఇంట్లో, చుట్టుపక్కల బలమైన వ్యక్తిత్వాలు ఉన్న స్త్రీల మధ్య పెరిగాను. నేను రాసుకున్న పాత్రకు అనంతిక సునీల్ కుమార్ కరెక్ట్ అనిపించింది. కేవలం నటిగానే కాదు. దాదాపు 13 కళల్లో ఆమెకు ప్రవేశం ఉంది. శుద్ధి అయోధ్య పాత్రకు న్యాయం చేసింది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా తన డిగ్నిటీ కోల్పోకుండా ఉండే అమ్మాయి కథ ఇది' అని వివరించారు.



సేతుపతితో సంయుక్త

విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ చిత్రం ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయన చార్మీ కౌర్‌తో కలసి నిర్మిస్తున్నారు. ఈ నెల చివరి వారంలో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించనున్నారు. ఈ చిత్రంలో టబు, దునియా విజయ్‌కుమార్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. తాజాగా చిత్రబృందం కథానాయిక పేరును ప్రకటించింది. విజయ్ సేతుపతికి జోడీగా సంయుక్త నటిస్తున్నట్లు తెలిపింది. 'మూస ధోరణిలో సాగే కథానాయికల పాత్రలకు భిన్నంగా ఇందులో సంయుక్త పాత్ర ఉంటుంది, నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలో ఆమె కనిపించనున్నారు, చిత్రీకరణలో పాల్గొనేందుకు సంయుక్త ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు' అని మేకర్స్ తెలిపారు.

ఇష్టం లేకుంటే సినిమా చూడకండి

- థగ్‌లైఫ్ వివాదంపై సుప్రీం కోర్ట్



కర్ణాటకలో 'థగ్ లైఫ్' సినిమా విడుదలకు సుప్రీం కోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కమల్ హాసన్ నటించిన 'థగ్ లైఫ్' సినిమా రిలీజ్‌ను కర్ణాటకలో నిషేధించడంపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం మంగళవారం విచారించింది. కమల్‌హాసన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే సినిమా విడుదలను అడ్డుకోవడం ఏమిటని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. సినిమాను విడుదల చేయొద్దని బెదిరించడం సరికాదని, ఇష్టం లేకుంటే సినిమాను చూడకండి అని సూచించింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) గుర్తింపు ఉన్న ఏ సినిమానైనా రాష్ట్ర ప్రభుత్వం విడుదలకు అనుమతించాలనే నిబంధన ఉందని న్యాయమూర్తులు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా కర్ణాటక ప్రభుత్వం సినిమాను ప్రదర్శించేలా చూడాలని సూచించింది. ప్రజలు సినిమా చూస్తారా, చూడరా అన్నది వేరే విషయమని అన్నారు. ప్రజలు సినిమాను తప్పనిసరిగా చూడాలని తాము ఆదేశాలు ఇవ్వడం లేదని, కానీ సినిమాను విడుదల చేయాల్సిందేనని ధర్మాసనం స్పష్టం చేసింది. కమల్ హాసన్ క్షమాపణలు చెప్పాలన్న కర్ణాటక హైకోర్టు ఆదేశాలపైనా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది కోర్టు పనికాదని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

బిజినెస్

ఎన్‌ఎస్‌ఈలో మంగళవారం..
బీఎస్‌ఈలో గురువారం



- ఈక్విటీ డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు రోజుల్లో మార్పులు
- ఆమోదం తెలిపిన సెబీ.. సెప్టెంబరు 1 నుంచి అమలు

న్యూఢిల్లీ: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ), బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బీఎస్ఈ)లో ఈక్విటీ డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు రోజులు మారబోతున్నాయి. ప్రస్తుతం ఎన్ఎస్ఈలో ఈ కాంట్రాక్టుల ముగింపు రోజు గురువారం కాగా, మంగళవారానికి మార్చేందుకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఆమోదం తెలిపింది. అలాగే, బీఎస్ఈలో ప్రస్తుతం ఈ కాంట్రాక్టుల ముగింపు రోజు మంగళవారం కాగా, గురువారానికి మారనుంది. 2025 సెప్టెంబరు 1న లేదా ఆ తర్వాత ముగియనున్న కొత్త ఈక్విటీ డెరివేటివ్ కాంట్రాక్టులన్నింటికీ ఈ మార్పు వర్తించనుంది. ఆగస్టు 31న లేదా అంతకంటే ముందు ముగియనున్న కాంట్రాక్టులకు మాత్రం ప్రస్తుత ముగింపు షెడ్యూలే వర్తిస్తుందని స్టాక్ ఎక్స్ఛేంజీలు స్పష్టం చేశాయి. వచ్చే నెల 1 నుంచి ఇండెక్స్ ఫ్యూచర్స్‌పై కొత్త వీక్లీ కాంట్రాక్టులను ప్రవేశపెట్టబోవడం లేదని బీఎస్ఈ వెల్లడించింది. అలాగే, ఇప్పటికే ప్రవేశపెట్టిన కాంట్రాక్టుల్లో లాంగ్ డేటెడ్ ఇండెక్స్ ఆప్షన్‌తో కూడిన వాటికి కూడా ప్రస్తుత షెడ్యూల్‌లో మార్పు ఉండదని ఎక్స్ఛేంజీలు తెలిపాయి. ముగింపు రోజుల్లో మార్పు ప్రక్రియ సాఫీగా జరిగేందుకు వీలుగా ఎక్స్ఛేంజీలు సమగ్ర వివరాలతో కూడిన సర్క్యులర్‌ను త్వరలోనే విడుదల చేయనున్నాయి. ఎక్స్ఛేంజీల్లో అన్ని ఈక్విటీ డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు రోజును మంగళవారం లేదా గురువారానికి పరిమితం చేయాలంటూ గత నెలలో సెబీ ఆదేశించింది. అలాగే, ఏదైనా కాంట్రాక్టును ప్రవేశపెట్టేటప్పుడు లేదా ముగింపు రోజును మార్చేటప్పుడు తన అనుమతి తీసుకోవాలని ఎక్స్ఛేంజీలను సెబీ కోరింది. ఆ ఆదేశాలకు అనుగుణంగా ఈక్విటీ డెరివేటివ్ కాంట్రాక్టు ముగింపు రోజుల్లో ఎక్స్ఛేంజీలు కోరిన మార్పులకు సెబీ తాజాగా ఆమోదం తెలిపింది.

టీసీఎస్‌లో కొత్త 'బెంచ్' రూల్స్

35 రోజులు మించితే ఉద్యోగానికే ఎసరు!

న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తన ఉద్యోగులకు కొత్త బెంచ్ రూల్స్ ప్రకటించింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం ఏ ఉద్యోగి ఇక ఏటా 35 రోజులకు మించి బెంచ్ మీద ఉండడాన్ని అనుమతించరు. ఈ నెల 12 నుంచే ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ప్రాజెక్టులు (పని) లేక ఉద్యోగులు ఖాళీగా ఉండడాన్ని ఐటీ కంపెనీల్లో 'బెంచ్' అంటారు. ప్రతి ఉద్యోగి ఏటా కనీసం 225 రోజుల పాటు తప్పనిసరిగా ఏదో ఒక ప్రాజెక్ట్ పనిలో నిమగ్నమై ఉండాలని టీసీఎస్ స్పష్టం చేసింది. ఏ ఉద్యోగి అయినా ఏటా 35 రోజులకు మించి బెంచ్ మీద ఉంటే.. అది వారి జీతం, ప్రమోషన్లు, విదేశాలకు పంపే అవకాశాలు కోల్పోవడంతో పాటు ఉద్యోగానికి కూడా ముప్పు తెచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది. బెంచ్ సమయంలో ఉద్యోగులే చొరవ తీసుకుని కంపెనీకి చెందిన వేరే ప్రాజెక్టుల్లో పని వెతుక్కోవాలని స్పష్టం చేసింది.



మారుతి సుజుకీ ఇండియా.. మార్కెట్లోకి సరికొత్త గ్రాండ్ విటారా ఎస్-సీఎన్‌జీ విడుదల చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.13.48 లక్షలు నెక్స్ట్ జెన్ కే-సిరీస్, 1.5 లీటర్ ఇంజన్, డ్యూయల్ జెట్, ఆర్ 17 అల్లాయ్ వీల్స్, ఆరు ఎయిర్ బ్యాగ్స్‌తో దీన్ని తీసుకువచ్చింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	515
వరంగల్	512	గోదావరి	505
చిత్తూరు	583	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్




హైదరాబాద్	91	విజయవాడ	95
వరంగల్	91	గుంటూరు	100
కరీంనగర్	91	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	91	చిత్తూరు	92
కర్నూలు	91	నెల్లూరు	97
విశాఖపట్నం	85	అనంతపురం	97
గోదావరి	95		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,00,370 ▼	92,000 ▼	1,20,000 ▲
విజయవాడ	1,00,000 ▼	94,000 ▼	1,10,000 ▲
విశాఖపట్నం	1,02,030 ▲	92,000 ▼	1,20,000 ▲
రాజమండ్రి	1,00,360 ▼	92,000 ▼	1,09,700 ▲
ప్రొద్దుటూరు	98,100 ▼	90,250 ▼	1,06,000 ▲
ముంబై	99,147 ▼	90,819 ▼	1,09,100 ▲

మార్కెట్లో లాభాల స్వీకరణ



- 212 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్
- రూ.2.61 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగ షేర్లలో ఇన్వెస్టర్లు లాభాలు స్వీకరించడంతో మంగళవారం సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో ముగిశాయి. ఒక దశలో 369 పాయింట్లకు పైగా పతనమైన సెన్సెక్స్.. చివరికి 212.85 పాయింట్ల నష్టంతో 81,583.30 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 93.10 పాయింట్లు కోల్పోయి 24,853.40 వద్ద క్లోజైంది. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు మళ్లీ కాస్త ఎగబాకడంతో పాటు ఈ వారంలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లపై తన నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో ట్రేడర్లు ముందు జాగ్రత్త ధోరణితో వ్యవహరించారని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి.

అలాగే, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫార్మాస్యూటికల్స్, సెమీకండక్టర్లపై త్వరలోనే సుంకాలను ప్రకటించనున్నారన్న వార్తలతో ఔషధ కంపెనీల షేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 21 నష్టాలు చవిచూడగా.. సన్‌ఫార్మా షేరు 2.18 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. బీఎస్ఈలోని స్మాల్ క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.67 శాతం వరకు నష్టపోయాయి.

ఫండ్ల నిర్వహణలోని ఆస్తులు.. తెలంగాణలో 32 శాతం వృద్ధి

గత నెలతో ముగిసిన ఏడాది కాలంలో మ్యూచువల్ ఫండ్ పథకాల్లోని తెలంగాణ ఇన్వెస్టర్ల ఆస్తులు 32.08 శాతం పెరిగాయని మోతీలాల్ ఓస్వాల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ తెలిపింది. ఫండ్ల నిర్వహణలోని వీరి సగటు ఆస్తులు 2024 మే నాటికి రూ.93,601.95 కోట్లుగా ఉండగా.. 2025 మే నాటికి రూ.1,23,633.60 కోట్లకు పెరిగాయి. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) డేటా ఆధారంగా విశ్లేషించి మోతీలాల్ ఓస్వాల్ ఈ డేటాను విడుదల చేసింది.

స్టాక్ మార్కెట్ విశ్లేషకులు సంజీవ్ భాసిన్‌పై సెబీ షేధం

మీడియా చానెళ్లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా షేర్లను సిఫారసు చేసే మార్కెట్ నిపుణుడు, ఐఐఎఫ్ఎల్ మాజీ డైరెక్టర్ సంజీవ్ భాసిన్‌తో పాటు 11 మందిని సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి నిషేధిస్తూ సెబీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. స్టాక్ రికమండేషన్లలో భాగంగా కొన్ని కంపెనీల షేర్ల ధరలను కృత్రిమంగా పెంచేందుకు సాయపడ్డారన్న ఆరోపణలకు సంబంధించిన కేసులో సెబీ ఈ చర్యలు చేపట్టింది. ఈ ప్రక్రియ ద్వారా అయాచితంగా లబ్ధి పొందిన రూ.11.37 కోట్లను తమ వద్ద జమ చేయాలని నియంత్రణ మండలి వారిని ఆదేశించింది.

నేడు సెబీ బోర్డు భేటీ

సెబీ బోర్డు బుధవారం సమావేశం కానుంది. ఈ భేటీలో భాగంగా నియంత్రణపరంగా పలు సంస్కరణలపై చర్చించి నిర్ణయం తీసుకోనుంది. సెబీ ఛైర్మన్‌గా తుహిన్ కాంత పాండే ఈ మార్చి 1న బాధ్యతలు చేపట్టాక జరగనున్న రెండో బోర్డు సమావేశం ఇది.

హైదరాబాద్ టు అడిస్ అబాబా



విమాన సర్వీస్ ప్రారంభించిన ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్

మెడికల్ టూరిజానికి ఊతం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్.. హైదరాబాద్ నుంచి అడిస్ అబాబాకు నేరుగా విమాన సర్వీస్‌ను ప్రారంభించింది. మంగళవారం నుంచి ఈ డైరెక్ట్ విమాన సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ (ఇంటర్నేషనల్ సర్వీసెస్) టెక్లెహమ్మన్నోత్ జీ యోహన్నెస్ తెలిపారు. హైదరాబాద్ నుంచి వారానికి మూడు సార్లు (సోమ, బుధ, శనివారం), అడిస్ అబాబా నుంచి మంగళ, గురు, శని వారాల్లో ఈ విమాన సర్వీస్‌ను నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ఇథియోపియా ఎయిర్‌లైన్స్ ఇప్పటికే భారత్‌లోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, అహ్మదాబాద్, చెన్నై నగరాల నుంచి వారానికి 50 ప్రయాణికుల, కార్గో విమాన సర్వీసులను నిర్వహిస్తోందన్నారు.

వృద్ధికి అపార అవకాశాలు: భారత్‌లో మెడికల్ టూరిజం శరవేగంగా వృద్ధి చెందుతూ వస్తుండటం ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్‌కు ఎంతగానో కలిసిరానుందని యోహన్నెస్ తెలిపారు. ఇందుకు తగ్గట్టుగానే హైదరాబాద్‌లోని హాస్పిటల్స్‌కు ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే రోగులకు ప్రత్యేక సేవలను అందించాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇందుకోసం ప్రధాన హాస్పిటల్స్‌తో ఇప్పటికే చర్చలు సాగిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే మెడికల్ టూరిజం ప్యాకేజీ పేరుతో ప్రత్యేక సేవలను అందుబాటులోకి తీసుకురావాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. దీంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని భావిస్తున్నట్లు యోహన్నెస్ తెలిపారు. కాగా హైదరాబాద్ నుంచి పూర్తి స్థాయిలో కార్గో సేవలను ప్రారంభించాలని చూస్తున్నామన్నారు. కొవిడ్ సమయంలో పాక్షికంగా ఫార్మా ఉత్పత్తులను రవాణా చేసినట్లు వివరించారు. రానున్న రోజుల్లో ఫార్మా సహా ఐటీ సంబంధిత ఎగుమతి సేవలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నామన్నారు.

- భారత్‌లో తొలి హైస్పీడ్ రైలు ప్రాజెక్టుకు సంబంధించి రూ.4,100 కోట్ల విలువైన కాంట్రాక్ట్‌ను సీమెన్స్ కన్సార్షియం చేజిక్కించుకుంది. నేషనల్ హై స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్) నుంచి సీమెన్స్ ఈ ఆర్డర్‌ను దక్కించుకుంది. కాంట్రాక్ట్‌లో భాగంగా అత్యాధునిక సిగ్నలింగ్, ట్రైన్ కంట్రోల్, టెలికమ్యూనికేషన్ వ్యవస్థ రూపకల్పన, స్థాపనతో పాటు 15 ఏళ్ల పాటు నిర్వహణా సేవలను సీమెన్స్ అందించాల్సి ఉంటుంది. యూరోపియన్ ట్రైన్ కంట్రోల్ సిస్టమ్ (ఈటీసీఎస్) లెవెల్-2 ఆధారిత సిగ్నలింగ్, ట్రైన్ కంట్రోల్ టెక్నాలజీలను ఈ ప్రాజెక్టులో అమలు చేయనున్నట్లు సీమెన్స్ ఇండియా ఎండీ, సీఈఓ సునిల్ మాథుర్ తెలిపారు.
- రామ్ ఇన్ఫో లిమిటెడ్.. రాజస్థాన్ రెన్యువబుల్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్ (ఆర్ఆర్ఈసీఎల్) నుంచి రూ.474 కోట్ల విలువైన కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. ఆర్డర్‌లో భాగంగా రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వ భవనాలు, ఇతర ప్రభుత్వ అనుబంధ కార్యాలయాల్లో రూఫ్‌టాప్ సోలార్ ఫోటో వోల్టాయిక్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. ఈ కాంట్రాక్ట్ కాలపరిమితి 25 సంవత్సరాలు.
- డిజిటల్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రా వెబ్ 3 సంస్థ స్ట్రింగ్ మెటావర్స్.. కెనడాకు చెందిన ఫిన్‌ట్రాక్ నుంచి ఫిన్‌టెక్ లైసెన్స్‌ను అందుకుంది. స్ట్రింగ్‌పేఎక్స్ పేరుతో వ్యూహాత్మకంగా కంపెనీని రీబ్రాండింగ్ చేయనుంది. కాగా ఇందుకు సంబంధించి వచ్చే రెండు నెలల్లో అన్ని నియంత్రణా పరమైన అనుమతులు అందుకుని అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు ప్రకటించింది.
- మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ కేబీసీ గ్లోబల్ లిమిటెడ్.. పునరుత్పాదక ఇంధన విభాగంలోకి ప్రవేశించింది. ధరణి ఇన్‌ఫ్రా సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఈ విభాగంలోకి అడుగుపెట్టింది. పునరుత్పాదక ఇంధన మాడ్యుల్స్, ఉపకరణాల తయారీ, డిజైన్, అభివృద్ధి వంటి వాటిని ఈ కంపెనీ చేపట్టనుంది.

అందుకే కెప్టెన్సీ వద్దన్నా..



లండన్: రోహిత్ శర్మ రిటైర్మెంట్‌తో భారత టెస్టు జట్టు పగ్గాలు వైస్‌కెప్టెన్‌గా ఉన్న జస్‌ప్రీత్ బుమ్రాకు అప్పగిస్తారని చాలామంది భావించారు. అయితే సెలెక్టర్లు మాత్రం అనూహ్యంగా శుభ్‌మన్ గిల్‌ను ఎంపిక చేశారు. దీంతో బుమ్రాను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదన్న చర్చ మొదలైంది. అయితే పనిఒత్తిడిని తగ్గించుకునేందుకే తాను ఆ బాధ్యతలను వద్దన్నట్టు బుమ్రా చెప్పాడు. 'రోహిత్, విరాట్‌ల రిటైర్మెంట్‌కు ముందే.. ఐపీఎల్ జరుగుతున్నప్పుడే నేను బీసీసీఐతో మాట్లాడా. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో నాపై ఉండే వర్క్‌లోడ్ గురించి వారితో చర్చించా. అలాగే నాకు చికిత్స చేస్తున్న వైద్యుల సలహాలు కూడా తీసుకున్నా. వాస్తవానికి బోర్డు నన్ను కెప్టెన్‌గా చేసేందుకు సిద్ధపడింది. కానీ నేను సిరీస్ మొత్తం ఆడలేను. అలాంటప్పుడు ఒకే సిరీస్‌కు ఇద్దరు కెప్టెన్లు ఉండడం సరికాదు. అందుకే నేనే స్వయంగా ఫోన్ చేసి నాయకత్వ బాధ్యతలు వద్దని చెప్పా. నాకు కెప్టెన్సీ కన్నా క్రికెట్టే ఎక్కువ. ఓ ఆటగాడిగా మరింత సేవ చేసేందుకు ప్రయత్నిస్తాను' అని ఓ ఇంటర్వ్యూలో బుమ్రా వివరించాడు.

వైభవ్ ఫ్రెండ్.. అయాన్ దుమ్మురేపాడు





ముజఫర్‌పూర్ (బిహార్): ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ స్ఫూర్తితో బిహార్‌కే చెందిన మరో చిచ్చరపిడుగు అయాన్ రాజ్ ట్రిపుల్ సెంచరీతో దుమ్మురేపాడు. డిస్ట్రిక్ క్రికెట్ మ్యాచ్‌లో సంస్కృతి క్రికెట్ అకాడమీ తరపున 13 ఏళ్ల అయాన్ కేవలం 134 బంతుల్లో 327 పరుగులు సాధించాడు. అందులో 22 సిక్సర్లు, 41 ఫోర్లు ఉన్నాయి. అయాన్, వైభవ్ మంచి స్నేహితులు. వీరిద్దరూ కలిసి ప్రాక్టీస్ కూడా చేసేవారు. 'వైభవ్ ఎంతో ఎత్తుకు ఎదిగాడు. అతడి బాటలోనే నేనూ నడుస్తున్నా'నని అయాన్ చెప్పాడు. రాజ్ తండ్రి కూడా క్రికెటర్ కావడం విశేషం.

స్పోర్ట్స్

టీమిండియా రైలెక్కింది..

లీడ్స్: భారత క్రికెట్ జట్టు తొలి టెస్టు కోసం రైలు మార్గంలో లండన్ నుంచి లీడ్స్‌కు చేరుకొంది. మామూలుగా టీమిండియా ఎక్కడ దిగినా అభిమానులు భారీ సంఖ్యలో అభివాదం చేస్తూ కనిపిస్తుంటారు. అయితే లీడ్స్‌లో మాత్రం పట్టుమని పదిమంది ఫ్యాన్స్ కూడా కనిపించలేదు. బెకెన్‌హామ్‌ను బేస్‌గా చేసుకొన్న టీమిండియా.. భారత్-ఎతో ప్రాక్టీస్ మ్యాచ్ ఆడింది. కాగా, పేసర్ హర్షిత్ రాణాకు భారత జట్టులో చోటుదక్కింది. దీంతో అతడు జట్టుతో కలిసి లీడ్స్‌కు చేరుకొన్నాడు. తొలుత ప్రకటించిన టీమ్‌లో రాణాకు చాన్స్ లభించలేదు. కానీ, భారత్-ఎ తరపున ఆడేందుకు అతడు ఇంగ్లండ్ వెళ్లాడు. అయితే, మరో పేసర్‌కు కవర్‌గా రాణాను అక్కడే ఉండిపొమ్మన్నట్టు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో రాణా టెస్టుల్లో అరంగేట్రం చేశాడు.

రోహిత్+విరాట్=గిల్





లండన్: భారత టెస్టు జట్టు కొత్త సారథి శుభ్‌మన్ గిల్‌పై ఇంగ్లండ్ స్టార్ ప్లేయర్ జోస్ బట్లర్ ప్రశంసల జల్లు కురిపించాడు. ఈ యువ ఆటగాడి నాయకత్వం స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కెప్టెన్సీల మిశ్రమంగా ఉంటుందని అన్నాడు. 'గిల్ ప్రతిభావంతుడు. మాట్లాడే సమయంలో ప్రశాంతంగా, కచ్చితత్వంతో ఉంటాడు. కానీ మైదానంలో కాస్త దూకుడు కనిపిస్తుంటుంది. ఇది తమ మాజీ కెప్టెన్లు రోహిత్, విరాట్‌ల మాదిరిగానే ఉంటుంది. అందుకే ఆ ఇద్దరి వ్యవహారశైలి కలిస్తే గిల్ అని నేను భావిస్తాను. తను కూడా వారి నుంచి ఎంతో నేర్చుకున్నాడు. కానీ ఆటపై తన సొంత ముద్ర కూడా ఉంటుంది. క్రీజులో ఉండే సమయంలో గిల్ కేవలం బ్యాటర్‌గానే ఆలోచిస్తాడు. ఆ తర్వాత మాత్రం కెప్టెన్సీపై దృష్టి సారించాలనుకుంటాడు. ఇలా రెండు పాత్రలకు న్యాయం చేయాలని ప్రయత్నిస్తాడు' అని బట్లర్ వివరించాడు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ కెప్టెన్‌గా ఉన్న గిల్ ఆధ్వర్యంలోనే బట్లర్ ఆడుతున్న విషయం తెలిసిందే. కాగా ఈ సిరీస్‌లో ఇంగ్లండ్‌నే విజయం వరిస్తుందని ఆ దేశ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ అభిప్రాయపడ్డాడు.

అతను నాకంటే 20 ఏళ్లు చిన్నోడు

ఐపీఎల్‌లో 35 బంతుల్లోనే సెంచరీ చేసిన 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఓ ప్రత్యేక ఆటగాడని బట్లర్ తెలిపాడు. 'రాజస్థాన్ తరపున అతడు మా జట్టుపైనే చెలరేగి లీగ్‌లో రెండో ఫాస్టెస్ట్ శతకం సాధించాడు. అతడి ఆట స్ఫూర్తిదాయకంగానే కాకుండా చూసేందుకు ఉల్లాసంగా ఉంటుంది. తను నాకంటే 20 ఏళ్లు చిన్నవాడు. అలాంటి వ్యక్తి మైదానం నలువైపులా భారీ షాట్లతో హోరెత్తించాడు. నేను చూసిన ఆటగాళ్లలో అతడే అత్యుత్తమం అనిపించాడు. ఆ తర్వాత సీఎస్‌కే పైనా ఎలాంటి జంకు లేకుండా జడేజా, అశ్విన్ ఓవర్లలో సిక్సర్లు బాదాడు' అని బట్లర్ గుర్తుచేశాడు.

మళ్లీ అగ్రపీఠంపై మంధాన




ఆరేళ్ల తర్వాత టాప్‌లోకి

దుబాయ్: ఐసీసీ మహిళల వ్యక్తిగత వన్డే ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ స్మృతి మంధాన ఆరేళ్ల తర్వాత తిరిగి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. మంగళవారం విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో స్మృతి 727 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. ఇటీవల ముగిసిన ముక్కోణపు సిరీస్‌లో 52 సగటుతో 264 పరుగులు సాధించడంతో ఆమె ర్యాంక్ మెరుగుపడింది. బ్రంట్ (ఇంగ్లండ్), లారా వోల్వార్ట్ (దక్షిణాఫ్రికా) 2, 3 ర్యాంకుల్లో ఉన్నారు. బౌలర్ల జాబితాలో ఎకెల్‌స్టోన్ (ఇంగ్లండ్), గార్డ్‌నర్ (ఆస్ట్రేలియా), మేగాన్ (ఆస్ట్రేలియా), దీప్తి శర్మ (భారత్) తొలి నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నారు.

సిరీస్ నెగ్గిన సారథికి పటౌడీ మెడల్

న్యూఢిల్లీ: ఇంగ్లండ్-భారత్ టెస్ట్ సిరీస్‌లో ఏదో విధంగా పటౌడీ పేరు వినిపించాలన్న బీసీసీఐ, సచిన్ టెండూల్కర్‌ల విజ్ఞప్తికి ఇంగ్లండ్ బోర్డు స్పందించింది. సిరీస్ విజేతగా నిలిచిన కెప్టెన్‌కు పటౌడీ మెడల్‌ను బహూకరించనున్నట్టు ఈసీబీ తెలిపింది. ఈసీబీ భారత్-ఇంగ్లండ్ సిరీస్‌కు పటౌడీ పేరును తొలగించి దానికి అండర్సన్-టెండూల్కర్ పేరు పెట్టింది. దీంతో ఎలాగైనా పటౌడీ పేరు నిలిచి ఉండేలా చూడాలని సచిన్ విజ్ఞప్తి చేశాడు.

మొదలైంది... డబ్ల్యూటీసీ రేసు



18 టెస్టులు ఆడనున్న భారత్

2025-2027 షెడ్యూల్


దుబాయ్: రాబోయే రెండేళ్ల కోసం సరికొత్త వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) సైకిల్ మంగళవారం నుంచి ఆరంభమైంది. ఇందులో భాగంగానే శ్రీలంక-బంగ్లాదేశ్ జట్ల మధ్య తొలి టెస్టు జరుగుతోంది. ఇటీవల లార్డ్స్ మైదానంలో ఆస్ట్రేలియాను నాలుగు రోజుల్లోనే మట్టి కరిపించి దక్షిణాఫ్రికా తొలిసారి వరల్డ్ టెస్టు చాంపియన్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఆ పోరుతో 2023-2025 డబ్ల్యూటీసీ సీజన్ ముగిసింది. ఇక నాలుగో ఎడిషన్ కోసం మొత్తం తొమ్మిది జట్లు (భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇంగ్లండ్, పాకిస్థాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, బంగ్లాదేశ్, వెస్టిండీస్) పోటీపడుతున్నాయి. మరోవైపు అఫ్ఘానిస్థాన్, ఐర్లాండ్, జింబాబ్వే జట్లు ఆడే టెస్టులు మాత్రం డబ్ల్యూటీసీ కిందికి రావు.

ప్రతీ జట్టుకు ఆరు సిరీస్‌లు: డబ్ల్యూటీసీలో ప్రతీ జట్టు ఇంటా, బయటా కలిపి ఆరు సిరీస్‌లు ఆడుతుంది. ప్రతీ సిరీస్ కూడా రెండు నుంచి ఐదు టెస్టుల మధ్య ఉంటుంది. విజయాల ద్వారా గెలుచుకున్న పాయింట్లను బట్టి మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఫైనల్ జరుగుతుంది. మొత్తంగా రెండేళ్లలో ఈ తొమ్మిది జట్లు 27 సిరీస్‌ల్లో తలపడతాయి. ఇంగ్లండ్ అత్యధికంగా 21 మ్యాచ్‌లు ఆడనుండగా.. ఆ తర్వాత ఆసీస్ (20), ఇండియా (18) ఉన్నాయి. ఇందులో గిల్ సేన స్వదేశంలో తొమ్మిది టెస్టులు మాత్రమే ఆడనుంది.

భారత డబ్ల్యూటీసీ షెడ్యూల్

తేదీ	ప్రత్యర్థి	సిరీస్	ఎక్కడ
జూన్-ఆగస్టు 2025	ఇంగ్లండ్	5 టెస్టులు	ఇంగ్లండ్‌లో
అక్టోబరు 2025	వెస్టిండీస్	2 టెస్టులు	భారత్‌లో
నవంబరు 2025	దక్షిణాఫ్రికా	2 టెస్టులు	భారత్‌లో
ఆగస్టు 2026	శ్రీలంక	2 టెస్టులు	శ్రీలంకలో
అక్టోబరు 2026	న్యూజిలాండ్	2 టెస్టులు	కివీస్‌లో
జనవరి 2027	ఆస్ట్రేలియా	5 టెస్టులు	భారత్‌లో

నాలుగు రోజుల టెస్ట్‌లకు ఐసీసీ ఓకే.. కానీ!



లండన్: నాలుగు రోజుల టెస్ట్‌లకు ఐసీసీ సుముఖత వ్యక్తం చేసిందని సమాచారం. అయితే, చిన్న జట్లకు మాత్రమే ఇది వర్తించనుంది. 2027-29 వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) సీజన్‌లో చిన్న దేశాలు ఎక్కువ టెస్ట్‌లు ఆడేందుకు అనుగుణంగా టెస్టు ఫార్మాట్‌లో ఓ రోజును తగ్గించనున్నారు. కానీ, భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా లాంటి పెద్ద జట్లు సంప్రదాయ రీతిలో ఐదు రోజుల ఫార్మాట్‌లోనే ఆడాల్సి ఉంటుంది. ద్వైపాక్షిక సిరీస్‌లో భాగంగా నాలుగు రోజుల టెస్ట్‌లకు ఐసీసీ 2017లోనే అనుమతించింది. 'ఐదు రోజులపాటు మ్యాచ్‌ను నిర్వహించడం చిన్నజట్లకు భారంగా మారింది. ఖర్చు పెరుగుతుండడంతో ఆయా జట్లు అనాసక్తిని ప్రదర్శిస్తున్నాయి. కొత్త ఫార్మాట్‌లో అయితే వేగంగా సిరీస్ ముగిసే అవకాశాలుంటాయ'ని ఐసీసీ వర్గాలు తెలిపాయి. కాగా, 2025-27 డబ్ల్యూటీసీ సైకిల్‌లో మాత్రం ఐదు రోజుల మ్యాచ్‌లే జరగనున్నాయి.

3 సూపర్ ఓవర్లతో రికార్డు

నేపాల్-నెదర్లాండ్స్ టీ20 మ్యాచ్



గ్లాస్గో: క్రికెట్ మ్యాచ్‌ల్లో స్కోర్లు సమం కావడం అరుదుగా చోటు చేసుకుంటుంది. అలాంటి వేళ విజేతను తేల్చేందుకు సూపర్ ఓవర్‌ను నిర్వహిస్తుంటారు. అలాగే సోమవారం రాత్రి నేపాల్-నెదర్లాండ్స్ మధ్య జరిగిన టీ20 మ్యాచ్ కూడా టై అయ్యింది. అయితే ఇక్కడ ఫలితం తేలేందుకు ఒక్క సూపర్ ఓవర్ సరిపోలేదు. ఏకంగా మూడుసార్లు ఇరు జట్లు బరిలోకి దిగాల్సి వచ్చింది. ఇప్పటి వరకు టీ20 లేక లిస్ట్ 'ఎ' మ్యాచ్‌ల్లో ఇలా జరగడం ఇదే తొలిసారి. ముందుగా నెదర్లాండ్స్ 20 ఓవర్లలో 152/7 స్కోరు చేసింది. ఛేదనలో నేపాల్ చివరి ఓవర్‌లో రెండు ఫోర్లతో సరిగ్గా 152/8 స్కోరే చేసింది. దీనికి తోడు రెండు జట్లు కూడా తొలి సూపర్ ఓవర్‌లో 19, రెండో సూపర్ ఓవర్‌లో 17 పరుగులు సాధించడంతో మూడోసారి అనివార్యమైంది. అందులో నేపాల్ పరుగులేమీ చేయకుండా 4 బంతుల్లో 2 వికెట్లు కోల్పోగా.. నెదర్లాండ్స్ ఓ సిక్సర్‌తో మ్యాచ్‌ను విజయంతో ముగించింది.

విరాట్ ఇంటికి గిల్, పంత్

లండన్: భారత జట్టులోని కొందరు సభ్యులను టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ లండన్‌లోని తన ఇంటికి ఆహ్వానించాడు. కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్‌తోపాటు మహ్మద్ సిరాజ్ వారిలో ఉన్నారు. ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్ తర్వాత విశ్రాంతి రోజైన సోమవారం ఈ క్రికెటర్లు దాదాపు రెండు గంటలపాటు కోహ్లీ ఇంట్లో గడిపారు. టెస్టులకు ఇటీవలే రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్ యూకేలో సేదదీరుతున్నాడు. ఐదు టెస్టుల సిరీస్ కోసం ఇంగ్లండ్‌లో భారత జట్టు పర్యటిస్తున్న సంగతి తెలిసిందే.

నజ్ముల్, ముష్ఫికర్ శతకాలు

- బంగ్లా 292/3
- లంకతో తొలి టెస్ట్

గాలె: నజ్ముల్ హొస్సేన్ షంటో (136 బ్యాటింగ్), ముష్ఫికర్ రహీమ్ (105 బ్యాటింగ్) శతకాలతో అదరగొట్టడంతో బంగ్లాదేశ్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా శ్రీలంకతో మంగళవారం ఆరంభమైన తొలి టెస్ట్‌లో బంగ్లా మొదటి ఇన్నింగ్స్‌లో 292/3 స్కోరు చేసింది. తొలుత బంగ్లా 45 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో షంటో, రహీమ్ నాలుగో వికెట్‌కు అజేయంగా 247 పరుగులు చేసి ఆదుకొన్నారు. లంక మాజీ కెప్టెన్ ఏంజెలో మాథ్యూస్‌కు ఇదే చివరి టెస్ట్. మ్యాచ్ ఆరంభానికి ముందు మాథ్యూస్‌కు ఆటగాళ్లు గార్డ్ ఆఫ్ ఆనర్ ఇచ్చారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల వల్లే దీనంగా మెడికల్ కాలేజీలు

» కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం



న్యూఢిల్లీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని వైద్య కళాశాలల దీనస్థితికి గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి రూ.10 లక్షల కోట్లు అప్పు చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. మెడికల్ కాలేజీల్లో కనీస వసతులు కల్పించక పోవడం సిగ్గుచేటని అభివర్ణించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కనీస వసతులు కల్పించకుండా మోసగించగా, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య కళాశాలలకు కనీసం కొత్త కుర్చీలు, బెంచీలు కూడా సమకూర్చలేదని ఆయన ఎద్దేవా చేశారు. మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలం కావడం వల్ల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని ఆరోగ్యం, విద్యా రంగాలు పతనావస్థకు చేరుకున్నాయని మంగళవారం ఓ ప్రకటనలో విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిని సందర్శించిన నేపథ్యంలో కిషన్ రెడ్డి ప్రకటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

ఆటో డ్రైవర్లకు ఈఎస్ఐ అమలు చేయాలి:జేఏసీ

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆటో, ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లకు తక్షణం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని తెలంగాణ ఆటో అండ్ ప్రైవేటు ట్రాన్స్ పోర్టు యూనియన్ జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదర్‌గూడలో యూనియన్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ రవిశంకర్ మీడియాతో మాట్లాడుతూ.. ఉన్న ఆటోలకు గిరాకీ లేక ఇబ్బందులు పడుతుంటే కొత్త ఆటోలకు పర్మిట్లు ఇచ్చి అక్రమ దందాకు తెరలేపిందని విమర్శించారు. ముందు, ఎన్నికల్లో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్యశ్రీ బకాయిలను విడుదల చేయాలి: బీజేపీ

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ బకాయిలను తక్షణం విడుదల చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దమొత్తంలో బకాయిలు ఉన్నాయంటూ ఆరోగ్య శ్రీ కార్డులను ప్రైవేటు ఆసుపత్రులు అనుమతించడం లేదని తెలిపారు. విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంటు బకాయిల చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను గాలికి వదిలేసిందని విమర్శించారు.

నేటి నుంచి బీజేపీ వికసిత్ సంకల్ప్ సభలు

» మూడు రోజుల పాటు కొనసాగుతాయి: ప్రేమేందర్ రెడ్డి

ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారం కోసం బుధవారం నుంచి వికసిత్ సంకల్ప్ సభలు నిర్వహించనుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం ప్రారంభమై మూడు రోజుల పాటు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఈ సభలు కొనసాగుతాయని చెప్పారు. ఒక్కో నియోజకవర్గంలో ఏర్పాటు చేసే కార్యక్రమాలకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు హాజరవుతారని ప్రేమేందర్ రెడ్డి పేర్కొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు అందించండి

» తుమ్మలకు హర్షవర్ధన్ రెడ్డి వినతి

» రేవంత్.. తెలంగాణ ఫార్మర్స్ చాంపియన్: మేడిపల్లి సత్యం

» తపస్సు చేసినా కేటీఆర్ సీఎం కాలేడు: పటేల్ రమేష్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసాతో పాటుగా స్ప్రేయర్లు, టార్పాలిన్లు, రోటవేటర్లు వంటి వ్యవసాయ యంత్రాలు, డ్రిప్ పరికరాలను సబ్సిడీపై అందించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వేరుసెనగ పండించే రైతులు ఎక్కువగా ఉన్నందున.. వారికి సబ్సిడీపై స్ప్రింక్లర్లు అందించాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో తుమ్మలను కలిసిన ఆయన.. ఈమేరకు విజ్ఞప్తి చేశారు. కాగా 'సీఎం రేవంత్‌రెడ్డి.. ఛాంపియన్ ఆఫ్ తెలంగాణ ఫార్మర్స్' అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కొనియాడారు. రైతు భరోసా నిధుల విడుదలకు సంబంధించి గొప్ప నిర్ణయం తీసుకున్నందుకు ఆయనకు రైతుల తరఫున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుకొంటున్నామన్నారు. ఎమ్మెల్యే పరిగి రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు రూ. లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసిందన్నారు. కాగా జైలుకు వెళితే సీఎం అవుతానన్న భ్రమల్లో ఉన్న కేటీఆర్.. పదే పదే జైలు ఆలోచన చేస్తున్నాడని, ఆయన జైలుకు వెళ్లినా.. తలకిందులుగా తపస్సు చేసినా సీఎం కాలేడని కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు.

రజక, క్షౌర వృత్తిదారుల ఉచిత విద్యుత్ పెండింగ్ బిల్లులివ్వాలి

» సమస్యలను సర్కారు దృష్టికి తీసుకెళ్తాం

» సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని, ఎమ్మెల్సీ కోదండరాం హామీ

కవాడిగూడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రజకులు, క్షౌర వృత్తిదారుల ఉచిత విద్యుత్ పథకం పెండింగ్ బిల్లులు ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. రజకులు, క్షౌర వృత్తిదారుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రజక, క్షౌర వృత్తిదారుల ఉచిత విద్యుత్ పథకం పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇందిరా పార్కులోని ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో కూనంనేని సాంబశివరావు, కోదండరాం, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. జీవో నంబర్2 ద్వారా 250 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంలో 1,12,586 మంది రజక, క్షౌర వృత్తిదారులు ఉపాధి పొందుతున్నారని, కానీ, గత ఏడాదిన్నరగా ఈ పథకం బిల్లులు విడుదల కాక వారు ఇబ్బందుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై రాబోయే అసెంబ్లీ, శాసనమండలి సమావేశాల్లో ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వంతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పీఈసెట్ ఫలితాల్లో 95శాతం ఉత్తీర్ణత

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వ్యాయామ కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన పీఈసెట్ ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. తెలంగాణ ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి, పీఈసెట్ కన్వీనర్ ఆచార్య ఎస్ఎస్ దిలీప్ ఫలితాలను విడుదల చేశారు. బీపీఈడీ, డీపీఈడీ పరీక్షలకు మొత్తం 1,767 మంది హాజరవగా 1,678 (95%) మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బీపీఈడీ పరీక్షకు 1,307 మంది హాజరవగా 1,252 (95.79%), డీపీఈడీ పరీక్షలో 460 మందికి 426 (92.61%) మంది ఉత్తీర్ణత సాధించారని ఆచార్య ఎస్ఎస్ దిలీప్ తెలిపారు.

కోలుకున్న హరీశ్‌రావు

» కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : వైరల్ ఫీవర్‌తో 'కిమ్స్ సన్‌షైన్' ఆస్పత్రిలో చేరిన బీఆర్ఎస్ నేత, మాజీమంత్రి హరీశ్‌రావు కోలుకోవడంతో డిశ్చార్జి అయ్యారు. స్వల్ప అస్వస్థతతో సోమవారం సాయంత్రం ఆయన బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిలో చేరిన విషయం విదితమే. హరీశ్‌రావు ఆరోగ్యం మెరుగుపడడంతో వైద్యులు ఆయన్ను మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు డిశ్చార్జి చేశారు. కాగా మంగళవారం ఉదయం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హరీశ్‌రావును బీఆర్ఎస్ నేతలు వద్దిరాజు రవిచంద్ర, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, రవీందర్ తక్కళ్లపల్లి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు.

సరి'హద్దు'లు దాటిన ఫోన్ ట్యాపింగ్

(మొదటిపేజీ తరువాయి)

అబ్జర్వేషన్‌లో పెట్టారని సిట్ గుర్తించినట్లు సమాచారం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రతిపక్ష నేతలతోపాటు సొంత పార్టీల నేతలు, పలువురు జడ్జీలు, ఇతరుల ఫోన్లు కూడా ట్యాపింగ్ అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఫోన్లు ట్యాప్ అయిన రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, జర్నలిస్టులు, ఇతరుల వాంగ్మూలాలు తీసుకుంటున్నారు. మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, గద్వాలకు చెందిన కాంగ్రెస్ నాయకురాలు సరిత, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి వాంగ్మూలాన్ని సిట్ అధికారులు నమోదు చేశారు.

ఎవరి ఆదేశాలతో ఆధారాల ధ్వంసం?

అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రత్యేక వార్ రూములు ఏర్పాటు చేసి ఫోన్ ట్యాపింగ్ చేసిన సమాచారాన్ని.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తోందని స్పష్టమైన వెంటనే ప్రభాకర్‌రావు తన శిష్యుడు ప్రణీత్‌రావు ద్వారా ధ్వంసం చేయించినట్టు ఇప్పటికే వెల్లడైంది. అయితే డేటా ధ్వంసానికి ముందు ఏం జరిగింది? ప్రభాకర్‌రావు, ఆయన బృందం ఎవరెవరితో ఫోన్‌లు మాట్లాడారన్న అంశాలను తేల్చేందుకు సిట్ అధికారులు వారి కాల్‌డేటా, టవర్ లోకేషన్ల విశ్లేషణ ద్వారా ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఇప్పటివరకు మూడు విడతలు సిట్ విచారణకు హాజరైన ప్రభాకర్‌రావు.. నాటి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాను పనిచేశానని చెప్పినట్టు తెలిసింది. ఈ క్రమంలో మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి, నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, నాటి హోంశాఖ కార్యదర్శి రవిగుప్తా నుంచి సాక్షులుగా వాంగ్మూలాలను నమోదు చేయాలని సిట్ అధికారులు భావిస్తున్నట్టు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారమంతా మావోయిస్టులపై నిఘా పేరిట జరిగిన రాజకీయ ఆపరేషన్ కావడంతో... ప్రభాకర్‌రావుకు ఏ నాయకులు ఈ ఆదేశాలు ఇచ్చారన్నది తేల్చడానికి సిట్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. నాటి సీఎం కేసీఆర్, అప్పటి మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల ప్రోద్బలంతోనే ప్రభాకర్‌రావు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే ప్రభాకర్‌రావు ఇప్పటివరకు విచారణలో కేసీఆర్ పేరుగానీ, మరెవరి పేర్లుగానీ బయటపెట్టలేదని సమాచారం.



ట్యాపింగ్ కేసులో వాంగ్మూలం ఇవ్వడానికి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు వెళ్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

నేడు నాలుగోసారి ప్రభాకర్‌రావు విచారణ

ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు బుధవారం నాలుగోసారి సిట్ ముందు విచారణకు హాజరవుతున్నారు. ఈ కేసులో అరెస్టయిన ప్రణీత్‌రావు, భుజంగరావు, రాధాకిషన్‌రావు, తిరుపతన్నను మరోసారి విచారించేందుకు.. అవసరమైతే వీరందరినీ కలిపి ఒకేసారి ప్రశ్నించేందుకు సిట్ సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది. ప్రభాకర్‌రావు ఎవరు చెబితే ఫోన్ ట్యాపింగ్ చేశారన్న అంశాన్ని బుధవారం నిర్ధారించుకోవాలని అధికారులు సిద్ధమైనట్టు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రభాకర్‌రావు ఆదేశాలతో కాంగ్రెస్, బీజేపీ నేతల ఫోన్లను ప్రణీత్ బృందం ట్యాప్ చేసి, ఆ సమాచారాన్ని భుజంగరావుకు చేరవేసిందని, ఆయన ఈ సమాచారాన్ని బీఆర్ఎస్ నాయకత్వానికి అందించేవారని సిట్ విచారణలో గుర్తించినట్టు తెలిసింది. ఇక కొందరు వ్యాపారవేత్తల ఫోన్లు ట్యాప్ చేసి, బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు వసూలు చేసిన ఆరోపణలనూ తేల్చడంపై సిట్ దృష్టి పెట్టినట్టు సమాచారం. ఈ మేరకు నిందితుల బ్యాంకు లావాదేవీలు, వారి సన్నిహితులు, బినామీల లావాదేవీలను సైతం పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

నేడు సిట్ ముందుకు బీజేపీ నేతలు!

ఫోన్ ట్యాపింగ్ కేసులో వాంగ్మూలం నమోదు కోసం బీజేపీ నేతలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందన్‌రావులను బుధవారం విచారణకు రావాలని సిట్ పిలిచినట్టు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమ ఫోన్లను ప్రభాకర్‌రావు బృందం ట్యాప్ చేసిందని.. ఆర్థిక సాయం అందకుండా అడ్డుకోవడంతోపాటు వ్యూహాలను తెలుసుకోవడం కోసం ప్రత్యేకంగా నిఘా పెట్టిందని బీజేపీ నేతలు గతంలోనే ఆరోపించారు. కాగా, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జెడ్పీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు పట్లోళ్ల మహిపాల్‌రెడ్డి డ్రైవర్ జగదీశ్వర్‌ను వాంగ్మూలం నమోదు కోసం పిలిచినట్టు సమాచారం.

రాజకీయ కుట్రతోనే ట్యాపింగ్: మహేశ్‌గౌడ్

రాజకీయ కుట్రలో భాగంగానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 650 మంది నేతలతో పాటు బీజేపీ, టీడీపీ నేతల ఫోన్లనూ అప్పటి ప్రభుత్వం ట్యాప్ చేసిందని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులకు వాంగ్మూలం ఇచ్చిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 2023 ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులకు తల్లొగ్గి అప్పటి సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ, హోం సెక్రటరీ ఫోన్ ట్యాపింగ్ జరిపించారని ఆరోపించారు. హోదా లేని ప్రభాకర్‌రావును ఐజీ హోదాలో ఎస్ఐబీలో కూర్చోబెట్టి ఫోన్ ట్యాపింగ్ చేయించారని పేర్కొన్నారు. తమను నక్సలైట్ల సానుభూతిపరులుగా చూపిస్తూ ఫోన్లను ట్యాప్ చేశారని చెప్పారు. కాగా, సిట్ అధికారులకు వాంగ్మూలం ఇచ్చిన అనంతరం టీపీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తనను రాజకీయంగా అణగదొక్కేందుకు కుట్రలు చేసిందని, తనతోపాటు, అనుచరులు, డ్రైవర్ ఫోన్ కూడా ట్యాప్ చేశారని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా గెలవకుండా అప్పటి అధికార బీఆర్ఎస్ నాయకులు కుట్రతో ఫోన్ ట్యాపింగ్ చేయించారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి మండిపడ్డారు.

మీపై చర్యలు ఎందుకు తీసుకోరాదు?

38 మంది 'కాళేశ్వరం' బాధ్యులకు షోకాజ్ నోటీసులు

విజిలెన్స్ నివేదిక ఆధారంగా సర్కారు చర్యలు

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో బాధ్యులైన అధికారులపై ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. 38 మందికి షోకాజు నోటీసులు జారీ చేసింది. మంగళవారం కొందరికి ఈ నోటీసులు అందగా.. బుధవారం మిగిలిన వారికి చేరనున్నాయి. ఇక కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల వైఫల్యానికి కారకులుగా భావించే 17 మందిపై నేరపూరిత కేసులో విచారణ చేపట్టాలని, 33 మందిపై శాఖాపరమైన చర్యలు, పదవీ విరమణ చేసిన ఏడుగురికి నిబంధనలు అనుసరించి పెన్షన్‌లో కోత విధిస్తూ జరిమానాలు వేయాలని విజిలెన్స్ కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసిన విషయం తెలిసిందే. మొత్తం 57 మందిపై చర్యలకు సిఫారసు చేయగా.. ఒక్కొక్కరిపై రెండు, మూడు కేసులు ఉండడంతో అంతా కలిపి 38 మందిగా గుర్తించి, నోటీసులు ఇచ్చే పని ప్రారంభించారు. 'మీపై వచ్చిన అభియోగాలపై ఎందుకు చర్యలు తీసుకోరాదో వివరణ ఇవ్వండి' అని అందరికీ ఒకే నమూనాలో నోటీసులు పంపారు. ఈ నోటీసులకు వారంలో వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. వివరణ అందిన తర్వాత, దాన్ని పరిశీలించి.. క్రిమినల్ కేసులు పెట్టాలా? శాఖాపరమైన చర్యలు తీసుకోవాలా? పెన్షన్‌లో కోత విధించాలా? అనే దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. వీరే కాకుండా ప్రాణహిత-చేవెళ్ల రీ డిజైన్ చేసిన సమయంతో పాటు మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకు కుంగిపోయేదాకా నీటిపారుదల, ఆర్థిక శాఖల ముఖ్యకార్యదర్శులుగా పనిచేసిన వారిపైనా చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ కమిషన్ సిఫారసు చేసింది. సరైన కారణాల్లేకుండా ప్రాజెక్టు రీ డిజైన్ ప్రతిపాదనలను ఆమోదించిన వారిపై చర్యలకు ఉపక్రమించాలని సూచించింది. వారిపై ఏం చర్యలు తీసుకుంటారనేది తేలాల్సి ఉంది. ఇక విజిలెన్స్ కమిషన్ 17 మందిపై క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు సిఫారసు చేయగా.. అందులో 10 మంది పదవీ విరమణ చేశారు. మిగిలిన ఏడుగురిలో ఇద్దరు ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. మిగిలేది ఐదుగురే. 33 మందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సిఫారసు చేయగా.. వారిలో 8 మంది రిటైర్ అయ్యారు. 25 మంది సర్వీసులో ఉన్నారు.

జస్టిస్ ఘోష్ నివేదిక పరిస్థితేంటో?

కాళేశ్వరం కమిషన్ ఈ నెలాఖరున లేదా జూలై తొలివారంలో ప్రభుత్వానికి నివేదిక అందించే అవకాశాలున్నాయి. ప్రధానంగా ప్రజాప్రతినిధులతో పాటు 24 మందికి పైగా అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందిగా సిఫారసు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఆ నివేదిక ప్రభుత్వానికి అందిన తర్వాత పరిస్థితి ఏంటనేది తేలాల్సి ఉంది.

కేటీఆర్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లో ఏముంది?

» ఫార్ములా-ఈ వ్యవహారంలో వాట్సా‌ప్‌లో ఆదేశాలిచ్చారా?

» పరిశీలించేందుకు సిద్ధమైన ఏసీబీ

» ఆయన సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్ తమకు అప్పగించాలని ఆదేశం

» విదేశాలకు వెళ్లిన అరవింద్ కుమార్‌కు వెంటనే వెనక్కిరావాలని ప్రభుత్వ ఆదేశం!

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కార్ల రేసు వ్యవహారంలో, ముఖ్యంగా రేసు నిర్వహణ సంస్థ ఎఫ్ఈఓ (ఫార్ములా-ఈ ఆపరేషన్స్)కు నిధుల జారీకి సంబంధించి కేటీఆర్ తన వాట్సా‌ప్ ద్వారా అరవింద్‌కుమార్‌కు ఆదేశాలు ఇచ్చారనే కోణంలో ఏసీబీ అధికారులు విచారణ జరుపుతున్నట్టు తెలిసింది. హెచ్ఎండీఏ ఖాతాల నుంచి ఎఫ్ఈఓకు నిధులు బదిలీ చేసే ముందు తనకు, కేటీఆర్‌కు మధ్య జరిగిన వాట్సాప్ సంభాషణల విషయమై ఏసీబీ విచారణ సందర్భంగా అరవింద్ కుమార్ వివరించినట్టు సమాచారం. దీనితో ఆ సమయంలో ఉపయోగించిన సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌ను తమకు అప్పగించాలని కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు ఆదేశించినట్టు తెలిసింది. మరోవైపు ఈ కేసులో ఏ2 నిందితుడైన ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ వ్యక్తిగత సెలవుపై విదేశాలకు వెళ్లడంపై సీఎంకు ఏసీబీ అధికారులు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో అరవింద్ కుమార్ సెలవు రద్దు చేసుకుని, వెంటనే వెనక్కి రావాలని సీఎస్ కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్లినట్టు తెలిసింది.



లాయర్ల బృందంతో కేటీఆర్ భేటీ..

తన మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్ ఇవ్వాలని ఏసీబీ కోరిన నేపథ్యంలో కేటీఆర్ మంగళవారం హైదరాబాద్‌లో తమ న్యాయవాదుల బృందంతో భేటీ అయి చర్చించారు. ఈ క్రమంలో ప్రభుత్వ లావాదేవీలకు సంబంధించి ఎలాంటి కోర్టు ఉత్తర్వులు లేకుండా మొబైల్ ఫోన్లు అడిగే హక్కు ఏసీబీకి లేదని న్యాయవాదుల బృందం అభిప్రాయపడినట్టు సమాచారం. గతంలో హైకోర్టు, సుప్రీంకోర్టుల తీర్పుల ప్రకారం కేటీఆర్ తన మొబైల్, లాప్‌టాప్‌ను ఏసీబీకి ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొన్నట్టు తెలిసింది. విచారణ సంస్థలు ఒక పౌరుడి నుంచి సేకరించిన సమాచారాన్ని తిరిగి అదే పౌరుడిపై వాడే కుట్ర చేయడం అన్యాయమని హైకోర్టులు, సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని పేర్కొన్నట్టు సమాచారం.

మహేశ్‌గౌడ్‌కు కేటీఆర్ లీగల్ నోటీస్

ట్యాపింగ్ పేరిట తమ పార్టీనేతలపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ దిగజారుడు వ్యాఖ్యలు చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. తమపై ఎటువంటి సాక్ష్యాధారాల్లేకుండా, అసత్య ఆరోపణలు చేసిన మహేశ్‌గౌడ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మహేశ్‌గౌడ్‌కు లీగల్ నోటీసులు పంపినట్టు తెలిపారు. అడ్డగోలుగా మాట్లాడితే బీఆర్ఎస్ శ్రేణులు చూస్తూ ఊరుకోబోవని, కాంగ్రెస్ నేతలకు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. రాజకీయ పబ్బం కోసం దుర్మార్గ పూరిత వ్యాఖ్యలు చేస్తే మహేశ్ గౌడ్ వంటి నాయకులను కోర్టులకు ఈడుస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలకు ఎన్ఎంసీ షోకాజ్‌లు!

» తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్‌లోని అన్ని కళాశాలలకూ జారీ

» దక్షిణాది రాష్ట్రాల్లోని 98 శాతం కాలేజీలకు...

» ప్రభుత్వం వివరణ ఇవ్వడంతో తెలంగాణలో 9 కాలేజీలకు ఇచ్చిన నోటీసుల ఉపసంహరణ

» మిగతా 25 కళాశాలలకు సంబంధించి హామీ ఇచ్చేందుకు ఎన్ఎంసీ ముందుకు అధికారులు

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణతో పాటు ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని ఇంచుమించు అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. తెలంగాణలో గాంధీ, ఉస్మానియాతో సహా మొత్తం 34 కాలేజీలకూ నోటీసులు ఇచ్చింది. ఎన్ఎంసీ నిబంధనల మేరకు సౌకర్యాలు లేని కాలేజీలకు నోటీసులు ఇస్తుంటుంది. ప్రతీ ఏటా విద్యా సంవత్సరం ఆరంభంలో ఇది పరిపాటిగా మారింది. ఈ ఐదు రాష్ట్రాల్లో మొత్తం 120 ప్రభుత్వ వైద్య కళాశాలలకు 118కి (98 శాతం) నోటీసులు జారీ చేసింది. పశ్చిమ బెంగాల్‌లో 27 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉంటే అన్నింటికీ, ఉత్తరప్రదేశ్‌లో 46కు 24, గుజరాత్‌లో 23కు 10, మధ్యప్రదేశ్‌లో 17కు గాను నాలుగింటికి నోటీసులు ఇచ్చినట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి. మిగతా రాష్ట్రాల సంగతి తెలియాల్సి ఉంది. వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత, ల్యాబొరేటరీల పనితీరు బాగోకపోవడం, రేడియాలజీ మిషన్లు (సిటీ, ఎంఆర్ఐ) లేకపోవడం, పడకలు, బోధనాస్పత్రుల్లోని శస్త్రచికిత్సలు, రోగుల సంఖ్య, పడకలు తగినన్ని ఉండకపోవడం తదితర కారణాలతో ఎన్ఎంసీ షోకాజ్ నోటీసులు ఇచ్చింది. నోటీసుల్లో పేర్కొన్న లోపాలను సరిదిద్దుకునేందుకు కాలేజీలకు అవకాశం కల్పించింది. తెలంగాణ వైద్య శాఖ ఇచ్చిన వివరణతో 9 కాలేజీలకు ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకుంది. మిగతా వాటికి కూడా ప్రభుత్వం ఇచ్చే రాతపూర్వక హామీతో నోటీసులు ఉపసంహరించుకునే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు, డీఎంఈ డాక్టర్ నరేందర్ కుమార్ బుధవారం ఢిల్లీ వెళ్లనున్నారు. ఎన్ఎంసీ ముందు హాజరై మిగతా కాలేజీలకు సంబంధించి రాతపూర్వక హామీ ఇవ్వనున్నారు. దీంతో ఒక్క ఎంబీబీఎస్ సీటు కూడా కోల్పోయే ప్రమాదం ఉండదని ఎన్ఎంసీ అధికారులు హామీ ఇచ్చినట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి. నాలుగేళ్లుగా వివిధ రాష్ట్రాల్లోని కాలేజీలకు నోటీసులు వస్తూనే ఉన్నాయని, కానీ నోటీసులు రావడం ఇదే మొదటిసారి అన్నట్టు... తెలంగాణలోని కాలేజీలకు మాత్రమే వచ్చినట్టు తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదని నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. 'ఒకేసారి ఎక్కువ కాలేజీలు ఏర్పాటు చేయడం వల్ల ఫ్యాకల్టీ కొరత, మౌలిక వసతుల కల్పనలో ఇబ్బందులు వచ్చాయి. వాటిని అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ల పెంపునకు సుముఖం

» ఆ దిశగా కృషి జరుగుతోంది .. హైకోర్టుకు తెలపనున్న రాష్ట్రం

» అఫిడవిట్ సమర్పణకు సన్నాహాలు

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను అమలు చేయడానికి ఇంతవరకు జరిగిన కృషిని వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో అఫిడవిట్‌ను దాఖలు చేసేందుకు సిద్ధమవుతోంది. బీసీ రిజర్వేషన్లను ఖరారు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు వెళ్లాలంటూ దాఖలైన పిటిషన్లపై వైఖరిని తెలియజేస్తూ మూడు నెలల్లో అఫిడవిట్‌ను సమర్పించాలని గత ఏడాది సెప్టెంబర్‌లోనే హైకోర్టు ఆదేశించింది. దాంతో రిజర్వేషన్ల కల్పనకు సంబంధించి ఇంతవరకు చేసిన ప్రయత్నాలను వివరిస్తూ ప్రమాణ పత్రాన్ని అందజేయనుంది. బీసీల రిజర్వేషన్ల పెంపుదలపై సుముఖంగా ఉన్నట్టు తెలపనుంది. బీసీల లెక్కలను తేల్చేందుకు చేపట్టిన కులసర్వే, అందులో తేలిన కులాల వివరాలు, బీసీ రిజర్వేషన్లను పెంచేందుకు డెడికేటెడ్ కమిషన్‌ను నియమించడం, అది ఇచ్చిన నివేదిక ఆధారంగా శాసనసభలో బిల్లులను పెట్టి ఆమోదించడం, ఆ బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి పంపడం తదితర విషయాలను వివరించనుంది. ప్రస్తుతం స్థానిక సంస్థల్లో ఉన్న రిజర్వేషన్ల పరిస్థితిని కూడా ప్రస్తావించనుంది. ఎస్సీలు, ఎస్టీలకు వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఉండగా, బీసీలకు సుమారు 23శాతం అమలవుతున్నాయి. అందువల్ల బీసీలకు రిజర్వేషన్లను పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తోంది. ఆమోదించడంలో కేంద్రం జాప్యం చేసినా, అసలు దానిని పరిగణలోకి తీసుకోకున్నా.. కోర్టులో వచ్చే నిర్ణయాన్నే అనుసరించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 50 శాతానికి మించి మొత్తం రిజర్వేషన్లు ఉండకూడదన్న అంశాన్ని ఉద్ఘాటిస్తే గత ఎన్నికల్లో అమలైన బీసీ రిజర్వేషన్ల ప్రకారమే ముందుకెళ్లాల్సి ఉంటుంది. అలాంటప్పుడు ఎన్నికల్లో మాట ఇచ్చినందున పార్టీ పరంగా 42శాతం రిజర్వేషన్లను ఇచ్చేందుకు సిద్ధమవుతోంది.



ఇందిరాపార్కు వద్ద మహాధర్నాలో మాట్లాడుతున్న కె నారాయణ

ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలి

కేంద్రం మావోయిస్టులతో చర్చలు జరపాలి

మహాధర్నాలో పలువురు వక్తల డిమాండ్

కవాడిగూడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదివాసీలపై కొనసాగిస్తున్న హత్యాకాండను వెంటనే నిలిపి వేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం కాల్పుల విరమణను ప్రకటించి మావోయిస్టు పార్టీ నేతలతో బేషరతుగా శాంతి చర్చలు జరిపి అడవుల్లో ఆదివాసీలకు జీవించే హక్కును పునరుద్ధరించాలన్నారు. సమాజంలో శాంతిని కాపాడి, ప్రజల రాజ్యాంగపరమైన హక్కులను రక్షించాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని వారు పేర్కొన్నారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షతన మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం ప్రశ్నించే గొంతులపై సైనిక బలప్రయోగం చేస్తోందన్నారు. ఇప్పటికైనా కేంద్రం వెంటనే స్పందించి మావోయిస్టు నేతలతో చర్చలు జరిపి ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలని ఆయన కోరారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం టెర్రరిస్టులను, నక్సలైట్లను ఒకే విధంగా చూస్తున్నారని, టెర్రరిస్టులు, మావోయిస్టులు వేరని చెప్పారు. నక్సల్స్ ముక్త్ భారత్ కాదని అమిత్‌షా, మోదీ ముక్త్ భారత్ కావాలని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. చర్చలకు సిద్ధం అంటూ ప్రకటించిన మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేయడం సరికాదన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ.. మావోయిస్టులను చంపడం కాదని, జల్ జంగల్ జమీన్ నినాదానికి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీపీఎం నేత తమ్మినేని వీరభద్రం, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, ఎం. అనిల్‌కుమార్ యాదవ్, సినీ దర్శకుడు ఆర్. నారాయణమూర్తి, ఎమ్మెల్సీలు కోదండరాం, దాసోజు శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

21న అన్ని పాఠశాలల్లో యోగా దినోత్సవం

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ సూచించారు. ఉదయం 6:30 నుంచి 7:45 గంటల వరకు ఈ కార్యక్రమం చేపట్టాలని ఆయన మంగళవారం అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులను ఆదేశించారు. నిర్వహణకు సంబంధించి ఆయుష్ మంత్రిత్వ శాఖ పేర్కొన్న మార్గదర్శకాలను పాటించాలని కోరారు.

ఢిల్లీకి సీఎం రేవంత్.!

» ఇంగ్లండ్ మాజీ ప్రధాని టోనిబ్లెయిర్‌తో భేటీ

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీ వెళ్లనున్నారు. రేపు, ఎల్లుండి రెండ్రోజులపాటు అక్కడే ఉండనున్నట్టు సమాచారం. పెట్టుబడులకు సంబంధించి కీలక భేటీలో పాల్గొంటారని తెలిసింది. అలాగే పార్టీ అధిష్ఠానాన్ని, పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నారు. ఇంగ్లండ్ మాజీ ప్రధాని టోనీబ్లెయిర్‌తో సీఎం రేవంత్ సమావేశం కానున్నట్టు సమాచారం. టోనీబ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ చేంజ్ (టీబీఐ)అనే ఎన్‌జీవోను బ్లెయిర్ నడిపిస్తున్నారు. ఇది అనేక దేశాల్లో పనిచేస్తోంది. ఈ క్రమంలో ఆయనతో భేటీ అయి పలు విషయాలపై చర్చించనున్నారు. కాగా ఏపీ టీడీపీ మంత్రి లోకేశ్ కూడా టోని బ్లెయిర్‌తో సమావేశమవనున్నట్టు తెలిసింది.

ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించే బాధ్యత కలెక్టర్లదే

» భూ సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వండి

» నూతన కలెక్టర్లతో రెవెన్యూ మంత్రి పొంగులేటి



ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించే బాధ్యత కలెక్టర్లదే అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల కొత్తగా నియమితులైన కలెక్టర్లు సచివాలయంలో మంత్రిని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతుల కష్టాలు, బాధలకు విముక్తి కల్పించేలా భూ సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రెవెన్యూ సదస్సుల్లో వస్తున్న దరఖాస్తుల పరిష్కారానికి ఆగస్టు 15 వరకు గడువు విధించినందున న్యాయబద్ధమైన దరఖాస్తులన్నీ పరిష్కరించాలని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన మొదలై ఏడాదిన్నర అయిందని, ఎవరూ ఊహించని రీతిలో భూ సమస్యలను పరిష్కరిస్తూ, సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ఈ ప్రభుత్వం చేపడుతోందని వివరించారు.

గాంధీభవన్‌లో నేడు తుమ్మల ముఖాముఖి

గాంధీభవన్‌లో నిర్వహించే ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజల నుంచి బుధవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వినతిపత్రాలు స్వీకరించనున్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమం.. మధ్యాహ్నం ఒంటిగంట వరకూ కొనసాగనుంది. వినతిపత్రాలు స్వీకరించడంతోపాటు వీలైనవాటిని తుమ్మల నాగేశ్వరరావు అక్కడే పరిష్కరించనున్నారు.

గురుకుల ప్రవేశాలు త్వరగా పూర్తి చేయాలి

» ఒక్క సీటూ ఖాళీగా ఉండకూడదు: మంత్రి పొన్నం



హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. గురుకులాల్లో ఒక్క సీటు కూడా ఖాళీ లేకుండా భర్తీ చేయడానికి చొరవ తీసుకోవాలని సూచించారు. సచివాలయంలో మంగళవారం ఆయన బీసీ సంక్షేమం, రవాణా శాఖల అధికారులతో సమావేశమై కార్యకలాపాలను సమీక్షించారు. గురుకుల విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు తక్షణం అందించాలన్నారు. విద్యాప్రమాణాలు పెంచడానికి అధికారులు నిరంతరం తనిఖీలు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిరంతర ప్రక్రియగా చేపట్టాలని మంత్రి పొన్నం సూచించారు. కాగా, రాష్ట్రంలో ఇప్పటి వరకు 186.5కోట్ల మంది మహిళలు రూ.6,222 కోట్లవిలువైన ఉచిత ప్రయాణాన్ని చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మహా లక్ష్మి పథకంను విజయవంతంగా అమలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులను అభినందించారు.

పట్టణ రోడ్లకు దీటుగా పల్లెరోడ్లు

» హ్యామ్ విధానంలో 18,472 కి.మీ రోడ్ల ఆధునికీకరణ

» రెండు రోజుల్లో మార్గదర్శకాలు: మంత్రి సీతక్క



హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణ రోడ్లకు దీటుగా ప్రజలకు సౌకర్యంగా ఉండేలా.. హ్యామ్(హైబ్రిడ్ యాన్యుటీ మోడల్)విధానంలో పల్లెరోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. సచివాలయంలో సంబంధిత అధికారులతో మంత్రి మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హ్యామ్ విధానంలో గ్రామీణ ప్రాంతాల రోడ్ల నిర్మాణానికి ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో ఆమోదం లభించిందని, ఈ ప్రాజెక్టుకు సంబంధించి మార్గదర్శకాలతో రెండు రోజుల్లో జీవో విడుదల చేస్తామన్నారు. ఈ విధానం ద్వారా రాష్ట్రంలో 18,472 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులను ఆధునికీకరిస్తామని తెలిపారు. అదేవిధంగా ఎంపీడీవోల బదిలీల ఫైలు సీఎం వద్ద ఉందని, వారికి సంబంధించిన వాహనాల భత్యం ఫైల్ ఆర్థిక శాఖ వద్దకు చేరిందని, ఈ రెండు ఫైళ్లకు కొద్దిరోజుల్లో అనుమతి రానుందని మంత్రి సీతక్క వెల్లడించారు.

మరో రూ.4 వేలు కోట్ల అప్పు

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రూ.4000 కోట్ల అప్పు చేసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఈ-వేలంలో బహిరంగ మార్కెట్ నుంచి ఈ రుణాన్ని సేకరించింది. 33 ఏళ్ల కాల పరిమితి 7.09 శాతం వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు, 34 ఏళ్ల కాల పరిమితి 7.09 శాతం వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు, 35ఏళ్ల కాల పరిమితి 7.09 శాతం వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు, 36 ఏళ్ల కాల పరిమితి 7.09 శాతం వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు.. మొత్తం రూ.4000 కోట్లు సేకరించింది.

పోలీసింగ్‌లో తెలంగాణ టాప్

» డ్రగ్స్, సైబర్ నేరాలకట్టడికి పటిష్ఠ చర్యలు: డీజీపీ జితేందర్

వికారాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉత్తమ సేవలు అందించడంలో తెలంగాణ పోలీసు విభాగం దేశంలోనే మొదటి స్థానంలో ఉందని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. మాదకద్రవ్యాల నిరోధానికి పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కేసుల్లో నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టడం లేదని, విదేశాల నుంచి కూడా అరెస్టు చేసి తీసుకొస్తున్నామన్నారు. గత ఏడాది 30 వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణలో కూడా తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. జిల్లాల పర్యటనలో భాగంగా మంగళవారం వికారాబాద్ జిల్లా పోలీసు కేంద్ర కార్యాలయానికి వచ్చిన డీజీపీ.. విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సైబర్ నేరాల కేసుల్లో గత ఏడాది రూ.185 కోట్లను బాధితులకు ఇప్పించగా, ఇటీవల జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో రూ.50 కోట్లు ఇప్పించామని తెలిపారు.

నేటి నుంచి టెట్ పరీక్షలు

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 15 జిల్లాల్లో 66 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని, అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని టీజీటెట్ చైర్‌పర్సన్, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు. పరీక్షకు మొత్తం 1,83,653 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో పేపర్-1 కోసం 63,261, పేపర్-2 కోసం 1,20,392 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉపాధ్యాయ అర్హత పరీక్షను ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహిస్తుండగా.. ఈ ఏడాదికి సంబంధించి ఇది మొదటి పరీక్ష కానుంది.

గో సంరక్షణకు ఎంత ఖర్చైనా వెనుకాడం

(మొదటిపేజీ తరువాయి)

వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఈ కమిటీలో ఉన్నారు. గో సంరక్షణపై రేవంత్ రెడ్డి మంగళవారం సాయంత్రం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. మన సంస్కృతిలో గోవులకు ఉన్న ప్రాధాన్యం, భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకోవాలని అధికారులకు సూచించారు. గోశాలలకు భక్తులు పెద్ద సంఖ్యలో గోవులను దానం చేస్తున్నారని, కానీ వాటి సంరక్షణకు తగినంత స్థలం లేకపోవడం, ఇతర సమస్యలతో అవి ఎక్కువ సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను అధిగమించేందుకు రాష్ట్రంలో తొలుత నాలుగు ప్రాంతాల్లో అత్యాధునిక వసతులతో గోశాలలు నిర్మించాలని సీఎం ఆదేశించారు. వేములవాడ, యాదగిరిగుట్ట, హైదరాబాద్ నగర సమీపంలోని ఎనికేపల్లి, పశుసంవర్ధక శాఖ విశ్వవిద్యాలయం సమీపంలోని విశాల ప్రదేశాల్లో తొలుత గోశాలలు నిర్మించాలన్నారు. వేములవాడలో కోడెల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కనబర్చాలని సీఎం సూచించారు. వేములవాడ సమీపంలో వంద ఎకరాలకు తక్కువ కాకుండా గోశాల ఉండాలన్నారు. అనంతరం రాష్ట్రంలో గోశాలల నిర్వహణకు సంబంధించిన విధానపత్రాన్ని అధికారులు సీఎంకు అందజేశారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, సీఎంవో ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, శ్రీనివాసరాజు, పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.



గో సంరక్షణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, చిత్రంలో మంత్రి శ్రీహరి


సీఎంను కలిసిన మంత్రి వివేక్

సీఎం రేవంత్‌రెడ్డిని మంత్రి వివేక్ వెంకటస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. కుటుంబ సమేతంగా సీఎంను కలిసిన ఆయన.. తనను మంత్రిని చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

బనకచర్లను అడ్డుకుందాం!

(మొదటిపేజీ తరువాయి)

జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ సందర్భంగా గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు కలిగే అనర్థాలను వివరిస్తూ నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ (పీపీటీ) ఇవ్వనున్నారు. పీపీటీ అనంతరం ప్రాజెక్టుపై ఎంపీల అభిప్రాయాలను ప్రభుత్వం సేకరించనుంది. ఇక ప్రాజెక్టుకు ఎటువంటి సహాయం చేయరాదని కోరుతూ కేంద్రానికి రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల ఎంపీలతో కలిసి లేఖ రాసే అవకాశాలున్నాయి. ఇక బనకచర్ల ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతి కోసం విధివిధానాలు(టీవోఆర్-టర్మ్ అండ్ రిఫరెన్స్) జారీ చేయరాదని కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖల మంత్రి భూపేంద్రయాదవ్‌కు.. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అధికారికంగా కేంద్ర పర్యావరణ శాఖ కార్యదర్శికి రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జాలు మంగళవారం లేఖ రాసినా ప్రయోజనం లేకుండా పోయింది. తెలంగాణ అభ్యంతరాలేవీ పట్టించుకోకుండా పర్యావరణ అనుమతులు తీసుకోవడానికి ఏయే ప్రక్రియలు అనుసరించాలి..? ఎటువంటి చర్యలు తీసుకోవాలనే దానిపై టీవోఆర్ జారీ చేయాలని కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ నిపుణుల మదింపు కమిటీ మంగళవారం నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి ఏ ప్రభుత్వమైనా టీవోఆర్ కోసం దరఖాస్తు చేసుకున్నా.. అందుకు అంగీకారం తెలపడం నిపుణుల మదింపు కమిటీ బాధ్యత. ఆ తర్వాత నిబంధనల ప్రకారం ప్రాజెక్టు నిర్మిస్తారా..? లేదా..? అనేది పర్యావరణ అనుమతి ఇచ్చే క్రమంలో పరిశీలిస్తారు. తాజా పరిణామాలతో తెలంగాణలో రాజకీయాలు వేడెక్కాయి. గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టును సమర్థిస్తూ మంగళవారం ఏపీ జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వగా.. బుధవారం ఇక్కడ మంత్రి ఉత్తమ్ పీపీటీ ఇవ్వనున్నారు. దాంతో పోటాపోటీగా పీపీటీల ప్రదర్శన జరుగుతోంది. ఇప్పటికే బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా ఈ ప్రాజెక్టుపై పీపీటీ ఇవ్వడమే కాకుండా మధ్యేమార్గంగా తీసుకోవాల్సిన చర్యలపై ఉత్తమ్‌కు లేఖ కూడా రాశారు.



పాత ప్రాజెక్టే.. కొత్తగా..

వాస్తవానికి గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు పాతదే. 2018లోనే ఈ ప్రాజెక్టులో భాగంగా గోదావరి-పెన్నా అనుసంధానాన్ని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. అప్పట్లో ఏపీ శాసనసభలో గవర్నర్ ప్రసంగంలోనూ దీన్ని ప్రస్తావించారు. ఆ తర్వాత దీనిపేరును 2019లో పల్నాడు మిటిగేషన్ ప్రాజెక్టుగా మార్చి.. పలు ప్యాకేజీలకు టెండర్లు పిలిచారు. ఈ ప్రాజెక్టుకు గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌కు సమాచారం ఉన్నప్పటికీ.. ఆ పార్టీ మౌనంగానే ఉండిపోయింది. తాజాగా ఏపీలో టీడీపీ అధికారంలోకి వచ్చాక గోదావరి-బనకచర్ల పేరుతో ప్రాజెక్టును ప్రతిపాదించారు. పోలవరం విస్తరణలో భాగంగా కుడి కాలువ నుంచి 200 టీఎంసీల నీటిని ప్రకాశం బ్యారేజీలో తరలించనున్నారు. అక్కడి నుంచి నాగార్జునసాగర్ కుడికాలువపై ఎస్కేప్ ఛానల్ ద్వారా ఏపీలోని పల్నాడు జిల్లాలో కొత్తగా నిర్మించతలపెట్టిన 173 టీఎంసీల సామర్థ్యం కలిగిన బొల్లాపల్లి రిజర్వాయర్‌లోకి నీటిని పంపిస్తారు. అక్కడి నుంచి సొరంగాలు, ఓపెన్ కెనాల్ ద్వారా బనకచర్లకు నీటిని తరలించాలనేది ఏపీ ఉద్దేశం. రూ.80 వేల కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు కేంద్ర సహాయాన్ని ఏపీ అభ్యర్థిస్తోంది. ఇప్పటికే ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక(పీఎఫ్ఆర్)ను కేంద్రానికి అందించగా.. కేంద్ర జలవనరుల సంఘం ఈ నివేదికను ప్రాజెక్టు ప్రభావిత రాష్ట్రాలైన తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిసా, ఛత్తీస్‌గఢ్ లతో పాటు.. గోదావరి, కృష్ణా నది యాజమాన్య బోర్డులకు పంపించింది. పీఎఫ్ఆర్‌పై ఆయా రాష్ట్రాల అభిప్రాయాలను కోరింది. కాగా, అఖిలపక్ష ఎంపీల భేటీకి బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల హాజరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సమావేశానికి హాజరుకావడానికి సుముఖత వ్యక్తం చేశారు. దాంతో అధికార కాంగ్రెస్ కు చెందిన 8 మంది లోక్‌సభ, ఇద్దరు రాజ్యసభ సభ్యులు, ఒక మజ్లిస్ సభ్యుడు కలిపి 11 మంది సమావేశానికి హాజరయ్యే అవకాశాలున్నాయి.

ఇప్పటికే కేంద్రానికి తెలంగాణ లేఖాస్త్రాలు

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ఇప్పటికే కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం పలు లేఖలు రాసింది. ఈ ప్రాజెక్టును గోదావరి ట్రైబ్యునల్-1980 తీర్పునకు వ్యతిరేకంగా, 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టానికి వ్యతిరేకంగా చేపడుతున్నారని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్రయాదవ్‌లకు తెలంగాణ లేఖలు రాసింది.తాజాగా రాసిన లేఖకు కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ బదులిస్తూ.. 'గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు డీపీఆర్ కేంద్ర ప్రభుత్వానికి అందలేదని మంత్రి ఉత్తమ్‌కు లేఖ రాశారు. 'డీపీఆర్ అందితే ప్రస్తుత మార్గదర్శకాలు, ట్రైబ్యునల్ అవార్డులు/అంతర్‌రాష్ట్ర ఒప్పందాలు, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని వివిధ నిబంధనల ప్రకారమే పరిశీలిస్తాం' అని పేర్కొన్నారు. లేఖలే కాకుండా ఈ అంశంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలిద్దరూ కూడా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను స్వయంగా కలిసి విజ్ఞప్తి చేశారు.



33/11 కేవీ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు

ఇంజనీర్లు కడితే బ్యారేజీలు దెబ్బతినేవి కాదు

» కేసీఆర్ ఇంజనీర్ అవతారమెత్తడం వల్లే కొరగాకుండాపోయిన కాళేశ్వరం

» కాంగ్రెస్ హయాంలో కట్టిన ఏ ప్రాజెక్టూ దెబ్బతినలేదు: డిప్యూటీ సీఎం భట్టి

భూపాలపల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఇంజనీర్ల సూచనల మేరకు నిర్మించి ఉంటే దెబ్బతినేవి కాదని, కేసీఆర్ ఇంజనీర్ అవతారమెత్తి తప్పుడు పద్ధతుల్లో కట్టడం వల్లే లక్ష కోట్లు ఖర్చు చేసినా ఆ ప్రాజెక్టు ఎందుకూ కొరగాకుండాపోయిందని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క విమర్శించారు. భూపాలపల్లి జిల్లా చెన్నాపూర్ వద్ద నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను భట్టి ప్రారంభించారు. అనంతరం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభ వేదిక వద్ద మంజూర్‌నగర్, నవాబుపేట, ధర్మారావుపేటలో రూ.7.30 కోట్లతో నిర్మించ తలపెట్టిన విద్యుత్ సబ్ స్టేషన్లకు మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సభలో భట్టి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో నిర్మించిన శ్రీరాం సాగర్, ఎల్లంపల్లి, జూరాల, నాగర్జున సాగర్ వంటి ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరకుండా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాయన్నారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం సరైన ఇంజనీరింగ్ పద్ధతులను అనుసరించకపోవటంతో లక్ష కోట్లు గోదాట్లో పోసినట్లయిందని విమర్శించారు.

కొత్త రైతులకూ 'భరోసా'!

(మొదటిపేజీ తరువాయి)

వర్తింపజేయాలని నిర్ణయించారు. ఈ వానాకాలం (2025-26) సీజన్‌కు వచ్చేసరికి పాత రైతులతోపాటు కొత్త రైతులకు కూడా రైతు భరోసాను ఎలాంటి పరిమితులు విధించకుండా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేసింది. భూభారతి(ధరణి) పోర్టల్ ప్రకారం... రిజిస్ట్రేషన్ ఎవరి పేరుమీద ఉంటే వారికి రైతు భరోసా చెల్లించాలని, యాజమాన్య హక్కులు పొందిన రైతుల వివరాలను రైతు భరోసా పోర్టల్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. అయితే 2023-24లో 6,32,898 వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు జరిగాయి. 2024-25లో 5,87,313 భూముల రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటిలో కొందరు రైతులు రైతు భరోసా పథకంలోకి వచ్చారు. మరికొందరు రైతులను పథకంలో చేర్చలేదు. ఇప్పుడు వారందరికీ అవకాశం కల్పించారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా ఏఈవోలు (వ్యవసాయ విస్తరణాధికారులు) రైతు భరోసా లబ్ధిదారుల నమోదు ప్రక్రియను చేపడుతున్నారు. సీసీఎల్ఏ నుంచి వచ్చిన డేటా ఆధారంగా రైతుల నుంచి ధ్రువపత్రాలు సేకరించాలని ఆదేశాలు జారీ చేశారు. పట్టాదారు, బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్సు కాపీలను ఏఈవోలకు ఇస్తే... వారు రైతు భరోసా పోర్టల్‌లో రైతుల వివరాలు నమోదు చేస్తారు. ఈ వివరాల నమోదుకు ఈ నెల 20 వరకు గడువు ఇచ్చారు. అంటే మూడు రోజుల సమయం ఉంది. ఈ మూడు రోజుల్లో కొత్త రైతుల వివరాలు నమోదు చేస్తే వాళ్ల లబ్ధిదారుల జాబితాలోకి వస్తారు.

3 ఎకరాల వరకు రైతుభరోసా జమ!

» రైతుల ఖాతాలకు 1,552 కోట్లు బదిలీ

» 2 రోజుల్లో రూ.3,902 కోట్ల నగదు

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మూడెకరాల్లోపు వ్యవసాయ భూమి గల రైతులకు వారి ఖాతాల్లో రైతు భరోసా జమ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా మూడెకరాల భూమి గల రైతులు 10.45 లక్షల మందికి 25.86 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఎకరానికి రూ.6,000 చొప్పున 10.45 లక్షల మంది రైతులకు రూ. 1,552 కోట్ల నగదు బదిలీ చేశారు. తొలి రోజు సోమవారం రెండెకరాల్లోపు భూమి గల 41.25 లక్షల మంది రైతులకు 39.16 లక్షల ఎకరాలకు రూ.2,350 కోట్ల నగదును సర్కారు బదిలీ చేసింది. రెండు రోజుల్లో (16,17 తేదీల్లో)నే రాష్ట్ర ప్రభుత్వం 51.70 లక్షల మంది రైతులకు రైతు భరోసా కింద రూ.3,902 కోట్ల నగదును బదిలీ చేసింది. ఎటువంటి పరిమితుల్లేకుండా రైతులందరికీ రైతు భరోసా చెల్లిస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ పెట్టుబడి సాయాన్ని రైతులు వానాకాలం పంటల సాగుకు వినియోగించుకోవాలని సూచించారు. సుమారు 1.50 కోట్ల ఎకరాల భూమికి ప్రస్తుత సీజన్‌లో రైతు భరోసా ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే.

అనుమతులు పొందాకే బనకచర్ల నిర్మాణం

» రాజకీయ దురుద్దేశాలతోనే తెలంగాణ నేతల ఫిర్యాదులు: ఏపీ మంత్రి నిమ్మల



అమరావతి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అనుమతులన్నీ పొందాకే పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం నిర్మిస్తామని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టంచేశారు. రాజకీయ దురుద్దేశాలతోనే తెలంగాణ నేతలు కేంద్రానికి ఫిర్యాదులు చేస్తున్నారని ఆరోపించారు. పథకాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రాజెక్టులకు సీఎం చంద్రబాబు వ్యతిరేకం కాదని.. అందుకే కాళేశ్వరం సహా పలు ప్రాజెక్టులను అక్కడి ప్రభుత్వం పూర్తి చేసుకోగలిగిందని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణను డైవర్ట్ చేసేందుకే బీఆర్ఎస్ నేతలు బనకచర్ల ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. మంగళవారం ఆయన పోలవరం-బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గతంలో గోదావరి జలాలను తెలంగాణ భూభాగం నుంచి నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాలకు రోజుకు 4 టీఎంసీల చొప్పున వంద రోజుల పాటు 400 టీఎంసీలను తరలిస్తామని.. నాటి ఉభయ రాష్ట్రాల సీఎంలు కేసీఆర్, జగన్ ఉమ్మడిగా ప్రకటించలేదా అని నిలదీశారు. రాష్ట్రానికి ద్రోహం చేసేలా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతుంటే.. మాజీ ముఖ్యమంత్రి జగన్ ఎందుకు నోరువిప్పడం లేదని ప్రశ్నించారు. గతంలో తెలంగాణ అసెంబ్లీలో, రాయలసీమ ప్రాంతం నగరిలో, అమరావతిలో జగన్‌ను కేసీఆర్ కలిసిన సందర్భంలోనూ.. సముద్రంలోకి వృథాగా పోతున్న గోదావరి జలాల్లో 1000 టీఎంసీలను అనుసంధానం ద్వారా మళ్లిస్తేనే రాయలసీమ అభివృద్ధి చెందుతుందని అన్నారని.. ఆ మాటలను ఇప్పుడు బీఆర్ఎస్ నేతలే ఎందుకు వ్యతిరేకిస్తున్నారని నిలదీశారు. సముద్రంలో వృథాగా పోయే వరద జలాలను దారిమళ్లించేలా బనకచర్ల అనుసంధాన పథకాన్ని నిర్మిస్తుంటే తెలంగాణ నేతలు అడ్డు చెబుతున్నారని.. మరి తెలంగాణకు నిబంధనలు వర్తించవా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రాజెక్టులను ముఖ్యమంత్రి చంద్రబాబు అడ్డుకుంటున్నారంటూ విష ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. 'గోదావరి, కృష్ణా బోర్డుల అనుమతులు లేకుండా కేసీఆర్ ప్రాజెక్టులను నిర్మించలేదా? విభజన చట్టానికి భిన్నంగా.. అపెక్స్ కౌన్సిల్ ఆమోదం పొందకుండానే ప్రాజెక్టులకు టెండర్లను పిలిచి పనులు చేయలేదా? కాళేశ్వరం, సీతారామ సాగర్, పాలమూరు-రంగారెడ్డి, సమ్మక్క బ్యారేజీ తదితర ప్రాజెక్టులను అనుమతుల్లేకుండానే చేపట్టలేదా? చంద్రబాబు అడ్డుకుని ఉంటే అవి పూర్తయ్యేవా? అని నిలదీశారు.

బనకచర్లతో సముద్రానికే నష్టం

బనకచర్ల అనుసంధాన పథకాన్ని నిర్మిస్తే.. ఎగువ రాష్ట్రమైన తెలంగాణకు ఎలాంటి నష్టమూ ఉండదని నిమ్మల స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా రోజుకు రెండు టీఎంసీల వరద జలాలను వంద రోజుల పాటు తీసుకెళ్తామన్నారు. సముద్రంలో కలుస్తున్న 3,000 టీఎంసీలలో 200 టీఎంసీలు తగ్గుతాయని.. ప్రాజెక్టును నిర్మిస్తే 200 టీఎంసీలను సముద్రమే కోల్పోతుందని వ్యాఖ్యానించారు. అవసరమైన అన్ని అనుమతులూ సాధించాకే.. టెండర్లు పిలిచి.. బనకచర్ల నిర్మాణం చేపడతామని తేల్చిచెప్పారు. ఆలోపు తెలంగాణ నేతల విమర్శలపై రాయలసీమకు చెందిన వ్యక్తిగా.. రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా జగన్ నోరువిప్పాలని మంత్రి కోరారు.

కాళేశ్వరం బ్యారేజీల నిర్ణయం కేసీఆర్‌దే!

మంత్రివర్గం, ఉప సంఘానికి సంబంధం లేదు.. కేసీఆర్, హరీశ్, ఈటల చెప్పినవన్నీ కల్పితాలే

» 13న జస్టిస్ ఘోష్‌కు ఆధారాలు ఇచ్చిన ప్రభుత్వం



హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కట్టాలనే నిర్ణయం మంత్రివర్గం తీసుకోలేదని, ఆ నిర్ణయం అప్పటి సీఎం కేసీఆర్ స్థాయిలోనే తీసుకున్నారని ప్రభుత్వం స్పష్టం చేసింది. కాళేశ్వరం బ్యారేజీలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు ఈ నెల 11న హాజరైన మాజీ సీఎం కేసీఆర్.. బ్యారేజీల నిర్ణయం తానొక్కడిని తీసుకోలేదని, ఆ నిర్ణయం మొత్తం మంత్రివర్గానిదని చెప్పిన విషయం విదితమే. ఈ నెల 6న హాజరైన ఈటల రాజేందర్, 9న హాజరైన మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మరోవైపు బ్యారేజీలపై నిర్ణయం తీసుకోవడానికి వీలుగా అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఈటల రాజేందర్ సభ్యులుగా వేసిన మంత్రి వర్గ ఉపసంఘం బ్యారేజీల నిర్మాణాలపై సిఫార్సు చేసిందని కూడా విచారణలో వీరంతా వివరించారు. అయితే అదంతా అవాస్తవమని తుమ్మల ఖండించారు. కాగా, ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటూ.. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణానికి రూ.2,591 కోట్లతో పరిపాలనా అనుమతినివ్వాలని అప్పటి ఈఎన్‌సీ(ఇరిగేషన్) సి.మురళీధర్ 2016 ఫిబ్రవరి 18న ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దానికి అనుమతినిస్తూ సర్కారు 2016 మార్చి 1న జీవో.231 జారీ చేసింది. 14 రోజుల తర్వాత అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు చైర్మన్‌గా, ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావులను సభ్యులుగా నియమిస్తూ మార్చి 15న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ జీవో.655 ఇచ్చారని ప్రభుత్వం కమిషన్‌కు గుర్తు చేసింది.

మంత్రివర్గ సమావేశం లేకుండానే నిర్ణయాలు..

కేసీఆర్, హరీశ్, ఈటల ఒకే వాదన వినిపించడంతో వాస్తవాలేంటో మరోమారు తెలుసుకోవాలని నిర్ణయించిన జస్టిస్ ఘోష్ ఈనెల 13న ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో అదే రోజు ఆ ముగ్గురు చెప్పినవన్నీ కల్పితాలే అని నిరూపించే పత్రాలన్నీ కమిషన్‌కు ప్రభుత్వం అందించింది. ఆయా పత్రాలతో పీసీ ఘోష్ అదే రోజు కోల్‌కతాకు వెళ్లిపోయారు. 2015 ఏప్రిల్ 2న మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మించేందుకు అవసరమైన డీపీఆర్ తయారీ బాధ్యతలు వ్యాప్కోస్‌కు అప్పగించడానికి అనుమతి కోరుతూ నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శికి చీఫ్ ఇంజనీర్ లేఖ రాయగా.. 2015 ఏప్రిల్ 13న డీపీఆర్ తయారీ బాధ్యతలు వ్యాప్కోస్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కట్టాలనే నిర్ణయాలకు అప్పటిదాకా ఏ మంత్రివర్గ సమావేశం జరగలేదని ప్రభుత్వం కమిషన్‌కు ఆధారాలతో వివరించింది. ఈ నిర్ణయాలన్నీ అప్పటి సీఎం కేసీఆర్ తీసుకున్నవేనని, ఆ తర్వాత మంత్రివర్గ ఉపసంఘం వేసినా.. కాళేశ్వరం బ్యారేజీలకు సంబంధం లేదని, ఇతర ప్రాజెక్టుల రీ ఇంజనీరింగ్ కోసం ఈ కమిటీ వేశారని మంత్రివర్గ ఉపసంఘం తీర్మానం ప్రతులను కూడా కమిషన్‌కు ప్రభుత్వం అందించింది. సీఎం స్థాయిలోనే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం కోసం నిర్ణయాలు తీసుకుని, ఆ ప్రాంతంలోనే బ్యారేజీలు కట్టడానికి అనువుగా డీపీఆర్ ఇవ్వాలని వ్యాప్కోస్‌ను ప్రభుత్వం కోరిందని పేర్కొంది. బ్యారేజీలు ఎక్కడ కట్టాలనే నిర్ణయాన్ని వ్యాప్కోస్ తీసుకోలేదని, ప్రభుత్వం నిర్దేశించిన స్థలాల్లో కట్టడానికి అనుకూలంగా మాత్రమే వ్యాప్కోస్ డీపీఆర్ ఇచ్చిందని ప్రభుత్వం కమిషన్‌కు నివేదించింది. వాస్తవానికి ఈ పత్రాలన్నీ ఏడాది కిందటే కమిషన్ విచారణ ప్రారంభం కావడానికి ముందే ఇవ్వగా.. తాజాగా కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లు వాంగ్మూలాలు ఇచ్చిన నేపథ్యంలో మరోమారు పత్రాలను కమిషన్‌కు ఇచ్చారు. ఆధారాలన్నీ అందడంతో నివేదికకు తుదిరూపు ఇచ్చే పనిలో కమిషన్ ఉంది.



సమావేశంలో పాల్గొన్న పలు పార్టీల ఎంపీలు, ఎమ్మెల్యేలు

సౌర విద్యుత్‌పై అవగాహన పెంచాలి

- గ్రామీణులను ప్రోత్సహించాలి
- సౌర విద్యుద్దీకరణపై భేటీలో ఎంపీల సూచన

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పునరుత్పాదక ఇంధన లక్ష్యాల పెంపు దిశగా ప్రజాప్రతినిధులు ఐక్యంగా ముందుకెళ్లాలని పలువురు ఎంపీలు పేర్కొన్నారు. 'భారత సౌర విద్యుద్దీకరణ ప్రస్థానంలో ప్రజా ప్రతినిధుల పాత్ర' అనే అంశంపై స్వానితి అనే సంస్థ మంగళవారం ట్యాంక్‌బండ్ వద్ద గల మారియట్ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఎంపీలు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పునరుత్పాదక ఇంధన పథకాలను సమర్థంగా ఉపయోగించుకునేందుకు స్వయం సాధికారత దిశగా గ్రామీణులను ప్రోత్సహించాలని సూచించారు. సౌర విద్యుత్ వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచడానికి కలిసి పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో రాజకీయాలకతీతంగా రాష్ట్ర ఎంపీలు బలరామ్ నాయక్, మల్లురవి, కిరణ్‌కుమార్ రెడ్డి, రఘురామ్‌రెడ్డి (కాంగ్రెస్), కొండా విశ్వేశ్వర్ రెడ్డి (బీజేపీ), ఎమ్మెల్యేలు గోపికృష్ణ, మందుల శామ్యూల్, కుచుకుళ్ల రాజేష్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, కె.సత్యనారాయణ, బీర్ల ఐలయ్య, మేఘారెడ్డి తుది, జారే ఆదినారాయణ, వేముల వీరేశం, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ పాల్గొన్నారు. తెలంగాణ రెడ్కో చైర్‌పర్సన్ అనిలా మాట్లాడుతూ గ్రామాల్లో సౌర శక్తి వినియోగం పెంచుకునేందుకు పలు అవకాశాలున్నాయని చెప్పారు. స్వానితి ట్రస్టీ ఉమా భట్టాచార్య మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు పూర్తి మద్దతు ఉంటుందన్నారు.

ఇంధన దుర్వినియోగం పేరుతో బహ్రెయిన్‌లో 9 మంది తెలంగాణవాసుల అరెస్టు

- ఆదుకోవాలని ప్రభుత్వానికి కుటుంబ సభ్యుల వినతి

బేగంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఇంధనాన్ని దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై బహ్రెయిన్‌లోని అల్ మోయ్యాద్ కంపెనీలో డ్రైవర్లుగా పని చేస్తున్న తొమ్మిది మంది తెలంగాణ వాసులను అక్కడి ప్రభుత్వం అరెస్టు చేసింది. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నేరెళ్లకు చెందిన బొమ్మిడి సుదర్శన్ (డ్రైవర్)తో పాటు మరో ఎనిమిది మంది ఈ కేసులో ఈనెల 4న అరెస్ట్ అయ్యారని కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. వారికి న్యాయ సహాయం అందించాలని కోరుతూ సుదర్శన్ కుమారుడు నితిన్ మంగళవారం హైదరాబాద్‌లో ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్‌చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులను కలిసి సమస్యను వివరించారు.

ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు..

- ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో హెల్ప్‌లైన్

న్యూఢిల్లీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఇరాన్-ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసింది. ఆ దేశాల్లో నివసిస్తున్న, ప్రయాణిస్తున్న తెలంగాణ వాసులు, విద్యార్థులు సహాయం కోసం హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించింది. సహాయం కోసం రెసిడెంట్ కమిషనర్ పీఎస్ వందన(+91 9871999044), లైజన్ ఆఫీసర్లు రక్షిత్ నాయక్(+91 9643723157), జావేద్ హుస్సేన్ (+91 9910014749), పౌర సంబంధాల అధికారి సీహెచ్ చక్రవర్తి(+91 9949351270)లను సంప్రదించాలని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.


నార్సింగ్ మునిసిపల్ కమిషనర్ సంతకం ఫోర్జరీ

- ఫోర్జరీ పత్రాలతో మార్ట్‌గేజ్ ప్లాట్‌ల విడుదలకు ప్రయత్నం

నార్సింగ్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తన పేరు, సంతకం ఫోర్జరీ అయ్యాయని, విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ శివారు నార్సింగ్ మునిసిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి స్థానిక పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే.. మార్వా టౌన్‌షిప్‌లో ఓ అపార్ట్‌మెంట్ నిర్మించిన కొంతమంది అందులోని మార్ట్‌గేజ్ ప్లాట్‌లను విడుదల చేస్తూ ఫోర్జరీ డాక్యుమెంట్లు తయారు చేశారు. వాటిపై కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేశారు. సీహెచ్ శివనాగేశ్వరరావు అనే ఓ వ్యక్తి మునిసిపల్ సీనియర్ అసిస్టెంట్‌ని అంటూ ఒక ఫేక్ ఐడీ కార్డు తయారు చేసుకున్నాడు. దాని ఆధారంగా ఈ ఫోర్జరీకి పాల్పడ్డాడు. ప్లాట్‌లను అమ్మేందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లగా, గండిపేట సబ్‌రిజిస్ట్రార్‌కు మునిసిపల్ కమిషనర్ సంతకంపై అనుమానం కలిగింది. ఈ విషయాన్ని ఆయన కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే అది తన సంతకం కాదని ఫోర్జరీ జరిగిందని గ్రహించిన ఆయన నార్సింగ్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

అమర్ సొసైటీలో ఉమ్మడి స్థలంపై నిర్ణయం తీసుకోండి: హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగంపేట్ గ్రామపరిధిలోని సర్వే నెంబర్ 47లో ఉన్న అమర్ సొసైటీలో సౌకర్యాల కోసం ఏర్పాటు చేసిన కామన్ ఏరియాపై నిర్ణయం తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అమర్ సొసైటీలో కమ్యూనిటీ సౌకర్యాలు, వాణిజ్యం కోసం కేటాయించిన 1,334 చదరపు గజాల స్థలంపై ఆ సొసైటీకి అమిత్ అగర్వాల్, కృష్ణ అగర్వాల్‌లకు మధ్య వివాదం నెలకొంది. ఆ స్థలంలో ప్రహరీ నిర్మించారంటూ సొసైటీ జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేసింది. అయినా చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ కె. లక్ష్మణ్ ధర్మాసనం.. ఇరువర్గాల వాదనలకు తగిన అవకాశం ఇచ్చి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీచైతన్య విద్యా సంస్థల డైరెక్టర్లు సుష్మ బొప్పన, సీమ బొప్పన చిత్రంలో చెస్ చాంపియన్ గుకేష్

ఘనంగా శ్రీచైతన్య 'ఐరావత్' చాంపియన్స్ వేడుక

- ముఖ్య అతిథులుగా చెస్ చాంపియన్ గుకేష్, సినీ నటుడు అడివి శేష్
- జేఈఈ, నీట్ విజేతలకు సన్మానం

హైదరాబాద్/హైటెక్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): హైటెక్ సిటీ శిల్పకళా వేదికలో శ్రీచైతన్య 'ఐరావత్ చాంపియన్స్' వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జేఈఈ, నీట్ పరీక్షల్లో జాతీయ స్థాయి ర్యాంకులు సాధించిన తమ విద్యార్థులను శ్రీచైతన్య విద్యాసంస్థ సన్మానించింది. కార్యక్రమానికి ప్రపంచ చెస్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు, సినీనటుడు అడివి శేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షల ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థలు మరోసారి అగ్రస్థానాన్ని సాధించి ఆలిండియా నంబర్ వన్‌గా నిలిచాయని విద్యాసంస్థల డైరెక్టర్లు సుష్మ బొప్పన, సీమ బొప్పన, శ్రీధర్ యలమంచిలి తెలిపారు. శ్రీచైతన్య విద్యా సంస్థల బ్రాండ్ అంబాసిడర్‌గా చెస్ చాంపియన్ గుకేష్‌ను నియమించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం గుకేష్ దొమ్మరాజు మాట్లాడుతూ.. చదరంగం మాదిరిగానే జేఈఈ, నీట్ పరీక్షల్లో విజయానికి వ్యూహాత్మక ఆలోచన, క్రమ శిక్షణ, మానసిక స్థైర్యం ఎంతో అవసరమని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో హోరెత్తించారు.

హైదరాబాద్ ఎయిర్ పోర్టు రికార్డు



- గత నెల 27.91 లక్షల మంది ప్రయాణికులు
- పురోగతిలో ఢిల్లీ విమానాశ్రయం కంటే ముందంజ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సరికొత్త రికార్డు సృష్టించింది. ఎయిర్‌పోర్టు ప్రారంభమైన తర్వాత గత నెల అత్యధిక మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ప్రయాణికుల పురోగతిలో ఢిల్లీ కంటే హైదరాబాద్ విమానాశ్రయం ముందంజలో ఉంది. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నిర్వాహణ సంస్థ జీఎంఆర్ మంగళవారం తమ ఆధ్వర్యంలో నడుస్తున్న ఐదు విమానాశ్రాయలకు సంబంధించి మే నెలలో పురోగతిపై ఓ ప్రకటనను విడుదల చేసింది. గత నెల ఐదు విమానాశ్రయాల నుంచి కోటి మంది ప్రయాణికులు రాకపోకలు సాగించినట్లు జీఎంఆర్ సంస్థ వెల్లడించింది. ఏప్రిల్ నెలతో పోలిస్తే మే నెలలో జీఎంఆర్ విమానాశ్రాయాల్లో సగటు ప్రయాణికుల పురోగతి 0.8శాతంగా ఉంది. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం అత్యధికంగా 15.3% పురోగతి నమోదైంది. అదే సమయంలో ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయ ప్రయాణికులు 4.5% మేర తగ్గడం గమనార్హం.! మే నెలలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రికార్డుస్థాయిలో 27,91,217 మంది దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ సంఖ్య 62,49,600గా నమోదైంది. హైదరాబాద్ విమానాశ్రయం నుంచి కొత్త సర్వీసులను ప్రారంభించడం కూడా ప్రయాణికుల సంఖ్య పెరగడానికి కారణమని తెలుస్తోంది.

రోజూ లక్షకు చేరువలో..

హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం రోజువారీ ప్రయాణికుల సంఖ్య దాదాపు లక్షకు చేరువైంది. ప్రస్తుతం రోజుకు 95వేల నుంచి 97వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. హైదరాబాద్ విమానాశ్రయం నుంచి దేశంలోని 74 ప్రాంతాలకు, విదేశాల్లోని 21 ప్రాంతాలకు ప్రతిరోజూ సగటున 620 విమానాలు నేరుగా సేవలందిస్తున్నాయి.

'తుక్కుగూడ డబుల్ ఇళ్ల' లబ్ధిదారుల జాబితా కొట్టివేత

- అర్హులైన పిటిషనర్లు, ఇతర స్థానికులకు ఇళ్లు ఇవ్వాలి
- మూడు నెలల్లో కేటాయించాలని హైకోర్టు ఆదేశం



హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ మునిసిపాలిటీ పరిధిలోని మంకాళ్‌లో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లకు సంబంధించి 2023 సెప్టెంబరు 2న ప్రకటించిన లబ్ధిదారుల జాబితాను, ఇళ్ల కేటాయింపును హైకోర్టు కొట్టివేసింది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని మలక్‌పేట్, చార్మినార్ తదితర ప్రాంతాలకు చెందిన వారికి ఇక్కడ ఇళ్లు కేటాయించడం చెల్లదని.. స్థానికులమైన తమకు అర్హత ఉన్నప్పటికీ ఇళ్లు కేటాయించడం లేదని పేర్కొంటూ ఐనాల లక్ష్మమ్మ మరో 13 మంది మంకాళ్ గ్రామస్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపున న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించిన గ్రామానికి చెందిన వారన్నారు. భూసేకరణ ద్వారా 9.20ఎకరాలు స్థానిక పట్టాదారుల నుంచి సేకరించి, 2700 డబుల్ ఇళ్లు నిర్మించారని తెలిపారు. తాము ఇళ్ల కోసం ఎదురు చూస్తుండగా 2023 సెప్టెంబరు 2న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ లబ్ధిదారుల జాబితా విడుదల చేశారని.. జీహెచ్‌ఎంసీ పరిధిలోని మలక్‌పేట, యాకుత్‌పురా, చార్మినార్, చంద్రాయణగుట్ట తదితర ప్రాంతాలకు చెందిన వారికి ఇళ్లు కేటాయించారని వివరించారు. ఆ జాబితాను కొట్టేసి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హత ఉన్న పిటిషనర్లు, స్థానికులకు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం తరపు న్యాయవాదులు వాదిస్తూ.. అవి జీహెచ్‌ఎంసీ పరిధిలోని పేదల కోసం నిర్మించామని, అయినప్పటికీ స్థానిక కోటా కింద కూడా కొన్ని ఇళ్లు కేటాయించామని తెలిపారు. లబ్ధిదారుల జాబితా నిబంధనల ప్రకారమే ఉందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వ జీవో 10 ప్రకారం చూసినా రూరల్ జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీలకు 50%, మైనారిటీలకు 7%, మిగిలినవి ఇతరులకు కేటాయించాలని, అలాగే అర్బన్ జిల్లాలకు ఎస్సీలకు 17%, ఎస్టీలకు 6, మైనారిటీలకు 12%, మిగతావి ఇతరులకు కేటాయించాల్సి ఉంటుందని స్పష్టంచేసింది. 'ఒక నియోజకవర్గానికి కేటాయించిన ఇళ్లకు జిల్లా మంత్రి, ఎమ్మెల్యే 50:50 శాతం నిష్పత్తితో లబ్ధిదారులను ఎంపిక చేస్తారని జీవోలో ఉంది. సదరు లబ్ధిదారుల జాబితాలను స్థానిక తహసీల్దార్ లేదా జీహెచ్‌ఎంసీ అధికారులు తనిఖీ చేసి గ్రామ సభ ఎదుట ఉంచాలి. సామాజిక, ఆర్థిక, కుల గణాంకాల ప్రకారం పరిశీలించి జిల్లా కలెక్టర్ లేదా జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు పంపాలి. 2015లో జీవో 12, 2020లో జీవో 3 ద్వారా డబుల్ ఇళ్లకు సంబంధించి అదనపు మార్గదర్శకాలు విడుదల చేశారు. వాటి ప్రకారం కూడా స్థానికులకు వెయ్యి యూనిట్లు లేదా 10% కేటాయించాలని ఉంది. ప్రస్తుత కేసులో 14 మంది పిటిషనర్లు మహేశ్వరం నియోజకవర్గం/మండల పరిధికి చెందిన వారు. ఆ నియోజకవర్గానికి 400 ఇళ్లు కేటాయించారు. జీవో 3 ప్రకారం చూసినా 10% లేదా వెయ్యి యూనిట్లు కేటాయించాలి. 2023 సెప్టెంబరు 2న లబ్ధిదారుల జాబితా పరిశీలిస్తే ప్రభుత్వ అధికారులు మార్గదర్శకాలను పాటించలేదని స్పష్టమవుతోంది. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్, చేవెళ్ల నియోజకవర్గాలకు మార్గదర్శకాల ప్రకారం ఇళ్లు లభించలేదు' అని ధర్మాసనం పేర్కొంది. లబ్ధిదారుల జాబితాను కొట్టేస్తున్నట్లు ప్రకటించింది. జీవోల ప్రకారం పిటిషనర్లు, ఇతర స్థానికుల అర్హతను పరిశీలించి 3 నెలల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని పేర్కొంది.

రంగారెడ్డి జిల్లాలో కొత్త జాబితాలు ప్రకటించాలి: వీరేందర్‌గౌడ్

తుక్కుగూడలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను బీఆర్‌ఎస్ సర్కారు జీహెచ్‌ఎంసీ పరిధిలోని వారికి కేటాయించడం అక్రమమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ అన్నారు. అందుకే హైకోర్టు ఆ జాబితాను కొట్టివేసిందన్నారు. వాస్తవానికి తుక్కుగూడలో కట్టిన ఇళ్లలో ఏకంగా 89% అంటే 2,400 ఇళ్లను ముస్లింలు, అందునా స్థానికేతరులకు కేటాయించారని చెప్పారు. తుక్కుగూడ ప్రాంతంలో ముస్లింల జనాభా 50% కంటే ఎక్కువగా మారేలా వ్యవహరించారని, ఈ అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. జీవోకు విరుద్ధంగా 89% ఇళ్లు ఒకే వర్గానికి ఎలా ఇచ్చారని కోర్టు ప్రశ్నించిందని వీరేందర్‌గౌడ్ చెప్పారు. ఈ తీర్పును బీజేపీ స్వాగతిస్తోందన్నారు. మొత్తం రంగారెడ్డి జిల్లాలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు జాబితాలన్నీ రద్దు చేసి, కొత్త జాబితాను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

స్వాతంత్ర్య సమర యోధురాలు కొమ్మిడి సుగుణ కన్నుమూత



సుగుణ (ఫైల్)

హైదరాబాద్ సిటీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నిజాం వ్యతిరేక, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కొరియర్‌గా పనిచేసిన కొమ్మిడి సుగుణ(91) ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యం తో బాధపడుతున్న ఆమె సోమవారం రాత్రి 11 గంటలకు కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు(సీఆర్) ఫౌండేషన్ వయోధిక ఆశ్రమంలో తుదిశ్వాస విడిచారు. సుగుణ జీవిత సహచరుడు దివంగత శాఖమూరి వెంకట కృష్ణ ప్రసాద్(ఎస్వీకే ప్రసాద్) చెన్నూరు నియోజకవర్గం తొలి ఎమ్మెల్యేగా సేవలందించారు. సుగుణ స్వస్థలం ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్రాహ్మణపల్లి. ఆమె చిన్నవయసులోనే భువనగిరి ఆంధ్ర మహాసభలో వలంటీర్‌గా పనిచేశారు. సీపీఐ అనుబంధ మహిళా సమాఖ్య కార్యదర్శిగా ఉమ్మడి రాష్ట్రంలో సేవలందించారు. సుగుణ మరణవార్త తెలియగానే అమెరికాలో స్థిరపడిన కుమార్తె డాక్టర్ శోభ, కుమారులు రవి, రమేశ్ బయలుదేరారు. గురువారం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో సుగుణ అంత్యక్రియలు జరుగుతాయి. ఆమె మృతి పట్ల సీపీఐ నాయకులు సురవరం సుధాకరరెడ్డి, నారాయణ, ఎమ్మెల్యే కూనంనేని, స్వాతంత్ర్య సమర యోధుడు కందిమళ్ల ప్రతాపరెడ్డి ఇతర వామపక్ష, ప్రజాసంఘాల ప్రతినిధులు సంతాపం తెలిపారు.

మాజీ సర్పంచుల బిల్లులపై రేవంత్ వ్యాఖ్యలు సరికాదు

- పెద్ది సుదర్శన్ రెడ్డి

మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులతో తమకు సంబంధం లేదని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటం విడ్డూరమని, ఆయన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మాజీ సర్పంచుల బిల్లులు చెల్లించిన తర్వాతనే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు.

బెదిరింపు కేసులో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి ముందస్తు బెయిల్ నిరాకరణ

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి ఒకే కేసుకు సంబంధించి హైకోర్టులో రెండోసారి ఎదురుదెబ్బ తగిలింది. క్వారీ యజమాని మనోజ్‌రెడ్డిని బెదిరించిన కేసులో ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. క్వారీ నడవాలంటే రూ.50 లక్షలు ఇవ్వాలని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి బెదిరిస్తున్నారని పేర్కొంటూ క్వారీ యజమాని మనోజ్‌రెడ్డి భార్య కట్టా ఉమాదేవి హనుమకొండ సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వివిధ సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఈ కేసును కొట్టేయాలని పేర్కొంటూ కౌశిక్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం సోమవారమే కొట్టేసింది. తాజాగా అదే బెదిరింపు కేసులో కౌశిక్ రెడ్డిముందస్తు బెయిల్ ఇవ్వాలని మంగళవారం మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న అదే ధర్మాసనం ముందస్తు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు నోటీసులు జారీచేస్తూ విచారణను ఈనెల 24కు వాయిదా వేసింది.

ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుకు ఊరట

పోడు సాగుకోసం అటవీభూములను ఆక్రమించారనే ఆరోపణపై బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుపై నమోదైన కేసులో దిగువ కోర్టులో ప్రత్యక్ష హాజరు నుంచి హైకోర్టు మినహాయింపు ఇచ్చింది. గ్రామస్థులతో కలిసి అడవిలో చెట్లను నరికేశారని, అటవీ అధికారులను అడ్డుకున్నారంటూ కుమ్రంభీంఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ పీఎస్‌లో కేసు నమోదైంది. ప్రస్తుతం నాంపల్లి ప్రజాప్రతినిధుల మేజిస్ట్రేటు కోర్టులో కేసుపై విచారణ జరుగుతోంది.

బండి సంజయ్‌పై ఎన్నికల కేసు కొట్టివేత

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి హైకోర్టులో ఊరట లభించింది. 2021 ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కోడ్ ఉల్లంఘించడంతోపాటు కొవిడ్ సమయంలో ముందస్తు అనుమతి లేకుండా మిర్యాలగూడ నుంచి సూర్యాపేట వరకు 40 వాహనాలతో కాన్వాయ్‌ను వెంట తెచ్చుకున్నారనే ఆరోపణపై కేసు నమోదైంది. కేసు నిరూపితం కాకపోవడంతో దానిని హైకోర్టు మంగళవారం కొట్టివేసింది.

తెలుగు రాష్ట్రాల యాత్రికులకు శుభవార్త

'గంగా-రామాయణపుణ్యక్షేత్ర యాత్ర' రైలు షురూ!

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక ఆనందం, భారతీయ సంస్కృతి, వారసత్వాలకు పెద్దపీట వేస్తూ ఐఆర్‌సీటీసీ మరో అద్భుతమైన రైలు యాత్రను ప్రారంభించింది. 'గంగా- రామాయణ పుణ్యక్షేత్ర యాత్ర' పేరుతో నిర్వహిస్తున్న భారత్ గౌరవ్ పర్యాటక రైలు రామాయణంలోని పవిత్ర స్థలాలను, గంగా నది తీరాన ఉన్న కొన్ని పుణ్యక్షేత్రాలను సందర్శించే అవకాశాన్ని భక్తులకు కల్పిస్తుంది. ఈ రైలు జూన్ 23న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరి జూలై 1న తిరిగి చేరుకుంటుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక పర్యటనలో భక్తులు వారణాసి(కాశీ), అయోధ్య, నైమిశారణ్యం(లక్నో), ప్రయాగ్‌రాజ్(అలహాబాద్) వంటి ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలను సందర్శించవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు 040-27702407, 9701360701, 9281495845 నెంబర్లను సంప్రదించాలని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు.

కిషన్‌రెడ్డి గారూ.. కొంచెం సమయమివ్వండి

మిమ్మల్ని కలిసి మా సమస్యలు వివరిస్తాం.. నేను పార్టీ సహచరులతో కలిసి వస్తా

- నన్ను మాత్రమే లక్ష్యంగా చేసుకొని.. విడదీసి, అడ్డంకులు సృష్టిస్తున్నారు
- ఇది పార్టీకి ఏమైనా ఉపయోగపడుతుందా?
- వ్యక్తిగత విభేదాలను పక్కనపెడుదాం
- అందరం ఐక్యంగా కలిసి పనిచేద్దాం
- గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలపై స్పందన



ఉస్మానియా ఆస్పత్రిలో రోగిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): "కిషన్‌రెడ్డి గారూ.. మాకు కొంచెం సమయం కేటాయించాల్సిందిగా కోరుతున్నాను. నేను, మన పార్టీ సహచరులు మిమ్మల్ని వ్యక్తిగతంగా కలిసి, సమస్యలను వెల్లడించడం ద్వారా పరస్పర నమ్మకం, స్పష్టతను పునరుద్ధరించాలని కోరుకుంటున్నాం. మీరు ఎక్కడైనా, ఎప్పుడైనా నిర్ణయిస్తే మేము రావడానికి సిద్ధంగా ఉన్నాం. మేము విభజించడానికి కాదు.. ఐక్యతను తీసుకురావడానికి ఇక్కడ ఉన్నాం" అని గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. తనపై కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రాజాసింగ్ స్పందించారు. ఈ మేరకు మంగళవారం రాజాసింగ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. "రాజాసింగ్ ఏమి చెబితే దాన్ని మేము పాటిస్తామని మీరు వ్యాఖ్యానించిన నేపథ్యంలో మీకు విన్నవించుకుంటున్నాను. అందరికీ తగిన గౌరవాన్ని ఇస్తూ, ఈ విషయంపై నేను నేరుగా స్పందించాలనుకుంటున్నా. పార్టీలోని ప్రతి ఒక్కరూ బాగుపడాలి. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలి. నేనెప్పుడూ వ్యక్తిగత లబ్ధి లేదా పదవుల కోసం పని చేయలేదు. నా కృషి ఎప్పుడూ పార్టీని బలోపేతం చేయడంపైనే ఉంటుంది. నన్ను మాత్రమే లక్ష్యంగా చేసుకొని, నన్ను విడదీసి, అడ్డంకులు సృష్టించడం జరుగుతోంది. అయినప్పటికీ నేను పార్టీకి అంకితమైన, నిస్వార్థ సేవ చేస్తున్నా. ఒక ప్రశ్న వేస్తున్నాను.. ఇది పార్టీకి ఏమైనా ఉపయోగపడుతుందా? దయచేసి ఆలోచించండి. ఒక పార్టీ కార్యకర్తను ఇబ్బంది పెడితే ఏం లాభం? ఈ రోజు, నేను నా కోసం కాకుండా.. పార్టీ ఐక్యత కోసం పని చేస్తున్న లక్షలాది కార్యకర్తల మనోబలాన్ని కాపాడుకోవడం కోసం మాట్లాడుతున్నాను. తెలంగాణకు బీజేపీ ప్రభుత్వం అవసరమని ప్రజలు ఆశిస్తున్నారు. విభేదాలను విడిచిపెట్టి, ఐక్యంగా కలిసి పనిచేద్దాం" అని రాజాసింగ్ కోరారు.

ఉస్మానియా ఆస్పత్రిలో దారుణం

'ఉస్మానియా ఆస్పత్రి పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఇక్కడ రోగులకు చికిత్స పొందుందేకు ఉండాల్సిన అనువైన పరిస్థితులు లేవు' అని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ మండిపడ్డారు. మంగళవారం ఆయన ఉస్మానియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు వార్డులు, మార్చురీ, అవుట్‌పేషంట్ల విభాగాన్ని పరిశీలించారు. మార్చురీ వద్ద పరిస్థితి ఘోరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆస్తి కోసం తోబుట్టువులతో కొట్లాడి ఏం సాధిస్తారు?

- తల్లిదండ్రులు ఉన్నంత వరకు పిల్లలు ఆస్తుల్లో వాటా కోరకుండా చట్టం తెస్తే సరి
- తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు చదివి, ఆర్థికంగా స్థిరపడిన వారు కూడా కొద్దిపాటి ఆస్తి కోసం తోబుట్టువులతో తగాదాలు పెట్టుకుని న్యాయస్థానాలను ఆశ్రయిస్తుండడంపై తెలంగాణ హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. కొట్లాటలు పెట్టుకుని ఏం సాధిస్తారని, కోర్టుల చుట్టూ తిరిగి ఆస్తి గెలిచిన వారు కూడా సంతోషంగా ఉండలేరని వ్యాఖ్యానించింది. అసలు, తల్లిదండ్రులు జీవించి ఉన్నంత వరకు పిల్లలు ఆస్తుల్లో వాటాలు కోరకుండా ఉండేలా చట్టం చేస్తే అందరికీ తెలిసి వస్తుందని అభిప్రాయపడింది. 264గజాల స్థలం విషయంలో ఓ కుటుంబంలో నెలకొన్న ఆస్తి తగాదాకు సంబంధించిన పిటిషన్‌ను జస్టిస్ బి. విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. "ఉన్నత చదువులు చదువుకుని.. మంచి ఉద్యోగం చేస్తూ.. ఆర్థికంగా బాగానే ఉన్నా.. స్వల్ప ఆస్తి కోసం సోదరులు, సోదరీమణులతో కొంతమంది కొట్లాడుతున్నారు. ఒకరిపై ఒకరు కేసులు వేసుకుంటూ న్యాయస్థానాలను పెద్ద ఎత్తున ఆశ్రయిస్తున్నారు. అధికారం ఉండి ఉంటే ఆస్తి తగదాల్లో ఆస్తులన్నింటినీ న్యాయస్థానం కస్టడీలోకి తీసుకునేవారం. అప్పుడు అన్ని సమస్యలు పరిష్కారమవుతాయి. ఆస్తి కోసం కొట్లాటలు పెట్టుకుని ఏం సాధిస్తారు? తాజా కేసులో 264 గజాలను ఆరుగురు(తల్లిదండ్రులతో కలిపి) పంచుకోవాలి. దాదాపు 44 గజాల స్థలం కోసం కొట్లాడుతున్నారు. ఆ స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు అధికారులు అనుమతి కూడా ఇవ్వరు. అసలు.. తల్లిదండ్రులు బతికి ఉన్నంత వరకు పిల్లలు ఆస్తుల్లో వాటాను కోరకుండా చట్టం చేస్తే తెలిసివస్తుంది. కుటుంబ సభ్యులతో కొట్లాడి వెయ్యి గజాలు సాధించుకున్నా అది భవిష్యత్‌లో సంతృప్తినివ్వదు' అని ధర్మాసనం పేర్కొంది.

బీసీలకు 42% రిజర్వేషన్లు ఇచ్చాకే.. స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టాలి

- బీసీ సంక్షేమ సంఘం భేటీలో డిమాండ్

పంజాగుట్ట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించిన తరువాతనే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'స్థానిక సంస్థల ఎన్నికలు-బీసీ రిజర్వేషన్ల పెంపు, భవిష్యత్ కార్యాచరణ'పై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్, హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి కులగణపై చిత్తశుద్ధి ఉంటే ముందుగా తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బిల్లుకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఢిల్లీలో చేసిన ధర్నాలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారని, కానీ అఖిలపక్షంతో ఇప్పటి వరకూ ఢిల్లీకి వెళ్లి ప్రధాని కలవకపోవడం బాధాకరమన్నారు. త్వరలో లక్షలాది మందితో బీసీల సింహగర్జన సభ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి, టి.చిరంజీవులు తదితరులు మాట్లాడారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.